నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

1

వరంగల్

బుధవారం | మార్చి 12, 2025 | www.navatelangana.com




## ప్రతి ఎకరాకు సాగునీరందించాలి

- జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద
- రిజర్వార్, పంట పొలాలు పరిశీలన

నవతెలంగాణ-రాయపర్తి

ప్రతి ఎకరాకు సాగునీరు అందించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. మంగళవారం మండలంలోని మైలారం బ్యాలెన్స్ రిజర్వాయర్‌ను సందర్శించారు. రిజర్వాయర్‌లోని నీటిమట్టాన్ని పరిశీలించారు. దిగివకు వెళ్తున్న నీటి వివరాలను ఎస్సారెస్పీ అధికారులను అడిగి తెలుసుకున్నారు. తదుపరి మహబూబ్‌నగర్, ఉకల్, గట్టికల్, జగన్నాథపల్లి గ్రామాలలో క్షేత్రస్థాయిలో అధికారులతో కలిసి కలెక్టర్ వ్యవసాయ పంట పొలాలను, సాగునీరు అందుతున్న తీరును పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ మైలారం బ్యాలెన్సింగ్ రిజర్వార్ నీటి నిలువ సామర్థ్యం గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. వారాబంది నీటి విడుదల విషయంలో తగు జాగ్రత్తలు తీసుకుంటూ చివరి పంట వరకు రబీ సీజన్ పంట చేతికి వచ్చేవరకు రైతులకు ఎలాంటి నష్టం జరగకుండా అందించాలన్నారు. శ్రీరామ్ సాగర్ ప్రాజెక్ట్ డీబీఎం 54, 57 కాలువ ద్వారా రబి సీజన్ పంటకు నీరు సమృద్ధిగా అందేలా చర్యలు తీసుకోవాలని ఎస్సారెస్పీ అధికారులను ఆదేశించారు. ఫర్టిలైజర్ షాపుల్లో బయోమెట్రిక్ విధానాన్ని తప్పక పాటించాలని హెచ్చరించారు. అమెతోపాటు జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ, ఇరిగేషన్ ఈఈ రమేష్‌బాబు, డీఈ కిరణ్ కుమార్, తాహసిల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ కిషన్ నాయక్, ఏవో వీరభద్రం, ఆర్ఐ చంద్ర మోహన్ తదితరులు ఉన్నారు.

## కాంగ్రెస్ నాయకుల ఆగడాలకు పోలీసుల అండ

- నియోజకవర్గంలో అదుపు తప్పిన శాంతి భద్రతలు..
- సీపీ విచారణ చేపట్టి చర్యలు చేపట్టాలి
- మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి



నవతెలంగాణ-నర్సంపేట

నియోజకవర్గంలో కాంగ్రెస్ నాయకుల ఆగడాలకు పోలీసులు అండగా నిలుస్తున్నారని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కాంగ్రెస్ నాయకులు భూఆక్రమణలకు పాల్పడుతూ దాడులకు పాల్పడుతున్నారని తెలిపారు. 15 నెలలుగా చేస్తున్న అరాచకాలకు, కబ్జాల పట్ల చర్యలు తీసుకోవాల్సిన అధికారులు, పోలీసులు పట్టించుకోకపోగా అంటగాగుతున్నారని ఆరోపించారు. దాడుల సంఘటనలపై అనేక ధఫాలుగా నాటి సీపీకి లేఖలు రాసినా, మీడియా సమావేశాల ద్వారా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి మార్పు లేదన్నారు. ప్రభుత్వ స్థలాలపై కన్నేసిన కాంగ్రెస్ నాయకులకు పోలీసు, మున్సిపాలిటీ అధికారులు అనుకూలంగా వ్యవహరించడంతో ఆగడాలు పెట్రేగిపోయి శాంతి భద్రతలు అదుపు తప్పాయన్నారు. 10 యేండ్లగా అభివృద్ధి, సంక్షేమం, శాంతికి నిలయంగా ఉన్న నర్సంపేట నేడు అశాంతికి, అల్లర్లకు, అరచకాల వైపు నడుస్తుండడం దురదృష్టకరమని ఆందోళన వ్యక్తం చేశారు. నర్సంపేట పట్టణంలో చోటుచేసుకుంటున్న దాడులు, కబ్జాలపై నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సీపీ, డీసీపీ, జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా సమీక్షించి చర్యలు చేపట్టి శాంతి భద్రతలను రక్షించాలని డిమాండ్ చేశారు.

## విద్యారంగానికి బడ్జెట్‌లో 30 శాతం నిధులు కేటాయించాలి

- ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం

నవతెలంగాణ-కాశిబుగ్గ




అసెంబ్లీ సమావేశాలలో విద్యారంగానికి 30శాతం బడ్జెట్ కేటాయించాలని విద్యార్థి, యువజన, ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. భారత విద్యార్థి సమైక్య ఆధ్వర్యంలో మంగళవారం ఉర్సు గుట్ట వద్ద గల ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు చుక్క ప్రశాంత్ అధ్యక్షతన ప్రజా, సామాజిక, యువజన సంఘాలు, కార్మిక సంఘం ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి యార ప్రశాంత్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకుడు సీహెచ్.రంగయ్య, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఆరూరి కుమార్, సీఐటీయూ నాయకులు సింగారపు బాబు, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి వలదాసు దుర్గయ్య, ఏఐఎడబ్ల్యూయూ జిల్లా అధ్యక్షుడు నమ్మిన స్వామి తదితరులు హాజరై మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రతి ఏడాది విద్యా రంగానికి నిధులు కేటాయించకుండా పాలకులు తీవ్ర అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే విద్యారంగం కీలకమని చెప్పిన కేసీఆర్ తన పదేళ్ల పాలనలో విద్యారంగాన్ని తీవ్ర విధ్వంసం చేశారని మండిపడ్డారు. తాము అధికారంలోకి వస్తే బడ్జెట్‌లో 15 శాతం నిధులు కేటాయించి విద్యారంగాన్ని అభివృద్ధి చేస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీని నెరవేర్చలేదన్నారు. ప్రభుత్వ విద్యా రంగంలో ఉన్న సమస్యల పరిష్కారానికి అసెంబ్లీ సమావేశాలలో విద్యారంగానికి 30శాతం నిధులు కేటాయించాలని రౌండ్ టేబుల్ సమావేశం వేదికగా నాయకులు కోరారు.

## నవతెలంగాణ కథనంతో కదిలిన ఆరోగ్యశాఖ

- మండలంలోని సబ్ సెంటర్‌లో రక్త పరీక్షలు
- నవతెలంగాణ దినపత్రికకు ప్రశంసల వెల్లువ

నవతెలంగాణ-ఖానాపురం






వాతావరణంలో ఏర్పడిన మార్పులతో మండలంలోని ప్రజలు ఆరోగ్య సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని నవతెలంగాణ దినపత్రికలో 'వాతావరణంలో మార్పులు.. ప్రబలుతున్న విష జ్వరాలు' అనే శీర్షిక సోమవారం ప్రచురింపబడింది. స్పందించిన జిల్లా ఆరోగ్యశాఖ అధికారులు మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కాగా స్పందించిన మండల వైద్యాధికారులు వైద్య సిబ్బందితో పెద్దమ్మ గడ్డ సబ్ సెంటర్‌లో మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేసి రక్త నమూనాలు సేకరించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. వాతావరణంలో ఏర్పడిన మార్పు వలన ప్రజలు అనారోగ్య బారిన పడకుండా ఉండడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. ఆరోగ్య సమస్యలు ఎదురైతే సొంత వైద్యం పాటించకుండా వైద్యులను సందర్శించాలని తెలిపారు. ప్రజలు ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. దీంతో మండల ప్రజలు నవతెలంగాణ దినపత్రికకు కృతజ్ఞతలు తెలిపారు.

## పురావస్తు శాఖ ఆధ్వర్యంలో.. మహిళా దినోత్సవ వేడుకలు

నవతెలంగాణ-కాశిబుగ్గ



కేంద్ర పురావస్తు శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఖిలా వరంగల్ తూర్పు కోటలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈకార్యక్రమానికి హాజరైన 37, 38వ డివిజన్ల కార్పొరేటర్లు భోగి సువర్ణ సురేష్, బైరబోయిన ఉమా దామోదర్ యాదవ్ మాట్లాడుతూ మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాలలో రాణించాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చిన రిజర్వేషన్ ద్వారా మహిళలు పెద్ద సంఖ్యలో చట్టసభలకు ఎన్నిక అవుతారన్నారు. అనంతరం కేంద్ర పురవస్తు శాఖ అధికారులు కార్పొరేటర్‌లను ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో కేంద్ర పురావస్తు శాఖ డిప్యూటీ సూపరింటెండెంట్ దేశాయ్, సీఏ మల్లేశం, అనితారెడ్డి, కేయూ కౌన్సిల్ మెంబర్ డాక్టర్ రోహిణి, అసిస్టెంట్ ప్రొఫెసర్, స్థానిక గైడ్ రవి యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్, అభివృద్ధి పనులను ప్రారంభించాలి



- సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే నాయిని

నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి:

బడ్జెట్ చివరి మాసం, కొత్త బడ్జెట్ ప్రవేశపెట్టే క్రమంలో నియోజవర్గ పరిధిలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను ప్రారంభించాలని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్య నాయిని రాజేందర్ రెడ్డి సూచించారు. మంగళవారం కుడా కార్యాలయంలో నిర్వహించిన వరంగల్ పశ్చిమ నియోజవర్గ సమీక్ష సమావేశంలో కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, నగర మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ అశ్విని తానాజీ వాకడేలతో కలిసి సమీక్షించారు. నగరంలో పెండింగ్ లో ఉన్న పనులను త్వరితగతిన ప్రారంభించాలని, స్మార్ట్ సిటి నిధుల ద్వారా జరుగుతున్న పనుల పురోగతిపై దృష్టి సారించాలని ఎమ్మెల్యే నాయిని తెలిపారు. రోడ్డు విస్తరణ, భద్రకాళి, అభివృద్ధిలో ఇళ్లు కోల్పోతున్న వారికి రెండు పడకల ఇళ్లు ఇచ్చేలా చూడాలని కోరారు. నిజమైన అర్హులను గుర్తించాలని అధికారులను ఆదేశించారు. భద్రకాళి బండ్ పనులు 75 శాతం జరిగిందని అధికారులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు.

### వేసవికాలం యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలి

వేసవికాలం సమీపించిన సమయంలో నగరంలోని ప్రజలకు ఎటువంటి నీటి ఎద్దడి లేకుండా చూడాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మూతబడిన బోర్లను వెంటనే మరమత్తులు చేయాలని, అవసరం ఉన్న ప్రాంతాల్లో కొత్త బోర్లకు అనుమతులు మంజూరు చేయాలని సూచించారు. వేసవితాపం తీర్చేందుకు మూడు నెలలు అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. .వేసవి సెలవుల నేపథ్యంలో పిల్లలకు నియోజవర్గంలో ఉన్న 24 ప్రధాన పార్కులలో మరమత్తులు చేపట్టాలని సూచించారు. కుడా చైర్మన్ మాట్లాడుతూ మున్సిపల్, కుడా అధికారులు ఉద్యానవనం శాఖ అధికారులు సమిష్టిగా నగరంలో మొక్కల పెంపకం, పచ్చదనంపై నూతన ఒరవడికి నాంది పలకాలని కోరారు.చాలా చోట్ల మొక్కలు నాటాల్సిన ప్రాంతాల్లో పార్కింగ్ ఏర్పాటు చేయడం వల్ల మొక్కల పెరుగుదల లేదని అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్ ప్రక్షాళన చేయాలని, అవినీతికి పాల్పడుతున్న అధికారులు, ఉద్యోగులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చే విధంగా ప్రజా ప్రతినిధులు, అధికారులు అవినీతికి పాల్పడితే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. సమీక్షలో చేపట్టిన అంశాల పట్ల అధికారులు కింది స్థాయి ఉద్యోగులతో క్షేత్రస్థాయిలో పరిశీలించాలని సూచించారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి వరంగల్ నగర అభివృద్ధి పై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని, ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో ప్రజాపాలన సాగించాలన్నారు. ఈసమీక్ష సమావేశంలో అధికారులు పాల్గొన్నారు.

# పేద ప్రజలకు అండగా ప్రజా ప్రభుత్వం

- ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి

నవతెలంగాణ-సంగెం.



పేద ప్రజలకు అండగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదిక యందు అర్హులైన లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఏర్పడ్డాక పరకాల నియోజకవర్గ వ్యాప్తంగా ఇప్పటివరకు మొత్తం కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ ద్వారా 1556మందికి రూ.15 కోట్ల 57 లక్షల 78వేల 496, సీఎంఆర్ఎఫ్ పథకం ద్వారా 1173 మంది లబ్ధిదారులకు రూ.3కోట్ల 68 లక్షల 61 వేలను, ఎల్ఓసీ పథకం ద్వారా 69 మందికి రూ1 కోటి 33 లక్షల 91వేల విలువ గల చెక్కులను పంపిణీ చేసామన్నారు. గత ప్రభుత్వంలో లబ్ధిదారులకు కనీసం సీఎంఆర్ఎఫ్ నిధులు కూడా ఇవ్వలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక పెండింగ్ వాటిని కూడా మంజూరు చేశామన్నారు. నిరుపేదలకు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందని, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తుందన్నారు. .ఇచ్చిన మాట ప్రకారం ఎన్నికలలో ఇచ్చిన ప్రతి హామీని అంచలంచెలుగా అమలు చేస్తున్నామని తెలిపారు. ఈకార్యక్రమంలో తహసిల్దార్ రాజ్‌కుమార్, ఎంపీడీవో రవీందర్, మండల పార్టీ అధ్యక్షుడు మాధవరెడ్డి, నియోజకవర్గ అధికార ప్రతినిధి జనగాం రమేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ మెట్టుపల్లి రమేష్, నాయకులు కందగట్ల నరహరి, అర్చ నాగరాజు, నరసింహనాయక్, విలాసాగరం వెంకటేశ్వర్లు, ఇండ్ల రవికుమార్, రాధిక, లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.



## నిబంధనలు పాటించని ఆసుపత్రులపై చర్యలు

- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సాంబశివరావు

నవతెలంగాణ-వరంగల్

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.సాంబశివరావు వరంగల్ తన బృందం చే ఒక ప్రైవేట్ హాస్పిటల్లో సంభవించిన మాత మరణాల గురించి తెలుసుకొని వారి పైన చట్టరీత్యా చర్యలు తీసుకోవడానికి ఒక ఎక్స్‌పర్ట్ కమిటీని నియమిస్తున్నామని తెలిపారు. ఎక్స్‌పర్ట్ కమిటీ నివేదిక ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపినారు అదేవిధంగా ప్రతిమ క్యాన్సర్ హాస్పిటల్, అపోలో ఎన్ఎస్ఆర్ వైస్ హాస్పిటల్ లలో ఆకస్మిక తనిఖీలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో తనికీ బృందాలు నిరంతరం క్లినిక్‌లు ఆస్పత్రలను తనికీ చేస్తుంటాయని, తనికీ అధికారులు అడిగిన వెంటనే అన్ని రకాల అనుమతులకు సంబందించిన సర్టిఫికెట్లు, సిబ్బంది వివరాలు చూపించాలన్నారు. ఎవరైనా క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్, పీసీపీ ఎన్‌డీటీఆక్ట్‌లకు విరుద్ధంగా ప్రవర్తిస్తే వారిపైన చట్టరీత్య చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈకార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి డాక్టర్ అర్చన, డిప్యూటీ అనిల్‌కుమార్, మనోజ, ఎల్‌డీ కంప్యూటర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వం కొత్త పెన్షన్లు అమలు చేయాలి

- ప్రజా సమస్యలపై సీపీఐ(ఎం) ఇంటింటి సర్వే

నవతెలంగాణ-వరంగల్



కాంగ్రెస్ ప్రజాపాలన ఏడాది పూర్తి అయినా ఇచ్చిన హామీ ప్రకారం కొత్త పెన్షన్లు అమలు చేయాలని సీపీఐ(ఎం) పార్టీ జిల్లా కమిటీ సభ్యులు అరూరి కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం 29వ డివిజన్ పాపయ్యపేట ప్రాంతంలో సీపీఐ ( ఎం) ఆధ్వర్యంలో ఇంటింటి సర్వే నిర్వహిస్తూ ప్రజల వద్దకు వెళ్లి వారిని సమస్యలు అడిగి తెలుసుకున్నామన్నారు. ఈ సందర్భంగా సర్వేలో వికలాంగులకు రూ.6వేలు, వృద్ధులకు రూ. 4వేలు ఇస్తామని ప్రకటించి ఏడాది గడుస్తున్న కొత్త పెన్షన్లు ఇవ్వడం లేదని తెలుపుతున్నారు, ఈ సందర్భంగా సీపీఐ ( ఎం) జిల్లా కమిటీ సభ్యులు అరూరి కుమార్ మాట్లాడుతూ అర్హులైన పెన్షన్ దారులంతా ప్రభుత్వం కొత్తగా పెంచి ఇస్తానన్న పెన్షన్లు వస్తాయని ఆశతో ఎంతో కాలంగా ఎదురుచూస్తున్నారని ప్రభుత్వ హామీ ప్రకారం వికలాంగులకు రూ. 6 వేలు, వృద్ధులు, వితంతువులకు రూ.4వేలు పెన్షన్లను ఇచ్చేందుకుగాను ఈ బడ్జెట్‌లో నైనా కొత్త పెన్షన్లకు తగిన బడ్జెట్ కేటాయించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఐ( ఎం) పిలుపులో భాగంగా ప్రజా సమస్యలపై ఇంటింటి సర్వే నిర్వహించడం జరుగుతుందని ఈ సందర్భంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు ఆందోళన పోరాటాలు నిర్వహిస్తామన్నారు. ప్రభుత్వం తక్షణమే ఆరు గ్యారెంటీల హామీలను అమలు జరపాలని డిమాండ్ చేశారు. ఈసర్వే కార్యక్రమంలో సీపీఐ(ఎం) శాఖ కార్యదర్శులు రంగరాజు విజయ, రుద్రోజు చంద్రమౌళి, రాజేశ్వరి, ఇందిరా, సరిత తదితరులు పాల్గొన్నారు.

# నర్సంపేటలో ఉద్రిక్తత..

- బీఆర్ఎస్, కాంగ్రెస్ శ్రేణుల పరస్పర రాళ్ల దాడి..
- సర్వే నెంబర్ 111లోని అసైన్‌డ్ భూమిలో లేఅవుట్ రాళ్ల తొలగింపు..
- ఓడీసీఎంఎస్ చైర్మన్ రామస్వామినాయక్, పలువురి కార్యకర్తలు, పోలీసులకు గాయాలు
- పోలీసుల లాఠీ ఛార్జ్..
- డీసీపీ, ఆర్డీవో సందర్శన..
- పరిస్థితి అదుపులోకి..





నవతెలంగాణ-నర్సంపేట

నర్సంపేట పట్టణంలోని 111లోని అసైన్‌డ్ భూమి వద్ద బీఆర్ఎస్, కాంగ్రెస్ శ్రేణుల నడుమ పరస్పర దాడి చోటుచేసుకొని ఉద్రిక్తత పరిస్థితి నెలకొన్నది. మంగళవారం ఓడీసీఎంఎస్ చైర్మన్ గుగులోతు రామస్వామినాయక్ నేతృత్వంలో వందలాది మంది అసైన్‌డ్ భూమి వద్దకు చేరుకున్నారు. ముకుమ్మడిగా భూమిలో పాతిన హద్దు రాళ్లను తొలగించారు. అక్కడే ఉన్న పాకను ధ్వంసం చేశారు. పలువురు కాంగ్రెస్ కార్యకర్తలు చేరుకొని అడ్డగించబోయారు. ఇరువురి నడుమ వాగ్వివాదం, తోపులాట చోటుచేసుకొంది. కొద్దిసేపట్లోనే పోలీసులు భారీగా చేరుకొని ఇరువురిని చెదరగొట్టే ప్రయత్నం చేశారు. ఆ కొద్దిసేపట్లోనే ఇరువురు రాళ్ళు రువ్వుకొని దాడులకు పాల్పడ్డారు. సీఐ రమణమూర్తి, ఎస్ఐ, రవికుమార్ ఇరువురిని చెదరగొట్టారు. గంటలతరబడి సాగుతున్న ఈఉద్రిక్తత పరిస్థితి వద్దకు డీసీపీ అంకిత్ కుమార్ సిండే చేరుకొన్నారు. ఓడీసీఎంఎస్ చైర్మన్ గుగులోతు రామస్వామినాయక్ సర్వే నెంబర్ 111/91, 111/1/92లోని 3.30 ఎకరాల భూమిని తాను రామ అనుసూర్యదేవి వద్ద ఇట్టి భూమిని తాను కొనుగోలు చేశానని తెలిపారు. అనసూర్యదేవి వారసులు, కాంగ్రెస్ నాయకులు కలిసి ఆక్రమించి ప్లాట్లు చేసి నిర్మాణం చేస్తున్నారని వాపోయాడు. కొనుగోలు అగ్రిమెంట్‌లు, పలు రకాల ఉత్తర్వుల పత్రాలను డీసీపీకి చూపించారు. దీనిని పరిశీలించిన డీసీపీ కోర్టు ఉత్తర్వుల ప్రకారం భూమి నీదేనని ఎక్కడ లేదని, చెల్లుబాటు అయ్యే పత్రాలు ఉంటే చూపించాలన్నారు. అక్కడే ఉన్న సీఐ రమణమూర్తిపై రామస్వామి దంపతులు దుమ్మెత్తి పోశారు. తాను ఎన్నో దఫాలుగా ఫిర్యాదులు చేసినా పట్టించుకోకపోవడమే కాకుండా అక్రమ దారులకు కొమ్ముకాస్తున్నాడని తీవ్ర ఆరోపణలు చేశారు. సీఐతో తమకు ప్రాణముప్పు ఉందని డీసీపీతో ఏకరువుపెట్టారు. ఆకొద్దిసేపటికి ఆర్డీవో పి.ఉమా రాణి, తహసిల్దార్ అక్కడికి చేరుకున్నారు. వందలాది మందితో మొహరింపజేసి భూమిని లాక్కునాలనే ప్రయత్నం సరైంది కాదని చట్ట ప్రకారం ఇట్టి భూమి ఎవరి సొత్తు కాదని చైర్మన్ రామస్వామిని ఏసీపీ కిరణ్‌కుమార్, ఆర్డీవో వారించారు. భూమిపై సరైన ఆధారాలు ఉంటే ఫిర్యాదు చేస్తే తాము చర్యలు తీసుకుంటామని తెలిపారు. మాజీ సైనికుడికి ప్రభుత్వం కేటాయించిన భూమిపై ఇతరులకు ఎలాంటి హక్కు ఎవరికి లేదని స్పష్టం చేశారు. కోర్టు నుంచి స్టాటస్కో ఆర్డర్ గడువు ముగిసిందని ఈభూమి రామస్వామికి చెందినదని ఇట్టి ఉత్తర్వులో ఎక్కడ లేనందున అడిగే హక్కు లేదన్నారు. ఈఅల్లర్లకు కారణమైన వారందరిని అదుపులోకి తీసుకొని సెక్షన్ 145 కేసు నమోదు చేసుకొని బైండోవర్ చేయాలని పోలీసు లకు సూచించారు. ఆతర్వాత కొద్ది దూరంలో ఉన్న ఇరు పార్టీల కార్యకర్తలను అక్కడి నుంచి పోలీసులు చెదరగొట్టారు. సాయంత్రం వరకు భారీ మొత్తంలో పోలీసులు మొహరించి బందోబస్తు చర్యలు చేపట్టారు. కాగా ఈసంఘటనలో ఓడీసీఎంఎస్ చైర్మన్ గుగులోతు రామస్వా మినాయక్, ఎస్ఐ రవికుమార్‌లకు స్వల్ప గాయాలయ్యాయి.

## పంట పొలాలకు వెంటనే సాగునీరందించాలి

- ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

నవతెలంగాణ-పర్వతగిరి



పర్వతగిరి మండల కేంద్రంలోని 0.2 పర్వతగిరి రిజర్వాయర్ క్రింద ఉన్న ఆయకట్టు రైతులకు వెంటనే పంట పొలాలకు సాగునీ రందించాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. మంగళవారం రైతులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావడంతో ఎమ్మెల్యే వెంటనే స్పందించి రిజర్వాయర్‌ను సందర్శించి ఇరిగేషన్ శాఖ అధికారులు రైతులు వేసిన పంట పొలాలకు నీళ్లు అందించాలని ఇరిగేషన్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. నిర్లక్ష్యం చేస్తున్న అధికారులను మందలించి సంబంధిత ఉన్నతాధికారులతో, కలెక్టర్‌లతో ఫోన్‌లో మాట్లాడి త్వరగా నీళ్లు అందించేలా కృషి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే రైతులతో మాట్లాడి రైతులు ఎవరు ఆందోళన చెందవద్దని, త్వరలోనే 0.2 టీఎంసీలో పర్వతగిరి రిజర్వాయర్ల ద్వారా నీళ్ళు అందించే విధంగా సంబంధిత మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, ఈఎంసీ దృష్టికి తీసుకెళ్లి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట టీపీసీసీ లీగల్ వైస్ చైర్మన్ నిమ్మాని శేఖర్‌రావు, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు పిన్నింటి అనిల్‌రావు, మండల పార్టీ అధ్యక్షులు జాటోతు శ్రీనివాస్‌నాయక్, మండల గ్రామ స్థాయి నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
2
హనుమకొండ
బుధవారం | మార్చి 12, 2025 | www.navatelangana.com

## పార్టీలకతీతంగా సీఎంఆర్ఎఫ్ చెక్కులు

**నవతెలంగాణ-దామెర**



పార్టీలకు అతీతంగా సీఎం ఆర్ఎఫ్ చెక్కులను అందించడం జరుగుతున్నదని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి అన్నారు. మంగళవారం దామెర మండలానికి చెందిన 18మంది సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులకు రూ.5,86,500లు విలువ గల చెక్కులను అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎంఆర్ఎఫ్ పేద ప్రజలకు వరమని గతంలో ఎమ్మెల్యే ఎంపీల కార్యాలయల వద్దపడిగాపులు కాసేవారని నేడు లబ్ధిదారులకు నేరుగా అందజేయడం జరుగుతుందన్నారు. ఇప్పటివరకు పరకాల నియోజకవర్గంలో 1173 మంది లబ్ధిదారులకు రూ.3 కోట్ల 68 లక్షల 61 వేలు అందించామని ఎల్ఓసి పథకం ద్వారా 69 మంది లబ్ధిదారులకు రూ. 1కోటి33లక్షల91 వేలు విలువ గల చెక్కులను అందించినట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అనారోగ్య కారణాలతో ప్రవేటు కార్పోరేట్ ఆసుపత్రుల్లో చికిత్సపొందిన వారికి ప్రభుత్వం తరపున బాధ్యతగా ముఖ్యమంత్రి సహాయనిధి పథకం ద్వారా ఆర్థిక సహాయం అందజేస్తున్నామన్నారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పోలేపాక శ్రీనివాస్, జక్కుల రవీందర్, నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## 13న ఉపాధి కార్యాలయంలో జాబ్ మేళా

**నవతెలంగాణ-సుబేదారి**

జిల్లా ఉపాధి కార్యాలయంలో ఈనెల 13న ములుగురోడ్డులోని ప్రభుత్వ ఐటీఐలో నిర్వహించనున్న ఉద్యోగ మేళను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని హనుమకొండ జిల్లా ఉపాధి కల్పన అధికారి ఎం.మల్లయ్య తెలిపారు. హైదరాబాద్ అపోలో ఫార్మసీ కంపనీ లో దాదాపు (20) ఉద్యోగాల ఎంపికకు జాబ్‌మేళా నిర్వహించబడును. వయసు 18 నుండి 30 ఏళ్ల గల డీఫార్మసీ, బీఫార్మసీ, ఎంఫార్మసీ, ఎస్ఎస్‌సి, ఇంటర్, డిగ్రీ యదివిన నిరుద్యోగ యువతీ యువకులు అర్హులని నెలకు రూ.11 వేల నుంచి రూ.25 వేల వరకు వేతనం చెల్లించడం జరుగుతుందన్నారు. ఎంపికైన అభ్యర్థులు హైదరాబాద్, హనుమకొండ కేంద్రాల్లో విధులు నిర్వర్తించాల్సి ఉంటుందని వివరించారు. అర్హత, ఆసక్తి గల యువతి యువకులు విద్యార్హతల సర్టిఫికెట్స్ జిరాక్స్ కాపీలతో జిల్లా ఉపాధి కల్పన కార్యలయం, ప్రభుత్వ ఐటిఐ క్యాంపస్ ములుగురోడ్ నందు ఉదయం 11లకు 13న జరుగు జాబ్ మేళాకు హాజరు కావలసిందిగా కోరుతున్నారు. మరిన్ని వివరాలకు 7893394393లో సంప్రదించాలని మల్లయ్య తెలిపారు.

## ప్రణయ్ హత్యకేసులో న్యాయం గెలిచింది

- కేవీపీఎస్ మండల కార్యదర్శి రాంకుమార్

**నవతెలంగాణ-ఐనవోలు**

పెరుమాళ్ళ ప్రణయ్ హత్యకేసులో న్యాయం గెలిచింది అని కులవిక్ష వ్యతిరేక పోరాట సంఘం మండల కార్యదర్శి రాంకుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2018లో మిర్యాలగూడలో జరిగిన కుల దురాహంకార హత్యకు నిరసనగా కేవీపీఎస్‌తో పాటు పోరాటంలో నిలబడిన సామాజిక సంఘాలకు, ఈ పోరాటంలో న్యాయం వైపు బాధితుల తరపున నిలబడ్డ న్యాయవాదులకు, పోలీసులకు, మీడియాకు కృతజ్ఞతలు తెలిపారు. కుల దూరాంకారులకు కనువిప్పుకలగాలి ప్రణయ్ కుటుంబానికి రక్షణ కల్పించాలన్నారు.

నిందితుల్లో ఒకరికి ఉరిశిక్ష, ఆరుగురికి జీవిత ఖైదు విధిస్తూ నల్గొండ జిల్లా కోర్టు ఇచ్చిన తీర్పు స్వాగతిస్తు న్నామని అన్నారు.

## హుండీ దొంగలించిన వ్యక్తులు అరెస్ట్

**నవతెలంగాణ-ఆత్మకూరు**



దేవుని గుడిలోని హుండీని పగులగొట్టి డబ్బులు దొంగలించిన దొంగలను ఆత్మకూరు పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. సీఐ ఆర్.సంతోష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. సోమవారం గూడెప్పహాడ్‌లోని శ్రీసీతారామాంజనేయ గుడిలో దొంగలు పడి హుండీపగలగొట్టి అందులోని రూ.6వేలు అపహరించినట్లు కందికొండ రఘుపతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టడం జరిగింది. హసన్‌పర్తి మండలం ముచ్చర్ల గ్రామానికి చెందిన కాజాపాషా, మహమ్మద్ అంజాద్ ఇద్దరు కలిసి మోటార్ సైకిల్‌పై వచ్చి సీతా రామాంజనేయ గుడిలోని హుండీనిపగలగొట్టి రూ.6వేలు దొంగలించినారని విశ్వాసనీయ సమాచారంతో ముచ్చర్ల గ్రామానికి వెళ్లి ఇద్దరినీ అదుపులోకి తీసుకొనివారిని విచారించగా నేరం చెప్పుకున్నారన్నారు. వారి తల్లిదండ్రులను పోలీస్ స్టేషన్కు తీసుకువచ్చి వారి వద్ద నుండి మోటార్ సైకిల్, హుండీ పగలగొట్టడానికి ఉపయోగించిన పనిముట్లు అదేవిధంగా హుండీలో నుంచి దొంగలించిన ఆరువేల రూపాయలు రికవరీ చేసి వారి పై అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ పి.తిరుపతి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు..

## రైతులకు అన్యాయం జరిగితే సహించం

- మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణా రెడ్డి

**నవతెలంగాణ-శాయంపేట**



రైతులకు అన్యాయం జరిగితే ఉరుకునేది లేదని రైతుల కోసం ఉద్యమాలు చేయడానికి సిద్ధమని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. మండలంలోని చలివాగు ప్రాజెక్టులో మోటార్లు బంద్ చేయాలని మంగళవారం పంపుహౌజ్ ఎదుట బిఆర్ఎస్ నాయకులతో కలిసి ఆయన ధర్నా చేశారు. ఈ సందర్భంగా గండ్ర పంపుహౌస్ సీఈ అశోక్ కుమార్‌కు ఫోన్ చేసి చలివాగు ప్రాజెక్టులో కనీసం 16 అడుగుల నీటి మట్టం ఉండేలా చర్యలు తీసుకుని చలివాగు ఆయకట్టు వెంట పండేవంటలకు సాగునీరు విడుదల చేసిన తర్వాత ధర్మసాగర్‌కు నీటిని పంపిణీ చేయాలని కోరారు. దీంతో సీఈ సమాచారం మేరకు ఏఈ సునిత మాజీ ఎమ్మెల్యే వద్దకు వచ్చి రోజులలోపు చలివాగులో 15 అడుగుల నీటి మట్టం తీసుకొస్తామని హామిచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అన్న పూర్ణగా ఉన్న తెలంగాణలో అనాలోచిత, అసమర్ధత పరిపాలన వల్ల రైతులు నిరాశ నిస్పృహలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ధర్మసాగరకు నీటిని పంపింగ్ చేసి ఇక్కడి పోలాలను ఎండ గొడితే ఎకరానికి రూ. 50వేల నష్టపరిహారాన్ని ప్రభుత్వం రైతులకుఇవ్వాలనిడిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యార్థులు ఉన్నతంగా ఆలోచించాలి

**నవతెలంగాణ-ధర్మసాగర్**

విద్యార్థులు విద్యనభ్యసించే మొదట్లోనే ఉన్నతంగా ఆలోచించి,ఉన్నత శిఖరాలను చేరుకోవాలని మండల విద్యాశాఖ అధికారి రామ్‌దాస్ అన్నారు. మంగళవారం మండలంలోని క్యాతంపల్లి గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవాన్ని వైభవంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ చిన్నప్పటినుండి విద్య పట్ల ఆసక్తితో పాటు మంచి ఆలోచనలు ఉన్నతమైన ఆలోచనలు చేసినప్పుడే వారు అనుకున్నది సాధిస్తారని అన్నారు.ఈ కార్యక్రమంలో విద్యార్థులే ఉపాధ్యాయులుగా పాల్గొన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారిగా సిహెచ్ అశ్విని, మండల శాఖ విద్యాధికారిగా యం.రక్షిత, పాఠశాలల హెడ్మాస్టర్‌గా కే.సంతోష్, పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా కే. అనుపాల్, పాఠశాల పిఇటిగా కే.ధనవంశి, మొదలైన విద్యార్థులు పాల్గొన్నారు.

ఈ కార్యక్రమం ముగింపు సమావేశంలో ఆధ్యక్షులుగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు బండరమేష్, ముఖ్యఅతిథిగా ధర్మసాగర్ మండల విద్యాశాఖాధికారి డాక్టర్ బి. రాంధన్ ,ప్రత్యేక ఆహ్వానితులుగా పెద్ద పెండ్యాల కాంప్లెక్స్ హెడ్మాస్టర్ బి.రాజేందర్, కాంప్లెక్స్అసిస్టెంట్ సెక్రటరీ మల్లారెడ్డి, తాటికాయల ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర రెడ్డి, జానకిపురం ప్రధానోపాధ్యాయులు సమ్మిరెడ్డి,కేశవనగర్ ప్రధానోపాధ్యాయులు హిమబిందు, క్యాతంపల్లి ఉపాధ్యాయులు ఆత్మకూరి రామకష్ణ, బి. కిషన్, ఇన్నారెడ్డి, కేశవరెడ్డి, మాధవి, సంపత్, సిఆర్పి రణూపాల్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## చెరువులను పరిశీలించిన నీటిపారుదల శాఖ అధికారులు

**నవతెలంగాణ-ఆత్మకూరు**






'దొంగచాటుగా తూముగేట్లు ఎత్తివేత' అనే శీర్షికతో సోమవారం 'నవతె లంగాణ' దినపత్రికలో వెలువడిన కథనానికి ఐబీ అధికారులు స్పందించారు. మండలంలోని ఆత్మకూరు కామారం ఊరచెరువుల్లో నీటిని గుర్తుతెలియని వ్యక్తులుదొంగచాటుగా తూము గేట్లుఎత్తి సాగునీటి వృథా చేస్తున్నారని రైతుల పక్షాన 'నవతెలంగాణ' వార్తను ప్రచురించింది. ఈ కథనంపై ఐబీ అధికారులు డిఈ వేణుగోపాల్, ఏఈ జ్యోతి రాణి స్పందించి మంగళవారం మండలంలోని ఆత్మకూరు, కామారం చెరువులను పరిశీలించి వెంటనే తూములను దింపి నీటి వృథాను అరికట్టారు. ఈ సందర్భంగా చెరువులపై కాపల ఉన్న లష్కర్లను అప్రమత్తం చేశారు. ఈ సందర్భంగా డిఈ వేణుగోపాల్ మాట్లాడుతూ చెరువుల్లోని నీటివృథా చేస్తే కేసులు నమోదు చేసివారిపై కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. 'నవతెలంగాణ' కథనానికి ఐబీఅధికారులు వెంటనే స్పందించి సాగునీటి వృథాను అరికట్టినందుకు ఆత్మకూరు, కామారం రైతులు 'నవతెలంగాణ'కు ధన్యవాదాలు తెలిపారు.

# పదేళ్ల మీ పాలన, అభివృద్ధిపై చర్చకు సిద్ధమా ?

- వరంగల్ జిల్లాను నాశనం చేసింది బీఆర్ఎస్సే
- ఐదేళ్లు ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి ఉంటారు
- వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

**నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా**



బీఆర్ఎస్ పార్టీ పదేళ్ల అధికారంలో ఉండి ఏం అభివృద్ధి చేశారు ? పదేళ్ల మీ పాలన, అభివృద్ధిపై 15 నెలల మా పాలనపై చర్చకు సిద్ధమా ? అంటూ మాజీ మంత్రి హరీష్‌రావుకు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి సవాల్ విసిరారు. మంగళవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ కళ్లుండి చూడలేని కబోది హరీష్‌రావు అని ఉద్యమాల వరంగల్ సమాఖ్య జిల్లాను మీ రాజకీయ ఉనికి కోసం 6 జిల్లాలుగా ముక్కలుగా చేసి సర్వనాశనం చేసింది మీరు కాదా ? ఒకసారి ఆలోచన చేసుకోవాలన్నారు. బీఆర్ఎస్ సభ పేరుతో ఆలీబాబా చోర్ ముఠా వస్తుంది, బీఆర్ఎస్ పార్టీ నామాలు రూపాలు లేకుండా పోతుంది. ఇదిఒక డ్రామా సభ పేరుతో బీజేపీకి కొమ్ముకాసే మీరు ఆత్మగౌరవం గురించి మాట్లాతుండడం సిగ్గేస్తుందని దుయ్యబట్టారు. పోరాటాలు, ఉద్యమాల పేరుతో అబద్ధాన్ని నిజం చేయ టంలో కేసీఆర్ కుటుంబం ముందంజలో ఉంటుందన్నారు. మీరు కోవర్టు రాజకీయాలు చేసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని విమర్శిస్తే సహించేది లేదని ఐదేళ్ల రేవంత్‌రెడ్డిముఖ్యమంత్రిగా కొనసాగుతారన్నారు. డైవర్షన్‌పాలిటిక్స్ మానుకోవాలని మీ రాజకీయ సభ వల్ల మాకు సంబంధం లేదని బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో కాంగ్రెస్ నాయకులపై ఇష్టరాజ్యంగా కేసులు పెట్టింది మీరు కాదా? మీ భాగోతాలను ప్రజలు గమనిస్తున్నారన్నారు. రాష్ట్ర స్థాయి నాయకత్వం లేకపోయినా వరంగల్ జిల్లాలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలను ప్రజలు గెలిపించారు. బీఆర్ఎస్ పార్టీ అధికారంలో పదేళ్లలో మీరు ఒక్క ఇల్లు ఇవ్వకుండా ప్రజలను మోసం చేయడానికి సభ పేరుతో దొంగల బ్యాచ్ వస్తుంది ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. వరంగల్ వచ్చిన ప్రతీసారి ప్రజలను మాటలతో మోసం చేశారని దళితబంధు పేరుతో, ట్రాక్టర్‌ల పేరుతో, ఇళ్ల పేరుతో ప్రజలను మోసం చేసింది మీరు కాదా ? అని విమర్శించారు.

జీతం తీసుకుని ఫామ్‌హౌజ్‌లో ఉంటే ఎలా ? అని ముఖ్యమంత్రి ప్రశ్నిస్తే కేసీఆర్ వస్తున్నాడని కొంతమంది విర్రవీగుతున్నారన్నారు. కేసీఆర్ అసెంబ్లీకి వస్తే నిలదీసి ఆయన చేసిన భాగోతాలను బండారం బయటపెడతామని అసెంబ్లీకి రావాలనే మనస్ఫూర్తిగా కోరుకుంటున్నామన్నారు. పశ్చిమ నియోజకవర్గంలో అన్ని డివిజన్లలో అభివృద్ధి జరుగుతుందని దీన్‌దయాల్‌నగర్, పెద్దమ్మగడ్డ, సమ్మయ్య నగరాల్లో అభివృద్ధి చూడండి రాజకీయం మీకు వ్యాపారం లాంటిది రాజకీయం మాకు ప్రజా సేవలాంటిది ప్రమాదకరమైన బీఆర్ఎస్ అధికారంకోసం ఎంతమందికైనా మోసం చేస్తారు. చేసేది తప్పులు-చెప్పేదిగొప్పలు ఎన్నికలు ఎప్పుడొచ్చినా గెలుస్తారని అనడం మానేసి ఎంపీ ఎన్నికల ఫలితాలపై సమీక్ష చేసుకోవాలని హితవుపలికారు. ఇచ్చిన హామీలకు కట్టుబడి ప్రతిరోజు ప్రజలకు అందుబాటులో ఉంటూ అభివృద్ధి చేస్తున్నది కాంగ్రెస్ ప్రభుత్వమేనని స్పష్టం చేశారు.

ఈ సమావేశంలో కుడా చైర్మన్ వెంకట్రాంరెడ్డి, కార్పొరేటర్లు తోట వెంకన్న శ్రీమాన్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు పెరుమల్ల రామకష్ణ, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ వీసం సురేందర్ రెడ్డి, హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి వీరమల్ల రంజిత్ రెడ్డి, రహీమున్నీసా బేగం, బొద్ది రెడ్డి ప్రభాకర్ రెడ్డి, బంక సరల, పవన్, సతీష్, స్వప్న, నేహాల్ వివిధ డివిజన్ అధ్యక్షులు సీనియర్ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పార్టీలకతీతంగా లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు

- పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి

**నవతెలంగాణ-పరకాల**



రాష్ట్ర ప్రభుత్వం పార్టీలకు అతీతంగా లబ్ధిదారులకు సంక్షేమ పథకాలను అమలు చేయడం జరుగుతుందని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి అన్నారు. మంగళవారం పరకాల పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పరకాల, నడికూడ, ఆత్మకూరు, దామెర మండలాలకు చెందిన అర్హులైన లబ్ధిదారులకు కళ్యా ణ లక్ష్మీషాది ముభారక్, సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందించడం జరిగింది.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పరకాల నియోజకవర్గానికి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటుకు 200 కోట్ల నిధులు కేటాయించిన సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్కకి ధన్యాదములు తెలిపారు. సీఎంఆర్ఎఫ్ పేద ప్రజలకు వరమన్నారు. గతంలో ఎమ్మెల్యే, ఎంపీ కార్యాలయాల వద్ద చెక్కుల కోసం పడిగాపులుకాయాల్సి వచ్చేదన్నారు. నేడు లబ్దిదారులకు నేరుగా అందజేయడం జరుగుతుందని.పేదింటి ఆడబిడ్డలకు అండగా కళ్యాణ లక్ష్మీషాదీ ముబారక్ పథకాలు నిలుస్తున్నాయన్నారు. నిరుపేదలకు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటూ ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో ఆర్డిఓ డాక్టర్ కె నారాయణ, ఎఎంసి చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి, కాంగ్రెస్ టౌన్ అధ్యక్షులు పొయ్యాడు శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్లు మడికొండ సంపత్, రఘుపతి గౌడ్ పాల్గొన్నారు.

# ప్రణయ్ హత్య కేసు కోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం : కేవీపీఎస్

**నవతెలంగాణ-నయీంనగర్**




నల్గొండ జిల్లా మిర్యాలగూడలో జరిగిన ప్రణయ్ హత్యకేసు కోర్టు తీర్పు కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘ తరపున స్వాగతిస్తూ హర్షం వ్యక్తం చేస్తున్నామన్నారు. కులవివక్షవ్యతిరేక పోరాట సంఘం హనుమకొండ జిల్లా రాంనగర్ సుందరయ్య భవన్ కార్యాలయంలో మంగళవారం ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు దూడపాక రాజేందర్ అధ్యక్షత వహించగా జిల్లా ప్రధానకార్యదర్శి మంద సంపత్ హాజరై మాట్లాడుతూ మీడియా ద్వారా ప్రణయ్ హత్యకోర్టు తీర్పుని స్వాగతిస్తున్నామని చెప్పతు, 2018లో మిర్యాలగూడలో హాస్పిటల్ చికిత్స నిమిత్తం తిరిగి వెళుతున్న ప్రణయ్ ని అతి దారుణంగా హత్యచేసిన దుండగులను శిక్షించాలని రాష్ట్రవ్యాప్తంగా దేశవ్యాప్తంగా కేవీపీఎస్ పోరాటం నిర్వహించిందని పోరాట ఫలితంగానే కోర్టు తీర్పు దుండగులని ఏ1, ఏ2, సుభాష్‌శర్మ కీలక పాత్రధారిగా గుర్తించిన కోర్టు ఉరిశిక్ష అమలు చేయడం జరిగింది. మిగతా ఆరుగురికి జీవిత ఖైదీలుగా తీర్పునివ్వడాన్ని కేవీపీఎస్ హర్షం వ్యక్తంచేస్తూ, కులాంతర వివాహాల చట్టాలు వచ్చినప్పటికీ రాజ్యాంగబద్ధంగా ప్రతి పౌరుడు ఎలాంటి కులం, మతం, ప్రాంతం బేధం లేకుండా జీవించాలనే భారతరాజ్యాంగంలో ఉన్న హక్కులను కాలరాస్తున్న నేపథ్యంలో నిరంతరం కుల మత భావాలు లేకుండా జీవించాలని పోరాటం చేస్తుంది అని ఆయన అన్నారు.

భవిష్యత్తులో కూడా ఇలాంటి ప్రేమ వివాహాలు చేసుకున్న హత్యలను అరికట్టే విధంగా హక్కులను కాపాడే విధంగా, ఆందోళన పోరాటాలని పాలకవర్గాల వైఫల్యాలని ప్రభుత్వ విధానాలని అందుబాటులో ఉండే విధంగా, నిరంతరం కృషి చేస్తామని వారు కోరారు. ఈ సందర్భంగా పోలీస్ డిపార్ట్మెంట్ కి న్యాయవ్యవస్థకి ప్రత్యేకమైన కృతజ్ఞతలు తెలియజేస్తూ న్యాయం ఇంకా ఉన్నది ఉండాలని ఈ తీర్పు ద్వారా అర్థం అవుతుందని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా కమిటీ సభ్యులు రేణిగుంట్ల చందర్, సీఐటీయూ నాయకులు ఆలకుంట మల్లయ్య, విద్యార్థి నాయకులు కళ్యాణ్, స్టాలిన్ తదితరులు పాల్గొన్నారు.

# సమ్మేళనానికి తరలిరండి : రాగుల రమేష్

**నవతెలంగాణ-పరకాల**



ఈనెల 23న ఉదయం 10 గంటలకు హనుమకొండ కాళోజీ కళాక్షేత్రంలో నిర్వహించనున్న ఎస్ఎఫ్ఐ పూర్వ విద్యార్థుల సమ్మేళనానికి అధిక సంఖ్యలో తరలిరావాలని ఎస్ఎఫ్ఐ పూర్వ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్ పిలుపునిచ్చారు. మంగళవారం పరకాల పట్టణంలో ఎస్ఎఫ్ఐ పూర్వ విద్యార్థుల సన్నహాక సమావేశం దామర రాజేందర్ అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రాగుల రమేష్ మాట్లాడుతూ చదువుతూ పోరాడు చదువుకై పోరాడు అనే నినాదంతో ఎస్ఎఫ్ఐ ఏర్పడి విద్యారంగ సమస్యల మీద అలుపెరుగని పోరాటాలు నిర్వహిస్తుందన్నారు. 1970లో ఏర్పడిన ఎస్ఎఫ్ఐ నాడీ నుండి నీటి వరకు ఎందరో నాయకులను సమాజానికి అందించిందన్నారు. ఈ క్రమంలో నాటినుండి 2016 వరకు వరంగల్ ఉమ్మడి జిల్లాలో పనిచేసిన ఎస్ఎఫ్ఐ పూర్వనాయకులను సమీకరించి మహాసమ్మేళనాన్ని నిర్వహించడం జరుగుతుం దన్నారు. భగత్‌సింగ్ స్ఫూర్తితో పనిచేస్తున్న ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘాన్ని ఆయన జయంతి రోజు నిర్వహించాలని సంకల్పంతో ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. ఈ మహా సమ్మేళనాన్ని విజయవంతం చేయడం కోసం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పని చేసినటువంటి ఎస్ఎఫ్ఐ పూర్వ విద్యార్థుల సమ్మేళనానికి అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు. సమావేశా అనంతరం ఎస్ఎఫ్ఐ పూర్వ విద్యార్థుల సమ్మేళనానికి సంబంధించిన గోడపత్రికను ఆవిష్కరించడం జరిగింది.

ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ వరంగల్ ఉమ్మడి జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి గంగాధర్, పరకాల డివిజన్ మాజీ ప్రధాన కార్యదర్శి బొట్ల నరేష్, దగ్గెల తిరుపతి, అంకేశ్వరపు ఐలయ్య, వరంగల్ ఏఎంసి మార్కెట్ కమిటీ డైరెక్టర్ రుద్రేశ్వర్, నక్కచిరంజీవి, సురేందర్, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

## ప్రథమ బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలి

**నవతెలంగాణ-ధర్మసాగర్**



మండలంలోని రాయగూడెంలో నెలకొల్పిన శ్రీ సోమలింగేశ్వర స్వామి దేవాలయంలో ఈనెల 13న జరుగు ప్రథమ బ్రహ్మోత్సవాలను తెలంగాణ రాష్ట్ర ప్రజలు విజయవంతం చేయాలని వ్యవస్థాపకులు రామగిరి సోమలింగం ఆచార్య, సోమలక్ష్మి దంపతులు తెలిపారు. మండలంలోని రాయగూడెంలో నెలకొల్పిన సోమలింగేశ్వర స్వామి దేవాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ 13న గురువారం స్వామి పూజ రుద్రాభిషేకం, పాలాభిషేకం జిల్లా అభిషేకం రుద్ర హోమా కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

ఈ ప్రాంతంలో తెలంగాణ రాష్ట్రంలోనే అతిపెద్దదేవాలయంగా నిర్మాణం చేయడం జరిగిందని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమానికి భక్తులు సహాయ సహకారాలు అందించి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## కవితారెడ్డికి రాణిరుద్రమదేవి జాతీయ పురస్కారం

**నవతెలంగాణ-నక్కలగుట్ట**



హనుమకొండ జిల్లా బాలసముద్రంలోని కాళోజీ కళాక్షేత్రంలో నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్ ఆఫ్ సోషల్ జస్టిస్ ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో నిష్ణాతులైన వారికి అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని రాణి రుద్రమదేవి నేషనల్ అవార్డుతో సత్కరించడం జరిగింది. నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్ ఆఫ్ సోషల్ జస్టిస్ చైర్మన్ గాజుల శ్రీనివాస్ అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిలుగా హనుమకొండ జిల్లా జడ్జ్ వివి.నిర్మలా గీతాంబ, మాజీ డిఎంహెచ్‌వో లలిత చేతుల మీదుగా డాక్టర్ ఏడెల్లి కవితారెడ్డికి అవార్డును అందించారు. గత 16 ఏళ్లుగా వేలాదిమంది విద్యార్థులకు విద్యా బోధన చేయడంతో పాటు విద్యార్థులకు పరీక్ష ఫీజులను చెల్లించడం, కొంతమంది విద్యార్థులకు అకాడమిక్ తో పాటు గ్రూప్-2,4, గురుకులాలలో ఉద్యోగాలు పొందడం కొరకు ఆర్థికపరమైన సహాయం, పేద విద్యార్థులకు నోట్ బుక్స్ అందించడం వంటి సామాజిక సేవా కార్యక్రమాలను గుర్తించి డాక్టర్ కవితారెడ్డిని రాణి రుద్రమదేవి అవార్డుకు ఎంపిక చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏనుగుల రాకేష్ రెడ్డి, వైబ్రేంట్ అకాడమీ అధినేత సిహెచ్.రాజేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## హాకీ అసోసియేషన్ ఉపాధ్యక్షులుగా పరమేశ్వర్

**నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా**



హనుమకొండ జిల్లా హాకీ అసోసియేషన్ ఉపాధ్యక్షులు సుంకరి పరమేశ్వర్ ఎన్నికయ్యారు. మంగళవారం ఉమ్మడి వరంగల్ జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షులు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మహమ్మద్ అజీజ్ ఖాన్ చేతుల మీదుగా పరమేశ్వర్ నియామక పత్రాన్ని హాకీ అసోసియేషన్ అధ్యక్షుడు సోద రామకృష్ణ అందించారు. ఈ సందర్భంగా పరమేశ్వర్ మాట్లాడుతూ తనపై విశ్వాసంతో బాధ్యతలు అప్పగించిన, సహకరించిన పెద్దలందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి హుస్సేన్, నెట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు సజన్ కాంత్, రోయింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు బిన్నీ లక్ష్మణ్, ఏనుగుల మనసా రాంప్రసాద్, బండారు ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రత నియమాలు పాటించాలి : సీఐ

**నవతెలంగాణ-ఆత్మకూరు**



వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు పాటించాలని ఆత్మకూరు సీఐ సంతోష్ అన్నారు. మంగళవారం ఆత్మకూరు నుండి పెద్దాపూర్ మీదుగా వరంగల్ వెళ్లే ఆర్అండ్‌బి రహదారికి ఇరువైపులా పిచ్చిమొక్కలు లేకుండా చేయించి, ప్రమాద సూచిక బోర్డులను ఏర్పాటు చేయించారు. సీఐ సంతోష్ మాట్లాడుతూ వాహనదారులు రోడ్డుభద్రతా నియమాలు పాటిస్తూ తమ గమ్యస్థానాలకు చేరుకోవాలని, మద్యం తాగివాహనాలు నడిపి ప్రమాదాలకు గురై కుటుంబాలను ఆగం చేయవద్దన్నారు. మోటార్ సైకిల్ వాహనదారులు హెల్మెట్‌తప్పనిసరిగా ధరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ పి.తిరుపతి, కానిస్టేబుల్స్ ఉన్నారు.

## వయసు పైబడిన వారికి వైద్య పరీక్షలు చేయాలి

- జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి అప్పయ్య

**నవతెలంగాణ-ఆత్మకూరు**



ఎన్‌సిడి కార్యక్రమంలో భాగంగా మార్చి 31 లోపు 30 ఏళ్లు పైబడిన వారందరికీ వైద్య పరీక్షలు చేయాలని హనుమకొండ డీఎంహెచ్ఓ డాక్టర్ ఏ అప్పయ్య అన్నారు. మంగళవారం ఆత్మకూరు పీహెచ్‌సీ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా మంగళవారం నిర్వహిస్తున్న ఆరోగ్య మహిళా క్లినిక్ ను పరిశీలించారు. మహిళలకు ఆరోగ్య మహిళా క్లినిక్‌లో అందిస్తున్న ఎనిమిది రకాల సేవలను ప్రజలకు తెలియజేయాలని, అలాగే మహిళా సమాఖ్యలు అంగన్వాడి కార్యకర్తల ద్వారా పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల నుండి ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న మహిళలను ఆరోగ్య మహిళా క్లినిక్ కు వచ్చేలా ప్రోత్సహించాలన్నారు. అలాగే అసంక్రమిత వ్యాధులనియంత్రణ కార్యక్రమంలో భాగంగా 30ఏళ్లు పైబడిన వారందరికి వందశాతం వైద్య పరీక్షలు పూర్తి చేయాలన్నారు. ఆత్మకూర్ పిహెచ్‌సీ పరిధిలోని గతంలో చేసిన 20వేల 914 మంది 30 సంవత్సరముల పైబడిన వారిలో 10,116 మంది ని చేయడం జరిగిందని మిగతా వారందరినీ 31 మార్చి లోపు పూర్తి చేయాలన్నారు. ఆయుష్మాన్ ఆరోగ్యం మందిర్ వారీగా సమీక్షించడం జరిగింది. ఆత్మకూర్ బిఎస్సి పరిధిలో ప్రభుత్వ ప్రైవేటు లో 3744 బిపి,2266 డయాబెటిస్ తో ,16 మంది క్యాన్సర్ తో బాధపడుతున్నారని వీరందరికి ఫాలోఅప్ సేవలు సరిగా అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయుష్ వైద్యాధికారి డాక్టర్ చైతన్య, కమ్యూనిటీ హెల్త్ అధికారి జునేది, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు సిబ్బంది పాల్గొన్నారు.

## జీనోమ్ ప్రాజెక్ట్‌తో వ్యాధుల గుట్టురట్టు

- కాకతీయ యూనివర్శిటీ వీసీ ప్రతాప్‌రెడ్డి

**నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా**



2010 లో ప్రారంభమైన జీనోమ్ ప్రాజెక్ట్‌తో మానవుని వ్యాధులకు కారణమైన జన్యువులను గుర్తించి వాటి మూలాల ద్వారా వ్యాధుల గుట్టురట్టు చేయవచ్చని కేయూ ఉపకులపతి ప్రతాప్‌రెడ్డి అన్నారు. జన్యుశాస్త్రంవిభాగం ఆధ్వర్యంలో ఇమ్యూనాలజీ, బయోటెక్నాలజీ అంశంపై జరుగుతున్న రెండురోజుల జాతీయ సెమినార్‌లో ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జాతీయ సదస్సుకు భారతదేశం నుండి పరిశోధకులు, అకడమిషియన్‌లు పాల్గొని జంతు శాస్త్రాల పరిశోధన పురోగమనంపై చర్చించడాన్ని కొనియాడారు. ఆధునిక సాంకేతికతల ప్రాముఖ్యతను వివరించడాన్ని నిర్వాహకులకు అభినందనలు తెలియజేశారు. జాతీయ సదస్సులో బయోఫార్మా డైరెక్టర్ గీతా శర్మ 'డ్రగ్ డిస్కవరీ'పై కీలకోపన్యాసం చేసారు.

గీతా శర్మ మాట్లాడుతూ ఒక మాలిక్యుల్ ఒక డ్రగ్ గా మార్కెట్ లోనికి రావడానికి తక్కువలో తక్కువగా 10 సంవత్సరాలు పడుతుందని అంతేకాకుండా 10 బిలియన్ డాలర్ల వరకు ఖర్చు అవుతుందని కానీ బాయో ఇన్ఫర్మాటిక్స్ అభివృద్ధి చెందినందున ఖర్చు,సమయం రెండూకలిసి రావడం పరిశోధన రంగంలో జరిగిన పురోగతి అన్నారు. జాతీయ సదస్సు నిర్వాహకులు వెంకయ్య మాట్లాడుతూ ఈ రెండు రోజుల జాతీయ సదస్సులో 100 కి పైగా రీసెర్చి స్కాలర్స్, వివిధ వర్శిటీలకి చెందిన ప్రొఫెసర్లు తమ పరిశోధనా పత్రాలను సమర్పిస్తున్నారని, ఈ సదస్సులో మాట్లాడడానికి నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అనిమల్ బయోటెక్నాలజీ నుండి, నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్, జేఎన్‌టీయూహెచ్ నుండి ప్రొఫెసర్లు, సైంటిస్టులు వస్తున్నారని తెలిపారు.

ఈ కార్యక్రమాలో అధ్యక్షులుగా జన్యుశాస్త్రం విభాగ అధిపతి శ్రమిత, విసైన్స్ డీన్ హన్మంతు, చైర్మన్ బోర్డు ఆఫ్ స్టడీస్ నారాయణ, ప్రొఫెసర్ ఇస్తారి పాల్గొన్నారు.

## పాఠశాలను పరిశీలించిన ఆర్జెడీ



**నవతెలంగాణ-గణపురం**

మండలంలోని చేల్పూర్ జడ్పీ హెచ్ఎస్ పాఠశాలను మంగళవారం పాఠశాల విద్య వరంగల్ ఆర్జెడి సత్యనారాయణ రెడ్డి పరిశీలించారు. చెల్పూర్ పాఠశాలను సందర్శించి గణిత శాస్త్రం ప్రీ ఫైనల్ పరీక్షలను పరిశీలించారు, ఎల్ఐపి , ఎస్ఎస్సి, ఎండిఎం, ఎస్ఎస్సి విద్యార్థులకు అందించిన స్నాక్స్, పాఠశాల కనీస మౌలిక సదుపాయాలు అన్నిటిని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. సేఫ్టీ, సెక్యూరిటీ హెల్ప్ లైన్ నెంబర్లను చూసి అభినందించారు. ఆర్జెడి అడిగిన అన్ని వివరాలను ప్రధానోపాధ్యాయులు కే అశోక్ వివరించారు. ఈ కార్యక్రమంలో వి సత్యనారాయణ, జ్యోతి, బాబురావు, తదితరులు పాల్గొన్నారు.

## మానసిక, శారీరక ఉల్లాసానికి క్రీడలు

- అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, జిల్లా సంక్షేమ అధికారి మల్లీశ్వరి



**నవతెలంగాణ-భూపాలపల్లి టౌన్**

మానసిక, శారీరక ఉల్లాసానికి క్రీడలు ఉపయోగపడతాయని జయశంకర్ భూపాలపల్లి జిల్లా అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, జిల్లా సంక్షేమ అధికారి మల్లేశ్వరి తెలిపారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా మహిళా సంక్షేమశాఖ ఆధ్వర్యంలో క్రీడలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా అదనపు కలెక్టర్ విజయలక్ష్మి పాల్గొని మాట్లాడారు. క్రీడలలో గెలుపు ఓటములు సహజమని తెలిపారు. జిల్లా సంక్షేమ శాఖ అధికారి మల్లీశ్వరి మాట్లాడుతూ... ఓటమి చెందితే బాధపడొద్దని గెలుపు వస్తే ఉప్పొంగి పోవద్దని, ప్రతి దానిలో గెలుపోటములు సహజమని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ రాధిక,జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ సిబ్బంది ,అంగన్వాడీ టీచర్లు,కలెక్టరేట్ సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నరు.



# మత్స్యశాఖలో నిధులు గోల్‌మాల్ !

### -చేపల సీడ్ పోయకుండానే బిల్లులు ? -సంఘటనపై ఎమ్మెల్యే గండ్ర సీరియస్



**నవతెలంగాణ-భూపాలపల్లి**

రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకారులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడుతోంది. మత్స్య శాఖలో నిధులు గోల్మాల్ అయ్యాయని సీడ్ పోయకుండానే నిధులు కాజేస్తున్న పరిస్థితి నెలకొంది. దీనిపై మత్స్యశాఖ సంఘం నాయకులు కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చినా ఫలితం లేదని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదీ జయశంకర్-భూపాలపల్లి జిల్లా పరిస్థితి.

జిల్లాలో మత్స్య పారిశ్రామిక సంఘం సొసైటీలు 120 ఉన్నాయి. చెరువులు, కుంటల్లో దళారీ వ్యవస్థను నిర్మూలించి మత్స్యకారులకే నేరుగా అభివృద్ధి ఫలాలను అందించేందుకు ప్రభుత్వం 100 శాతం సబ్సిడీతో ఉచిత చేప పిల్లలను పంపిణీ చేసింది. కానీ, మళ్ళీ చెరువులోకి సీడ్ కాంట్రాక్టర్ వ్యవస్థను దింపి సంబంధిత నిధులు పక్కదారి పట్టించారనే విమర్శలు వెలువెత్తుతున్నాయి. ఈ ఘటనపై భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు సీరియస్‌గా ఉన్నారని, అవినీతికి పాల్పడిన అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించినట్లు సమాచారం. గణపురం మండల కేంద్రంలోని గణపసముద్రం రిజర్వాయర్‌లో సబ్సిడిలో 14.19 లక్షల చేపపిల్లలు వదలాల్సి ఉండగా మొదటి విడతలో 7,24,493 మంజూరైనట్లు టీ- మత్స్య ఆఫ్ రికార్డుల్లో అధికారులు చూపుతున్నారు. ప్రభుత్వం ద్వారా ఉచితంగా అందించిన చేప పిల్లల సీడ్‌ను గత సంవత్సరం అక్టోబర్ 4న 56,000, నవంబర్ 24న 80,000 మొత్తం 1,36,000 చేప పిల్లలను మాత్రమే జిల్లా మత్స్యశాఖ ఆధ్వర్యంలో వదిలారు. ఇదిలా ఉంటే గత సంవత్సరం నవంబర్ 25న నాలుగు వాహనాల్లో తీసుకువచ్చిన మొత్తం 7,24, 493 చేపల సీడ్ వేసినట్లు తప్పుడు లెక్కలతో మత్స్య శాఖ అధికారులు టీ మత్స్య ఆప్లో నమోదుచేసి రూ.10,22,259.98 బిల్లు పెట్టుకున్న విషయం ఆలస్యంగా బయటకు వచ్చింది. దీంతో లక్షల్లో నిధులు పక్కదారి పట్టినట్లు తెలుస్తోంది. ఇక్కడి అధికారులు సీడ్ కాంట్రాక్టర్‌తో కుమ్మక్కై, చేపల సీడ్‌ను పోసినట్లు తప్పులు లెక్కలు చూపి మత్స్యకారుల జీవితాలతో ఆటలాడుకుంటున్నారని మత్స్యకారులు మండిపడుతున్నారు. మత్స్యకారుల ఆర్థిక అభివృద్ధికి సహకరించాల్సిన మత్స్యశాఖ జిల్లా అధికారులు తమకు వచ్చే నిధులు పక్కదారి పట్టించి అన్యాయం చేస్తూ ప్రభుత్వాన్ని ఆభాసుపాలు చెస్తున్నారని వాపోతున్నారు. పోయని చేపపిల్లలు పోసినట్లు చూపి నిధులు కాజేస్తున్న సదరు అధికారులపై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని మత్స్యకారులు కోరుతున్నారు.

### అవినీతికి పాల్పడితే సహించేది లేదు : గండ్ర సత్యనారాయణరావు, ఎమ్మెల్యే



భూపాలపల్లి నియోజకవర్గంలో ఏ అధికారైన, ఏ ప్రజా ప్రతినిధి అయిన అవినీతికి పాల్పడితే సహించేది లేదు. గణపురం మండల కేంద్రంలోని గణప సముద్రం మత్స్యశాఖ సంఘంలో జరిగిన అవినీతి ఆలస్యంగా నా దృష్టికి వచ్చింది. ఘనపసముద్రం మత్స్యశాఖలో రెండు గ్రూపులు ఉన్నాయి. వారు వేరువేరుగా ఎమ్మెల్యేను సంప్రదించి చేపలు పట్టుకునేందుకు ఇబ్బందులు పెడుతున్నారని వివరించారు. మత్స్య శాఖలో జరిగిన సంఘటనపై పూర్తి విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటాం. మత్స్య కార్మికులకు చేపలు పట్టుకునే అవకాశం కల్పిస్తాం.

### ప్రభుత్వ జీఓకు అనుగుణంగా పంపిణీ

ప్రభుత్వ జీఓకు అనుగుణంగా చేపపిల్లల పంపిణీ జరిగింది. గణపురం జలాశయంలో 7.09లక్షల పిల్లలు పంపిణీ చేశారు. ఇదంతా ఆన్లైన్‌లో మానిటరింగ్ చేశాం. స్టాకింగ్ సర్టిఫికెట్స్ సంతకాలతో ఆన్లైన్‌లో అప్లోడ్ చేస్తారు. మత్స్య శాఖ కార్యాలయం నుంచి పాలక వర్గానికి రెండు నోటీసులు ఇచ్చాం. ఈ నెల 8న పాలకవర్గం సర్వ సభ్య సమావేశం జరిగింది. పాలక వర్గం, సభ్యుల మధ్య జరిగిన సమస్యను మరలా చేప పిల్లలు పంపిణీ విషయంపైకి మళ్లిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అంతా ఆన్లైన్ సిస్టంలో ఉంది కాబట్టి అవినీతికి పాల్పడే అవకాశాలు లేవు.



**- ఆర్ అవినాష్, మత్స్యశాఖ జిల్లా అధికారి**

### ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం...

గణపసముద్రం రిజర్వాయర్ చేపల సీడ్ విడుదలలో జిల్లా మత్స్యశాఖ అధికారులు తప్పుతోవ పట్టించారని, పోయని చేప పిల్లల సీడ్‌కు పోసినట్లు చూపారని, వారిపై చర్యలు తీసుకోవాలని జనవరి 6న నలుగురు మత్స్యశాఖ డైరెక్టర్లు ప్రజావాణిలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మకు పిర్యాధు చేశారు. అలాగే జనవరి 25న కొందరు డైరెక్టర్లు మరోసారి జిల్లా కలెక్టర్‌కు రాహుల్ శర్మను కలిసి నిధులలో ఎలాంటి గోల్మాల్ జరగలేదని మత్స్యశాఖ సంఘం డైరెక్టర్ల సమన్వయ లోపంతో ఫిర్యాదు చేయడం జరి గిందని వినతిపత్రం ఇవ్వడంతో కలెక్టర్ విస్మయా నికి గురైనట్లు సమాచారం. అయితే కలెక్టర్‌కు వినతి పత్రం ఇచ్చి సమస్యను వివరించినప్పటికీ ఫలితం శూన్యమని కొందరు డైరెక్టర్లు, కార్మికులు ఆరోపిస్తు న్నారు. కాగా, గణప సముద్రం సరస్సు పాలకవ ర్గం, కాంట్రాక్టర్ వైఖరిని నిరసిస్తూ ఈ నెల 8న గణ పురం మండల కేంద్రంలో ప్రధాన రహదారిపై మత్స్య కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. ఇప్పటికే 7 నెలలుగా చేపల వేటకు వెళ్లక తీవ్రంగా నష్టపోయా మని ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్ స్పందించి తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## రానున్న మేడారం మహాజాతర విజయవంతం చేసుకుందాం

- తెలంగాణ రాష్ట్ర గవర్నర్ విష్ణు దేవ్‌వర్మ





**నవతెలంగాణ- ములుగు**

ఆదివాసీ గిరిజనుల ఆరాధ్య దైవం సమ్మక్క సారలమ్మ మహిమ గలిగిన తల్లులని, దట్టమైన అడవీ ప్రాంతంలో వెలిసిన తల్లులను తాను దర్శించుకోవడం అదృష్టంగా భావిస్తున్నానని, 2026లో జరగనున్న మేడారం మహా జాతరను విజయవంతంగా పూర్తి చేసుకుందామని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ విష్ణు దేవ్‌వర్మ అన్నారు. మంగళవారం జిల్లాలోని ఎస్ఎస్ తాడ్వాయి మండలం మేడారం గ్రామంలోని మేడారం సమ్మక్క సారలమ్మ వనదేవతలను గవర్నర్ దర్శించుకున్నారు. రాష్ట్ర మంత్రి ధనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, జిల్లా ఎస్పీ డాక్టర్ శబరిష్ ఘన స్వాగతం పలిక ప్రత్యేక పూజలు చేశారు. గిరిజన సాంప్రదాయ ప్రకారం మేడారం చేరుకున్న గవర్నర్‌కు పూజారులు డోలు వాయిద్యాల మధ్య తోడుకొని గద్దెల ప్రాంతంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయం ముందు విలేకర్లతో గవర్నర్ మాట్లాడుతూ... దట్టమైన అటవీ ప్రాంతంలో రెండేండ్లకోసారి మహా కుంభమేళ తరహాలో జాతర నిర్వహించడం, మహా జాతరకు మన రాష్ట్రం నుండే కాకుండా పలు రాష్ట్రాల నుండి కోటి 50లక్షల పైగా మంది సందర్శకులు వనదేవతలను దర్శించుకోవడం చెప్పుకోదగ్గ విషయమన్నారు. మహా జాతర సందర్భంగా భక్తులకు అన్ని ఏర్పాట్లు చేయడానికి ప్రభుత్వానికి సూచనలు చేయనున్నానని అన్నారు. తాను దత్తత తీసుకున్న ఇదే మండలంలోని కొండపర్తి గ్రామం హైటెక్ తరహాలో అభివృద్ధి చెందిందని, మారుమూల గ్రామమైన కొండపర్తిని అభివృద్ధి చేయడానికి జిల్లా అధికారులు చేసిన కృషిని మరువనని అన్నారు. అనంతరం మంత్రి సీతక్క మాట్లాడుతూ... 2024 సెప్టెంబర్ 27వ తేదీన కొండపర్తి గ్రామాన్ని గవర్నర్ దత్తత తీసుకోవడంతో ఆ గ్రామంలో 100శాతం మౌలిక సదుపాయాలు ఏర్పడ్డాయని అన్నారు. గవర్నర్ తీసుకున్న నిర్ణయాన్ని గిరిజనులు ఎన్నటికీ మర్చిపోలేరని అన్నారు. ఐదవ షెడ్యూల్ ప్రకారం గిరిజన గ్రామాలలో అభివృద్ధి చేయడానికి గవర్నర్‌కు పూర్తి అధికారం ఉంటుందని, అనతి కాలంలోనే కొండపర్తి గ్రామం ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడం హర్షనీయమని అన్నారు. కార్యక్రమంలో ఐటీడీఏ పీవో చిత్ర మిశ్రా, అదనపు ఎస్పీ సదానందం, ఆర్డీఓ వెంకటేష్, పలు శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## గవర్నర్ దత్తత తీసుకోవడం అభినందనీయం : జిల్లా కలెక్టర్ టీఎస్ దివాకర



**నవతెలంగాణ -ములుగు**

తాడ్వాయి మండలం కొండపర్తి గ్రామంలో 70 గృహాలు, 285 మంది జనాభా ఉందని, గ్రామాన్ని అభివృద్ధి చేసేందుకు గవర్నర్ దత్తత తీసుకోవడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు. కొండపర్తి గ్రామంలో రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్‌వర్మ పర్యటించారు. తొలుత కొమరం భీం, బిర్సాముండ విగ్రహాలను, పాఠశాలలో డిజిటల్ తరగతులను, అంగన్వాడీ కేంద్రాన్ని రూ.7,84, 700తో నిర్మించిన మసాలా యూనిట్, రూ. 7,76,594తో కుట్టు మిషన్ యూనిట్‌ను ప్రారంభించారు. అనంతరం రిమోట్‌తో వ్యవసాయ మోటార్లు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో గవర్నర్ మాట్లాడిన అనంతరం ఆయన మాట్లాడారు. గవర్నర్ దత్తత తీసుకున్న తదుపరి ఈ గ్రామం అభివృద్ధిలో ముందుందన్నారు. అంగన్వాడి కేంద్రం, పాఠశాల శిథిలావస్థలో ఉన్నాయని రూ.70 లక్షలతో మరమ్మతులు నిర్వహించి అధునాతన హంగులతో వినియోగంలోకి తెచ్చినట్లు తెలిపారు. ఈ ప్రాంత అభివృద్ధికి గవర్నర్ రూ.కోటి 50లక్షలు మంజూరు చేయడం సంతోషమని పేర్కొన్నారు. వ్యవసాయ ప్రధానమైన ఈ ప్రాంతంలో వ్యవసాయంగాన్ని మరింత అభివృద్ధి చేయుటకు 7 కమ్యూనిటి బోర్లు మంజూరు చేసినట్లు తెలిపారు. 50 ఎకరాల్లో మిర్చి సాగవుతుందని అదనంగా సాగు చేపట్టేందుకు చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. అంతకుముందు మంత్రి సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, ఎస్పీ శబరీష్, గ్రామస్తులు తదితరులు గవర్నర్‌ను ఘనంగా సన్మానించి మెమోంటో అంద చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ శబరిస్, ఐటిడిఏ పీఓ చిత్ర మిశ్రా, జిల్లా అటవీశాఖ అధికారి రాహూల్ కిషన్ జాదవ్, గవర్నర్ కార్యాలయ సంయుక్త కార్యదర్శి భవాని శంకర్, గవర్నర్ ఏడిసి మేజర్ అమన్ కుండు, గవర్నర్ సిఎస్ఓ శ్రీనివాసరావు, గ్రంథాలయ కమిటీ చైర్మన్ రవిచందర్, గ్రామ పెద్దలు లచ్చు పటేల్, గ్రామస్తలు, తదితరులు పాల్గొన్నారు.



## పంటలకు మద్దతు ధరల చట్టం చేయాలి

### జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట తెలంగాణ రైతు సంఘం ధర్నా

**నవతెలంగాణ - ములుగు**

కేంద్ర బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల విధానాలకు వ్యతిరేకంగా సంయుక్త కిసాన్ మోర్చా(ఎస్కెఎం) రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు తుమ్మల వెంకటరెడ్డి, ఎండీ గఫూర్ పాషా హాజరై మాట్లాడారు. చారిత్రాత్మకమైన రైతాంగ పోరాట ఫలితంగా కేంద్ర ప్రభుత్వం 3 వ్యవసాయ చట్టాలను ఉపసంహరిస్తూ రైతులకు రాతపూర్వకంగా ఇచ్చిన హామీలను అమలు చేయలేదన్నారు. రద్దు చేసిన 3 చట్టాలను ప్రతిబింబించేలా జాతీయ వ్యవసాయ మార్కెటింగ్ ముసాయిదాను విడుదల చేసిందన్నారు. ఇందులో కనీస మద్దతు ధరల చట్టంకానీ, కొనుగోలుకు గ్యారెంటిగానీ లేదన్నారు. రైతుల కోసం కాకుండా బడాకార్పొరేట్లకు వ్యవసాయ రంగాన్ని తాకట్టుపెట్టేలా ఉందన్నారు. రాష్ట్రాల హక్కులను కాలరాసి, మార్కెట్ వ్యవస్థను కేంద్ర ప్రభుత్వం ఆధీనంలోకి తీసుకుంటుందన్నారు. పంటల అమ్మకం పూర్తిగా కార్పొరేట్ కంపెనీల చేతులోకి వెళ్తే రైతు ఉత్పత్తులకు సరైనధరలు ఉండవన్నారు. సహకార రంగాన్ని నిర్వీర్యం చేసి కార్పొరేట్ శక్తులకు అప్పగిస్తున్నదన్నారు. కేంద్రం అశాస్త్రీయంగా నిర్ణయించిన కనీస మద్దతు ధరల కంటే తక్కువకు అమ్మడం వల్ల ఏటా రైతులు రూ.4లక్షల కోట్లు నష్టపోతున్నారని అన్నారు. నేటికి పంటల ప్రణాళిక లేకపోవడంతో రైతులు పెట్టిన పెట్టుబడిరాక, అప్పులు తీరక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని వాపోయారు. ఎన్సీఆర్బి రిపోర్టు ప్రకారం ఏటా పది వేల మందికి పైగా రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. వీటి నివారణకు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదన్నారు. రైతుల ఆత్మహత్యల్లో సగానికి పైగా కౌలు రైతులవే ఉంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్పొరేట్ల ఆదేశాలకు లొంగిన కేంద్ర ప్రభుత్వం విత్తన చట్టం చేయడానికి నిరాకరిస్తున్నదన్నారు. నేటి వరకు విత్తన చట్టం పార్లమెంట్లో పెండింగ్‌లోనే ఉందన్నారు. వ్యవసాయోత్పత్తులను తక్కువ ధరకు సేకరించి, ప్రాసెస్ చేసి అమ్మడంవల్ల అధిక లాభాలు వస్తాయని గమనించిన కార్పొరేట్ సంస్థలు టాటా, బిర్లా, అదాని, రిలయన్స్, ఐటిసి, బేయర్ లాంటి సంస్థలు తమ పెట్టుబడులను వ్యవసాయరంగంలోకి తెచ్చి అత్యధిక లాభాలు గడిస్తున్నారన్నారు. వ్యవసాయోత్పత్తులను తగ్గించి ఏటా రూ.4 లక్షల కోట్ల విలువగల నూనెలు, పప్పులు తదితర పంటలను దిగుమతులు చేసుకుంటున్నారని అన్నారు. బడ్జెట్లో క్రమంగా వ్యవసాయ రంగానికి నిధులు తగ్గిస్తూ వస్తున్నదని ఆరోపించారు. 2025-26 బడ్జెట్లో ఎరువులపై సబ్సిడీని రూ.1,71,298 కోట్ల నుండి రూ.1,67,887 కోట్లకు, ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజనకు రూ.15,864 కోట్ల నుండి రూ.12,242 కోట్లకు తగ్గించిందన్నారు. ఎఫ్సిఐ, సిసిఐ, నాఫెడ్ సంస్థలను ఎత్తివేసే ప్రయత్నం చేస్తున్నదని తెలిపారు. పంటల ఉత్పాదకతను పెంచడానికి అవసరమైన పరిశోధనలను గత 11 సంవత్సరాలలో తగ్గించారన్నారు. విత్తన టెక్నాలజీని విదేశాల నుండి దిగుమతి చేసుకుంటున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం నాయకులు తీగల ఆగిరెడ్డి, గుండు రామస్వామి, కొర్ర రాజు, కన్నోజు సదానందం పిఎసిఎస్ డైరెక్టర్, నిమ్మల బిక్షం, దబ్బకట్ల పాణి, కుందూరు సాంబిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ అభ్యర్థి విజయశాంతిని కలిసిన ములుగు జిల్లా కాంగ్రెస్ నాయకులు



**నవతెలంగాణ- ములుగు**

ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ అభ్యర్థుల జాబితాలో ఉన్న విజయశాంతిని బంజారాహిల్స్ లోని ఆమె స్వగృహంలో మంగళవారం ములుగు జిల్లా నాయ కులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ములుగు జిల్లా వాసిగా ఉన్న విజయశాంతికి ఎమ్మెల్సీ పదవీ ఇవ్వడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. అలాగే మంత్రి పదవి కూడా ఇవ్వాలని కోరుతున్నట్లు తెలిపారు. సూర్యనేని నాగేశ్వర్‌రావు, బుట్టయిగూడెం మాజీ సర్పంచ్ సునార్కని నారా యణ, జిల్లా నాయకులు ఆక రవి, భవిత స్వచ్ఛంద సంస్థ వ్యవస్థపాక అధ్యక్షులు కత్తి మొగిలి, తదితరులు పాల్గొన్నారు.



## ముయ్యాలమ్మతల్లి గుడి రహదారి పనులు ప్రారంభం

**నవతెలంగాణ-గోవిందరావుపేట**

మండలంలోని పస్రా గ్రామంలో రూ.20లక్షలతో ముయ్యాలమ్మతల్లి గుడి రహదారి పనుల కోసం మంగళవారం పూజా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ... మండలంలోని ప్రతి మానవుల గ్రామంలోనూ సందు గొందు రహదారులను సైతం సీసీ రహదారులుగా మార్చి ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా సౌకర్యాలు కల్పిస్తున్నామని అన్నారు. ఇప్పటికే కోట్లాది రూపాయలతో గ్రామంలో సీసీ రహదారుల నిర్మాణాన్ని పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ ములుగు నియోజకవర్గ యూత్ ఉపాధ్యక్షులు గొంది కిరణ్ మాట్లాడారు. రూ.20లక్షలతో 267 మీటర్లు సీసీ రహదారు పనులను పాత బొడ్రాయి నుండి ఉయ్యాలమ్మ తల్లి గుడి వరకు మంజూరి ఇచ్చిన సందర్భంగా మంత్రి సీతక్కకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఎన్నో ఇబ్బందులు పడుతున్న ఈ ప్రాంతవాసులకు రహదారి వల్ల సౌకర్యవంతంగా ఉంటుందని అన్నారు. నాణ్యతలో ఎక్కడ రాజీ పడకుండా రహదారి నిర్మాణం చేస్తున్నామని అన్నారు. గ్రామంలో పెండింగ్, మరిన్ని రహదారుల సీసీ నిర్మాణాలకు మంత్రికి విన్నవించగా హామీ ఇచ్చారని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పాలడుగు వెంకటకృష్ణ, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు చింతా క్రాంతి, ఐఎన్‌టియుసి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు కొంపెల్లి శ్రీనివాస్ రెడ్డి; కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు బద్దంలిగారెడ్డి, మండల యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు కొల్లు శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## పరిశుభ్రమైన ఆహారం అందించాలి : డాక్టర్ అఖిల



**నవతెలంగాణ-మంగపేట**

వసతి గృహ విద్యార్థులకు పరిశుభ్రమైన ఆహారం అందించాలని మంగపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు అఖిల అన్నారు. మంగళవారం మంగపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధి కేజీబీవీ పాఠశాలతో పాటు మండలంలోని తిమ్మంపేట ఎంపీపీఎస్‌ను ఆస్పత్రి సిబ్బందితో కలిసి ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా కేజీబీవీ పాఠశాలలో ఆహార పదార్థాలు నిల్వ ఉంచే గదులను వంట శాలను, వంట పాత్రలను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించి ఆరోగ్య కరమైన అలవాట్లను పెంపొందించుకోవాలని తెలిపారు. సుదూర గ్రామాల నుంచి చదువు కోసం కుటుంబాలను విడిచి వసతి గృహాల్లో ఉండే విద్యార్థులకు మెనూ ప్రకారం ఆహారాన్ని అందించాలని ఉపాధ్యా యులకు, సిబ్బందిక సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు తరుణ్, మనోజ్ ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

## హెచ్ఐవీ పట్ల అవగాహన కలిగి ఉండాలి

### వైఆర్జి కేర్ లింక్ వర్కర్స్ స్కీం సంస్థ లింక్ వర్కర్ తప్పట్ల కిషన్



**నవతెలంగాణ-ములుగు**

హెచ్ఐవీ, ఎయిడ్స్ పట్ల ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని వైఆర్జి కేర్ లింక్ వర్కర్స్ స్కీం సంస్థ లింక్ వర్కర్ తప్పట్ల కిషన్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం హెచ్ఐవి, ఎయిడ్స్ పై కళాజాత ప్రోగ్రాం గోవిందరావుపేట మండలం పస్రా గ్రామంలో నిర్వహిం చారు. హెచ్ఐవీ ఎయిడ్స్ మీద కళాకారుల చేత ఆటలతో పాటలతో కలపత్రా లతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హెచ్ఐవీ, ఎయిడ్స్ నాలుగు మార్గా ల ద్వారా వస్తుందని, అవి సురక్షితం కానీ లైంగిక సంబంధాల వల్ల, కలుషిత సూదులు ఇంజక్షన్ల ద్వారా, పరీక్షించని రక్త మార్పిడి వల్ల, హెచ్ఐవీ గర్భిణి నుండి పుట్టబోయే బిడ్డకు వస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాజాత రమేష్ బృందం, ఆశా వర్కర్స్ పాల్గొన్నారు.

# అంతర్జాతీయ విద్యనందించడమే ప్రభుత్వ లక్ష్యం

### భూపాలపల్లిలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ భవనానికి రూ.200 కోట్లు

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



**నవతెలంగాణ-భూపాలపల్లి**

పేద, నిరుపేద విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి విద్యను అందించడమే సీఎం రేవంత్‌రెడ్డి ప్రజా ప్రభుత్వ లక్ష్యమని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మంగళవారం భూపాలపల్లి లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటులో భాగంగా మన భూపాలపల్లికి అవకాశం లభించిందన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ భవనానికి రూ.200 కోట్లు మంజూరు చేస్తూ ఆర్థికశాఖ ఆమోదం తెలిపిందని అన్నారు. దీంతో పేద, మధ్య తరగతి విద్యార్థులకు కార్పొరేట్, అంతర్జాతీయస్థాయి విద్య అందనుందని అన్నారు. కాగా, రూ.200 కోట్లు మంజూరు చేయడంతో సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం, ఆర్థికశాఖ మంత్రి భట్టి విక్రమార్కకు కృతజ్ఞతలు తెలిపారు. సుమారు 20 నుంచి 25 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేసే ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలో అద్భుతమైన క్రీడా ప్రాంగణాన్ని ఏర్పాటు చేయడంతో పాటు, అందులో విద్యా బోధన చేసే ఉపాధ్యాయులకు కూడా అక్కడే వసతి కల్పించడానికి గృహ సముదాయాన్ని నిర్మిస్తామన్నారు. విద్యార్థులకు అన్ని వసతులతో పాటు సాంకేతికంగా అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన డిజిటల్ విద్యా బోధన చేయడానికి డిజైన్ చేసినట్లు చెప్పారు.

### పేదింటి ఆడపిల్లలకు కళ్యాణ లక్ష్మీ వరం

పేదింటి ఆడబిడ్డలకు కళ్యాణలక్ష్మి పథకం ఓ వరం లాంటిదని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో భూపాలపల్లి మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన మొత్తం 43మంది కళ్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ లబ్దిదారులకు రూ.43,04,988 విలువైన చెక్కులను అందజేశారు. మహిళా సంక్షేమానికి ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని, మహిళలను కోటీశ్వర్లు చేయాలనే గొప్ప లక్ష్యంతో సోలార్ ప్లాంట్, మహిళా శక్తి క్యాంటీన్లు, ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణమే కాకుండా ఆర్టిసి బస్సులకు మహిళలకు ఓనర్లను చేసి అప్పజెప్పే విధంగా ప్రభుత్వం ముందుకు పోతుందన్నారు.

### నిరుపేదల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

నిరుపేదల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలో భూపాలపల్లి పురపాలక సంఘం, పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) జిల్లా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్యాంటీన్‌ను ప్రారంభించారు. రోగులు వారి సహాయకుల సౌకర్యార్థం నాణ్యమైన భోజనం అందించేందుకు ఈ తరహా క్యాంటీన్‌లను అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. అంతకుముందు క్యాంటీన్‌లో అల్పాహారం చేశారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, భూపాలపల్లి మున్సిపల్ కమిషనర్ బిర్రు శ్రీనివాస్, ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ నవీన్ కుమార్, భూపాలపల్లి తహసీల్దార్ శ్రీనివాసులు, కాంగ్రెస్ జిల్లా నాయకులు అప్పం కిషన్, రామినేని రవీందర్, పిప్పాల రాజేందర్, బుర్ర కొమరయ్య, సాంబమూర్తి, మున్సిపల్ మాజీ కౌన్సిలర్ దాట్ల శ్రీనివాస్, ముంజాల రవీందర్‌గౌడ్, మహేందర్, తోట రంజిత్ స్థానిక నాయకులు పాల్గొన్నారు.

### ఎమ్మెల్యేకు గాజర్ల అశోక్ సన్మానం



యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌కు నిధులు కేటాయించడానికి అహర్నిశలు కృషి చేసిన భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావును కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి గాజర్ల అశోక్, పీసీసీ సభ్యులు దబ్బేట రమేష్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి ఎమ్మెల్యేకు శాలువా కప్పి సన్మానం చేశారు.

### గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం



**చిట్యాల :** గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పాటుపడుతుం దని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మంగళవారం మండలంలోని గోపాలపురం, ముచిలిపర్తి, చల్లగరిగా, జూకల్, తిరుమలాపురం, నవాబుపేట, చింతకుంట రామయ్యపల్లె, చిట్యాల, కైలాపూర్ శాంతినగర్, బాషింగ్ పల్లి, గాంధీ నగర్, నైన్ పాక, వరికోల్ పల్లి, చైన్ పాక, వెంచరామి, కుర్మపల్లి, పలు గ్రామాల్లో సిసి, బిటి, సైడ్ డ్రైనేజ్ కాలువలకు రూ.9కోట్ల20 లక్షలతో శంకుస్థాపన చేశారు. ముచినిపర్తి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లకు భూమి పూజ చేశారు. అనంతరం చిట్యాల మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గూట్ల తిరుపతి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమావేశంలో14 మంది లబ్దిదారులకు కళ్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. పేద బడుగు బలహీన వర్గాల కోసం ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం చేపడుతుందన్నారు. ధరణిని రద్దుచేసి త్వరలో భూమాతను ప్రవేశపెడుతు న్నామని తెలిపారు. మహిళ సాధికారత కోసంఅనేక రకాల పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేసే ప్రజాప్రతినిధులకు ప్రజల సహకారం అవసరమని అన్నారు. తాసిల్దార్ హేమ, ఎంపీడీఓ జయశ్రీ, పిఆర్ ఏఈ అరుణ, రాష్ట్ర అధికార ప్రతినిధి గాజర్ల అశోక్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్పర్సన్ గుమ్మడి శ్రీదేవి సత్యనారా యణ, జిల్లా నాయకులు మధు వంశీకృష్ణ, దొడ్డి కిష్టయ్య, కామెడీ రత్నాకర్ రెడ్డి, పులి తిరుపతిరెడ్డి, బుర్ర శ్రీనివాస్, దొంతుల శ్రీనివాస్, మన్యం శ్రీనివాస్ రావు, మూలశంకర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాల బస్సును ఢీకొట్టిన బైక్... వ్యక్తి మృతి

**నవతెలంగాణ-ఏటూరునాగారం ఐటీడీఏ**

పాఠశాల బస్సును బైక్ ఢీకొట్టిన ఘటనలో వ్యక్తి మృతిచెందిన సంఘటన మండల కేంద్రంలోని సినిమా థియేటర్ వద్ద మంగళవారం చోటు చేసుకుంది. ఏటూరునాగారం ఏఎస్ఐ సుబ్బారావు కథనం ప్రకారం... మంగపేట మండలం కమలాపురం గ్రామానికి చెందిన శెట్టి నరేష్(38) ద్విచక్రవాహనంపై వస్తున్నాడు. ఇదే క్రమంలో ఎస్‌వీవీ పాఠశాల బస్సు యూటర్న్ తీసుకుంటుండగా బస్సు వెనుక నుంచి నరేష్ బైక్‌పై వస్తూ అదుపుతప్పి స్కూల్ బస్సును ఢీకొట్టాడు. దీంతో అతడి తలకు తీవ్రగాయాలు కాగా హుటాహుటిన స్థానిక సామాజిక ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉందని స్థానిక వైద్యులు ములుగు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు నరేష్‌ను పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి భార్య శెట్టి అమల ఫిర్యాదు మేరకు స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## సీఎం పర్యటన సభాస్థలి పరిశీలన

**నవతెలంగాణ-స్టేషన్‌ఘన్‌పూర్**



సీఎం బహిరంగసభస్థలిని, అధికారులతో కలిసి మంగళవారం అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్ పరిశీలించారు. ఎక్కడా కూడా ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని కింది అధికారులను ఆదేశించారు. పార్కింగ్, ఈ కార్యక్రమంలో ఆర్డీఓ డీఎస్ వెంకన్న, తహశీల్దార్ వెంకటేశ్వర్లు, ఆర్ఐ శ్రీకాంత్, నాయకులు బూర్ల శంకర్, బూర్ల రాజు, తదితరులు పాల్గొన్నారు.

## చిన్న ప్రణీత్‌కు గ్రూప్-2లో 138 ర్యాంకు

**నవతెలంగాణ-కొడకండ్ల**

కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని కొడకండ్ల మండల కేంద్రానికి చెందిన చిన్న ప్రణీత్ గ్రూప్-2 లో 138 ర్యాంకు సాధించి తన సత్తాను చాటుకున్నాడు. నిరుపేద కుటుంబంలో పుట్టి అంచలంచెలుగా ప్రతి క్లాసులో మార్కులు సాధించి గ్రూప్-2కు ఎంపిక కావడంతో ఆయన కుటుంబంతో పాటు కొడకండ్ల మండల ప్రజలు ప్రశంసలు తెలియజేశారు. రెక్కాడితే కానీ డొక్కాడని కుటుంబంలో పుట్టి తన తల్లిదండ్రుల కష్టాన్ని చూసి ఎలాంటి కోచింగ్ సెంటర్లకు వెళ్లకుండా ఇంట్లోనే చదువుకుంటూ గ్రూప్-2 సాధించడం పట్ల తల్లిదండ్రుల ఆనందోత్సవాలు వెళ్ళవంటాయి.

## ఉత్తమ సేవకు ప్రతిభా పురస్కారం

**నవతెలంగాణ పాలకుర్తిరూరల్**



అంతర్జాతీయ మహిళా దినోత్సవంను పురస్కరించుకొని జనగామ జిల్లా కలెక్టర్ ఐసిడిఎస్‌లో ఉత్తమ సేవ ప్రతిభ కనబరిచిన వారికి ప్రశంసా పత్రాలను అందజేశారు. పాలకుర్తి మండలం తిరుమలగిరి గ్రామానికి చెందిన అంగన్వాడీ ఆయా గాదరి ఎల్లమ్మ టీచర్‌లేకుండా గత నాలుగు సంవత్సరాలుగా సేవలందించడంతో ఎల్లమ్మ చేసిన సేవలకు గాను జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వానబాషా ప్రశంసా పత్రం ఇచ్చి సత్కరించారు.

## విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

**నవతెలంగాణ-లింగాలఘణపురం**

మండలంలోని కుందారంలో వాసవి క్లబ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్స్, పెన్నులు మంగళవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బందం, వాసవి క్లబ్ అధ్యక్షులు గోడిశాల శివరామకృష్ణ, ప్రధాన కార్యదర్శి దేవునూరి వెంకటరమణ, కోశాధికారి గాద రమేష్, క్లబ్‌చార్టెడ్ ప్రెసిడెంట్, పూర్వ అధ్యక్షులు దారం అశోక్, క్లబ్ సభ్యులు దారం వెంకన్న , దారం కిషోర్, దారం సంతోష్, దారం వీరన్న పాల్గొన్నారు.

## మొల్ల జయంతి ఉత్సవాలను నిర్వహించాలి

**నవతెలంగాణ-జనగామ కలెక్టరేట్**

రామాయణాన్ని సరళమైన తెలుగు భాషలో అందరికీ అర్థమయ్యేలా రచించిన కుమ్మర్ల ఆడపడుచు కవయిత్రి ఆతుకూరి మల్లమాంబ జయంతి ఉత్సవాలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని తెలంగాణ కుమ్మర్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏనుగు తల యాదగిరి మంగళవారం కోరారు. ఈనెల 13న కవయిత్రి మల్లమాంబ జయంతి అని, ప్రభుత్వం గుర్తించి జయంతి ఉత్సవాలను అధికారంగా నిర్వహించే వరకు పోరాడుతాం అన్నారు.

## రూ.10 లక్షల విలువైన గంజాయి పట్టివేత

**నవతెలంగాణ-నర్మెట్ట**



అక్రమంగా తరలిస్తున్న రూ.10 లక్షల విలువైన గంజాయిని తరలిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసి గంజాయిని సీజ్ చేసినట్లు సీఐ అబ్బయ్య తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎస్ఐ నగేష్ ఆధ్వర్యంలో పోలీసు బృందం హనుమంతాపూర్ క్రాస్‌రోడ్డు వద్ద వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా జార్ఖండ్‌కు చెందిన ఎండి.ఇశారార్ వద్ద 19 కిలోల గంజాయి లభ్యం కావడంతో అదుపులోకితీసుకుని గంజాయిని,సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు.

## శ్రీచైతన్యను సన్మానించిన ఎమ్మెల్యే

**నవతెలంగాణ-పాలకుర్తి**



జాతీయస్థాయి కరాటే పోటీల్లో శ్రీచైతన్య ప్రతిభను కనబరిచి బంగారు పతకాన్ని సాధించడం అభినందనీయమని ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో గల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి హనుమాండ్ల ఝాన్సీ రెడ్డి తో కలిసి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి శ్రీచైతన్యను ఘనంగా సన్మానించి, ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ ఆత్మస్థైర్యం కోసం బాలికలు కరాటేలో రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గూడ రవీందర్, కొమరయ్య, కిషన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన జర్నలిస్టులకు సంక్షేమ పథకాలను అందించాలి

- టిడబ్ల్యూజేఏ రాష్ట్ర అధ్యక్షులు వెంకన్న నాయక్


**నవతెలంగాణ-పాలకుర్తి**



రాష్ట్రంలో మీడియా రంగంలో పనిచేస్తున్న గిరిజన జర్నలిస్టులకు ప్రభుత్వం ప్రవేశపెట్టి సంక్షేమ పథకాలను అందించాలని టిడబ్ల్యూజేఏ రాష్ట్ర అధ్యక్షులు బానోతు వెంకన్ననాయక్ ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం మండల కేంద్రంలో గిరిజన జర్నలిస్టుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా టియుడబ్ల్యూజేఏ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యులు లావుడియా రాజుతో కలిసి వెంకన్న నాయక్ మాట్లాడుతూ రాష్ట్రంలో పని చేస్తున్న గిరిజన జర్నలిస్ట్ లు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. గిరిజన జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించేందుకు, గిరిజన జర్నలిస్టులకు శిక్షణ ఇచ్చేందుకు ఐటీడీఏ, ప్రెస్ అకాడమీ సంయుక్తంగా కషి చేయాలని అన్నారు. గిరిజన జర్నలిస్టులకు ఎలాంటి షరతులు లేకుండా ఐటిడిఎ రుణాలను మంజూరు చేసి జర్నలిస్టు కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. గిరిజన జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం, భవిష్యత్తు కార్యాచరణను రూపొందించేందుకు గిరిజన జర్నలిస్టులకు సభ్యత్వ నమోదు తో పాటు జిల్లా, రాష్ట్ర మహాసభలను నిర్వహించి కమిటీలను ఎన్నుకుంటామని తెలిపారు. సభ్యత్వం పొందిన గిరిజన జర్నలిస్టులకు ప్రమాద భీమా సౌకర్యాన్ని కల్పిస్తున్నామని అన్నారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకునేందుకు గిరిజన జర్నలిస్టులు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టియుడబ్ల్యూజేఏ జిల్లా అధ్యక్షులు ధారావత్ అశోక్ నాయక్, నాయకులు గుగులోతు దేవోజి నాయక్, ధీరావత్ శ్రీనివాస్ నాయక్, సుమన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నేత్ర వైద్యపరీక్షలు

**నవతెలంగాణ-కొడకండ్ల**



మండల కేంద్రంలోని టీఎస్ ఆర్ఎస్ పాఠశాల విద్యార్థినీలకు మంగళవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో 16 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి 25 మంది విద్యార్థినీలకు ఉచితంగా కంటిఅద్దాలను అందజేయడం జరిగింది. విద్యార్థినిలకు ఆర్బిఎస్కే డాక్టర్ స్కీం ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించి మందులు కూడా పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ హరికష్ణ ఆర్ బి ఎస్ కే డాక్టర్స్ ప్రిన్సిపాల్ దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించిన నాయకులు

**నవతెలంగాణ-లింగాలఘణపురం**

మండలంలోని చీటూరులో పర్యటించిన మాజీ జడ్పీటీసీ గుడి వంశీధర్‌రెడ్డి అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి అక్కడ ఉన్న కిటికీలు సరిగ్గా లేక కోతుల భయంతో పిల్లలు ఇబ్బందులు పడుతున్నారని అంగన్వాడీ టీచర్ పిల్లల తల్లిదండ్రులు తెలియజేయగా వెంటనే వాటిని ఏర్పాటు చేసుకోండి అని తెలియజేసి వాటికి అయ్యే ఖర్చును ఇస్తాను అని హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు, మార్కెట్ వైస్ చైర్మన్ కొల్లూరి శివ కుమార్ , మండల పార్టీ నేతలు, మాజీ సర్పంచ్ అయిల మల్లేష్, మాజీ ఎంపీటీసీ ఉప్పల మధు , గ్రామశాఖ అధ్యక్షులు నకిర్త మల్లయ్య, మాజీ ఉపసర్పంచ్ బర్ల గణేష్ , గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

## తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు తొట్ల మల్సూర్

- కేజీకేఎస్ జిల్లా కార్యదర్శి వెంకట మల్లయ్య

**నవతెలంగాణ-జనగామ**



తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు మన కల్లుగీత కార్మిక సంఘం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు తొట్ల మల్సూర్ అని ఆ సంఘం జిల్లా కార్యదర్శి బాల్నే వెంకట మల్లయ్య అన్నారు. తొట్ల మల్సూర్ 26 వర్ధంతి సందర్భంగా స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో కల్లుగీత కార్మిక సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా వెంకట మల్లయ్య మాట్లాడుతూ తొట్ల మల్సూరి ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. పాలేరుగా పనిచేస్తున్న రోజుల్లోనే ఆనాటి నైజాం సర్కారుకు వ్యతిరేకంగా చెన్నారెడ్డి, ప్రతాపరెడ్డి, దేశముకులకు వ్యతిరేకంగా భూమికోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం అనేక పోరాటాలు చేశారు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో కేజీకేస్ జిల్లా కమిటీ సభ్యులు జొన్నగోని శ్రీనివాస్, బైరగోని వెంకటయ్య, సిఐటియు జిల్లా కార్యదర్శి సుంచు విజేందర్, నాయకులు కళ్యాణి లింగం, సౌందర్య, నరసయ్య, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలి

### అభివృద్ధి పనులు సమన్వయంతో వేగంగా పూర్తిచేయాలి



**నవతెలంగాణ-జనగామ కలెక్టరేట్**

ఈ నెల 16న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఘనపూర్ (స్టేషన్) పర్యటన విజయవంతానికి అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కడియం శ్రీహరి, కలెక్టర్ రిజ్వాన్‌బాషాషేక్‌లు ఆదేశించారు. సీఎం నేపథ్యంలో తగిన ఏర్పాట్లపై కలెక్టర్ మంగళవారం అదనపు కలెక్టర్లు పింకేష్ కుమార్, రోహిత్‌సింగ్, డీసీపీ రాజమహేంద్రనాయక్‌లతో కలిసి మంగళ వారం ఆర్డీఓ, జిల్లా అధికారులు, పోలీసు అధికారులు, తహసీల్దార్లు, సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడియం మాట్లాడుతూ ఈ నెల 14 వరకు సంబంధిత పనులన్నింటినీ వేగవంతం చేసి, పూర్తిచేయాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ఎక్కడా కూడా రూట్‌లవారీగా, పార్కింగ్, రాకపోకలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని పోలీసు అధికారులకు సూచించారు. అలాగే సభాస్థలి వద్ద మహిళాపోలీస్ సిబ్బందిని ఎక్కువ మొత్తంలో నియమించాలన్నారు. పార్కింగ్‌వద్ద, సభాస్థలికి కొంచెం దూరంలో తాగునీటి వసతి, తాత్కాలిక మూత్రశాలలను ఖచ్చితంగా ఏర్పాటుచేయాలని సూచించారు. శంకుస్థాపనలు చేసే చోట షామియానా, తదితర మౌలిక సదుపాయాలను కల్పించాలన్నారు. అదేవిధంగా రూట్‌మ్యాప్స్ ఆధారంగా సూచికబోర్డులను నిర్వహించాలని తెలిపారు. ఎటువంటి తప్పిదాలకు ఆస్కారం ఇవ్వకుండా అధికారులందరూ సమన్వయంతో సీఎం సభను విజయవంతం చేయాలని కోరారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ సీఎం పర్యటన నేపథ్యంలో చేపట్టాల్సిన పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని ఆదేశించారు. ప్రణాళికాబద్ధంగా పూర్తి ఏర్పాట్లను పక్కాగా నిర్వహించాలని సూచించారు.

ఈ సమీక్ష సమావేశంలో ఆర్డీఓ వెంకన్న, ఘనపూర్ (స్టేషన్) మునిసిపల్ కమిషనర్ గొడిశాల రవీందర్, ఏసీపీ భీంశర్మ పీడీ డిఆర్డిఓ వసంత, డిఎంహెచ్ఓ మల్లికార్జున రావు, డిపిఓ స్వరూప, హౌసింగ్ పీడీ మాతనాయక్, విద్యుత్ ఎస్ఈ వేణుమాధవ్, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఇంజనీరింగ్ శాఖ అధికారులు, పోలీసు అధికారులు, తహసీల్దార్లు, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# మెడికల్ కాలేజీ, ఎంసీహెచ్ వర్కర్ల వేతనాలు వెంటనే చెల్లించాలి

- సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాపర్తి రాజు



**నవతెలంగాణ-జనగామ**

మెడికల్ కాలేజీ హాస్టల్, ఎంసిహెచ్ హాస్పిటల్ వర్కర్స్ పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు రాపర్తి రాజు డిమాండ్ చేశారు. వేతనాలు లేక పస్తులుంటున్నామని సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం వర్కర్లు ఎంసి హెచ్ ఆస్పత్రి వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రాపర్తి రాజు మాట్లాడుతూ ఆస్పత్రి వర్కర్ స్పెల్లింగ్ వేతనాలు చెల్లించడం లేదని జిల్లా కలెక్టర్ దష్టికి తీసుకువెళ్లిన ఫలితం లేకుండా పోయిందన్నారు. ఈ విషయంపై ఈనెల 16 వరకు వేతనాలు చెల్లించకపోతే 16న స్టేషన్‌ఘన్‌పూర్‌లో ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ఆయన దృష్టికి తీసుకువెళ్తామని చెప్పారు. ఎంసిఎచ్ హాస్పిటల్ వర్కర్స్ కు రెండు నెలల నుండి వేతనాలు పెండింగ్ లో ఉన్నాయని, ఇప్పటికీ వేతనాలు అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే కార్మికులు వేతనాలు అందక ఇబ్బంది పడుతున్న పరిస్థితిని యూనియన్ ఆధ్వర్యంలో అధికారుల దష్టికి తీసుకెళ్లామని, సంబంధిత కాంట్రాక్టర్ ను బ్లాక్ లిస్టులో పెట్టామని ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ తర్వాత వేతనాలు వస్తాయని తెలిపినప్పటికీ వేతనాలు అందలేదన్నారు.అతి తక్కువ వేతనాలతో పనిచేస్తున్నటువంటి కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ కార్మికులు నెలల తరబడి వేతనాలు రాకపోవడంతో రవాణాచార్జీలు లేక, కుటుంబాన్ని పోషించుకోవడానికి మానసికంగా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. పది నెలల నుండి పీఎఫ్, ఈఎస్ఐ డబ్బులు కార్మికుల అకౌంట్లలో జమ కాలేదని, ఈ డబ్బులు ఎవరు కాజేశారని మండిపడ్డారు. వెంటనే పీఎఫ్ ఈఎస్ఐ డబ్బులు జమ చేయాలని అన్నారు. ఈ నెల 16న జిల్లాలోని స్టేషన్‌ఘనపూర్‌కు ముఖ్యమంత్రి పర్యటన ఉన్నందున వారు వచ్చేలోపు పెండింగ్ వేతనాలు ఇవ్వాలని,లేకుంటే ముఖ్యమంత్రి దష్టికి తీసుకెళ్తామని తెలిపారు. కాంట్రాక్టు వర్కర్స్ ను పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం నెలకి రూ. 26వేలు ఇవ్వాలని, రెగ్యులర్ గా వేతనాలు నెలనెలా 5వ తేదీ లోపే ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో తెలంగాణ ఎంసిహెచ్, మెడికల్ కాలేజ్ హాస్టల్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా అధ్యక్షులు రామ్ దయాకర్, నాయకులు ఏనుగుల రఘు, జి.అజయ్, స్వామి, రూతుభారతి, ప్రశాంత్, గోపాలకష్ణ, స్వప్న, కవిత, రజిత, ఎల్లమ్మ బాలరాజు, కర్ణాకర్, ఉప్పలయ్య, సునీత, స్వాతి, సిద్దులు, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధికి సహకరించని దద్దమ్మలు బీజేపోల్లు

- బీఆర్ఎస్‌లో ఆ ముగ్గురే ఉన్నారా..?
- 16న సీఎం సభను విజయవంతం చేయాలి
- రూ.800కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి



**నవతెలంగాణ-స్టేషన్‌ఘన్‌పూర్**

బీజేపీ కేంద్ర ప్రభుత్వం తెలంగాణ అభివృద్ధిని అడ్డుకుంటుందని, రాష్ట్ర అభివృద్ధికి సహకరించని దద్దమ్మలు బీజేపోల్లని, బీజేపీ తెలంగాణా రాష్ట్రానికి పూర్తి వ్యతిరేకమని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి విమర్శించారు. మంగళవారం స్టేషన్‌ఘనపూర్, చిల్పూర్‌మండల కేంద్రాల్లో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల విస్తృత స్థాయి సన్నాహక సమావేశం మండల అధ్యక్షులు జూలుకుంట్ల శిరీష్ రెడ్డి, గడ్డ మీది సురేష్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ ఈనెల 16న స్టేషన్ ఘనపూర్ నియోజక వర్గానికి పలు అభివృద్ధి పనుల శంకుస్థాపనలు, అనంతరం జరిగే బహిరంగ సభకు పార్టీ శ్రేణులను తరలించేందుకు ఏర్పాట్లపై గ్రామాల నాయకులతో చర్చించారు. గ్రామ, గ్రామాన ప్రతీ బూత్ స్థాయి నుంచి 150మందికి తగ్గకుండా శ్రేణులను తరలించాలని సూచించారు. రాష్ట్రప్రభుత్వ ఏర్పాటు అనంతరం రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా దాదాపు రూ. 800కోట్ల అభివద్ధి పనులకు మంజూరీ ఇచ్చిందని తెలిపారు. పలు అభివద్ధి పనులకు శంఖుస్థాపనలు, అనంతరం భారీ బహిరంగ సభ ఉంటుందని పేర్కొన్నారు. చిల్పూర్ మండలం నుంచి 7వేల మందిని తగ్గకుండా నియోజక వర్గ వ్యాప్తంగా 50వేల మందిని తగ్గకుండా తరలించాలని, నియోజక వర్గ ప్రజాసంక్షేమం కోసం, మరిన్ని నిధులు అడగడం జరుగుతుందని అన్నారు. ఆతీరుగా మెప్పించి నిధులు తెచ్చుకుందామని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నమ్మకం, విశ్వాసం కలిగి ఉన్నానని, అడిగిందే తడవుగా నియోజక వర్గానికి నిధులు మంజూరు చేసిన సీఎం రేవంత్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. చిల్పూర్ మండలానికి ఇచ్చిన హామీల్లో చిల్పూర్ గుట్ట ఆలయ అభివద్ధి, మండల కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటు, చివరి గ్రామాలకు మల్లన్న గండి ద్వారా చివరి ఆయకట్టు వరకు సాగునీరు, పలు ప్రధాన రోడ్లు వేసుకుందామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని, సీఎం కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు తనకు సహకారంగా ఉండాలని కోరారు. ఈకార్యక్రమంలో చిల్పూర్ దేవస్థాన చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్ రావు, జిల్లా అధికార ప్రతినిధి కేశిరెడ్డి లక్ష్మారెడ్డి, సీనియర్ నాయకులు సీహెచ్ నరేందర్ రెడ్డి, బెలిదే వెంకన్న, పోగుల సారంగపాణి, మాజీ ప్రజా ప్రతినిధులు మామిడాల లింగారెడ్డి, వంగాల జగన్మోహన్ రెడ్డి, ఇనుగాల వెంకట్ రెడ్డి, గన్ను నర్సింహులు, కొలిపాక సతీష్, బొమ్మిశెట్టి బాలరాజు, పోలేపల్లి రంజిత్ రెడ్డి, వినోద్ కుమార్, పోశాల క్రిష్ణ మూర్తి, రుప్లా నాయక్, మల్లారెడ్డి, సురేష్, వైస్ చైర్మన్ చిర్ర నాగరాజు, డైరెక్టర్ మాదిరెడ్డి యశ్వంత్ రెడ్డి, ఇల్లందుల విజయ్, కలకోల పోచయ్య మహిళా నాయకులు రజిని, తదితరులు పాల్గొన్నారు.

**లింగాలఘణపురం :** ఈనెల 16న ఘనపూర్ నియోజకవర్గంలో జరిగే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బహిరంగ సభను విజయవంతం చేయాలని మంగళవారం మండలంలోని పటేల్ గూడెం, చీటూరు, కిష్టగూడెం, కుందారం, నెల్లుట్ల గ్రామాల్లో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొల్లూరి నర్సింహులు ఆధ్వర్యంలో మాజీ జడ్పీటీసీ గుడి వంశీధర్ రెడ్డి, కిసర దిలీప్ రెడ్డి, జీడికల్ దేవస్థాన చైర్మన్ మూర్తి, లోకుంట్ల ప్రవీణ్ , అబ్బాస్,శ్రీలతరెడ్డి, సమావేశాలు నిర్వహించారు.

**జఫర్ గడ్ :** 16వ తేదీన నిర్వహించే భారీ బహిరంగ సభస్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ దిశను మార్చే సభ, అభివద్ధికి దోహదం చేసే సభ అని జఫర్గడ్ మండలం పెద్ద ఎత్తున తరలివచ్చి సభను జయప్రదం చేయాలని ఎమ్మెల్యే కడియం శ్రీహరి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో జఫర్ గడ్ మండల కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలతో ఎమ్మెల్యే విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల సమయంలో నియోజకవర్గప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చుందుకు, నియోజకవర్గ అభివద్ధికి చిత్తశుద్ధితో పని చేస్తున్నానని స్పష్టం చేశారు. మనందరం కలిసి 16న జరిగే భారీ బహిరంగ సభను విజయవంతం చేసుకుందామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నూకల ఐలయ్య. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎల్లయ్య , పిఏసిఎస్ చైర్మన్ కరుణాకర్‌రావు, బ్రహ్మారెడ్డి, అనబోయిన బిక్షపతి, రాజు, సుదర్శన్, సుధాకర్,మంచాల అనిల్, కుక్కల సారంగంలు పాల్గొన్నారు.

# తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలి : ఎమ్మెల్యే

- గ్రామాల్లో త్రాగునీటి సమస్యలను గుర్తించాలి
- తాగునీటి సరఫరాకు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలి
- తాగునీటి శాఖ అధికారులతో సమీక్ష సమావేశం

**నవతెలంగాణ-పాలకుర్తి**

గ్రామీణ ప్రాంతాల్లో త్రాగునీటి సమస్య తలెత్తకుండా నివారణ చర్యలు చేపట్టేందుకు ప్రణాళికను సిద్ధం చేయాలని ఎమ్మెల్యే యశస్విని రెడ్డి త్రాగునీటి శాఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం మండల కేంద్రంలో గల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మిషన్ భగీరథ అధికారులతో త్రాగునీటి సమస్యపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలోని పట్టణాలతో పాటు గ్రామీణ ప్రాంతాలు, ఆవాస ప్రాంతాలు మారుమూల పల్లెలో ప్రజలకు త్రాగునీరు అందించాలని సూచించారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని ప్రత్యామ్నాయచర్యలు చేపట్టాలని, వేసవి దాహార్తిని తీర్చేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. త్రాగునీటి సమస్య తీవ్రంగా ఉన్న గ్రామాలను గుర్తించాలని సూచించారు. త్రాగునీటి సమస్యను పరిష్కరించేందుకు నిధుల కొరత లేదని తెలిపారు. మిషన్ భగీరథ నీటిని ప్రతి ఇంటికి అందేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న సమస్యలను సత్వరమే పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రత్యేక దష్టిని కేంద్రీకరించాలని, తాగునీటి కొరత రహిత నియోజకవర్గంగా తీర్చి దిద్దాలని అధికారులకు సూచించారు. తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు రైతుల నుండి బోరు బావులను వేసవి పూర్తయ్యే నాటికి అద్దెకు తీసుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ గ్రిడ్ ఈ ఈ సురేందర్, ఇంట్రా ఈ ఈ కృష్ణారెడ్డి, శ్రీకాంత్, గ్రిడ్, ఇంట్రా డిఈలు స్వామి దాస్, సూర్య, శ్రీనివాస్, సంధ్య శ్రీనివాస్, ఏఈలు నిశాంక్, నవీన, శ్రీనివాస్, నాగుల ప్రశాంతి, మహేందర్, ప్రియాంక, అనూష, వెంకటేశ్వర్రెడ్డి యాకూబ్ పాషా తదితరులు పాల్గొన్నారు.

## వత్తిడీలు లేకుండా పరీక్షలు రాయాలి

- ఇంటర్ పరీక్షల సరళిని పరిశీలించిన కలెక్టర్

**నవతెలంగాణ-జనగామ**



విద్యార్థులు ఎలాంటి ఒత్తిడిలు లేకుండా పరీక్షలు రాయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో గల ఏబీవీ కళాశాలలో జరుగుతున్న ఇంటర్ పరీక్షల తీరును కలెక్టర్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ప్రతి రూమ్ కు వెళ్లి, పరీక్షల నిర్వహణ సరళిని పరిశీలించారు. విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా పరీక్ష రాయలన్నారు. పరీక్షకు ఎంత మంది విద్యార్థులు హాజరయ్యారని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. పరీక్ష కేంద్రంలో సీసీ కెమెరాలు, తాగునీటివసతి, మెడికల్ సిబ్బందితో ఏర్పాటు చేసిన ఆరోగ్య శిబిరంలో మందులను తనిఖీ చేశారు. ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా పరీక్షలను సజావుగా నిర్వహించాలని, పరీక్షపూర్తయిన వెంటనే జవాబుపత్రాలను పోలీస్ బందోబస్తు మధ్య నిర్దేశిత ప్రాంతాలకు తరలించాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యవేక్షణలో కలెక్టర్ వెంట జిల్లా ఇంటర్మీడియట్ అధికారి జితేందర్ రెడ్డి, ఇతర సంబంధిత అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## కిడ్నాపైన 10 నెలల పాప సురక్షితం

- పోలీసుల అదుపులో ముగ్గురు నిందితులు
- తల్లిదండ్రుల వద్దకు చేరిన పాప

**నవతెలంగాణ-జనగామ**



జనగామ జిల్లా కేంద్రంలో కిడ్నాపైన 10 నెలల పాపను సురక్షితంగా జనగామ పోలీసులు పాప తల్లిదండ్రులకు పోలీసులు అప్పగించారు. తక్కువ సమయంలోనే కేసును ఛేదించి కిడ్నాప్ చేసిన ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్టుచేసి వారి వద్ద నుండి కిడ్నాపైన పాపను తీసుకొని తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ సందర్భంగా మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏసీపీ పాండరీ చైతన్‌నితిన్ చేతుల మీదుగా పాపను తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ ఛత్తీస్‌గడ్‌కు చెందిన రామ్ జిల్ రజాక్ పార్వతీ దంపతులు గత కొన్ని రోజులుగా జనగామ పట్టణంలో కూలి చేసుకుంటూ నివసిస్తున్నారు అని తెలిపారు. గత 13 రోజుల క్రితం తమతో పనిచేస్తున్న స్వామి-విజయలక్ష్మి అనే దంపతులు పాపను కిడ్నాప్ చేశారని ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేసినట్లు తెలిపారు. సీసీ కెమెరాల ఆధారంగా కిడ్నాప్ చేసిన వీరిద్దరితో పాటు పిల్లలను అమ్మడానికి సహకరిస్తున్న చంద్రమ్మఅనేమహిళను పోలీసులు మంగళవారం హైదరాబాద్ వరంగల్ నేషనల్ హైవే పెంబర్తి వద్ద పోలీసుల తనిఖీలు అరెస్టు చేసినట్లు తెలిపారు. అతి తక్కువ సమయంలో కిడ్నాప్ అయినా పాపను పట్టుకున్న పోలీసులను ఏసిపి అభినందించారు.

## క్యాంపు కార్యాలయాన్ని వాడుకున్న సంస్కృతి బీఆర్ఎస్‌దే

**నవతెలంగాణ-పాలకుర్తి**

ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసేందుకు పాలకుర్తి లో గల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని బిఆర్ఎస్ వాడుకుందని, అధికారిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని సర్వం వాడుకున్న సంస్కృతి బి ఆర్ ఎస్ కే దక్కుతుందని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో గల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గిరగాని కుమారస్వామి గౌడ్, నియోజకవర్గ నాయకులు బిల్లా సుధీర్ రెడ్డి లతో కలిసి సత్యనారాయణ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చేనాటికి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బిఆర్ఎస్ సామాగ్రి దర్శనమిచ్చిందని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు సతీమణి ఉషతోపాటు మాజీ మంత్రి సమీప బంధువులు ఏ హోదాతో ఉన్నారని ప్రశ్నించారు. ఝాన్సీరెడ్డిని ప్రశ్నించే నైతిక హక్కు బిఆర్ఎస్ నాయకులకు లేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కొడకండ్ల, పెద్ద వంగర మండల పార్టీ అధ్యక్షులు ధారావతు సురేష్ నాయక్, ముద్దసాని సురేష్, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షులు ధారావత్ రాజేష్ నాయక్, మాజీ సర్పంచ్ వీరమనేని యాకాంతరావు,యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ ఉపాధ్యక్షులు గోనే మహేందర్ రెడ్డిలతోపాటు నాయకులు అందే యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

## నేడు చిల్పూర్‌గుట్ట వెంకన్న కళ్యాణ మహోత్సవం

- ఆలయ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు

**నవతెలంగాణ-స్టేషన్‌ఘన్‌పూర్**

రెండోతిరుపతి పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న బుగులు వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో బుధవారం శ్రీ వెంకటేశ్వరుని కళ్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా జరుగనుంది. ఈ వేడుకలకు ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరితో పాటుగా ప్రముఖులు హాజరు కానున్నట్లు ఆలయ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు మంగళవారం తెలిపారు. స్వామివారి కళ్యాణ మహోత్సవ వేడుకకు భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు.

## బాధిత కుటుంబాలకు మాజీ వైస్ ఎంపీపీ పరామర్శ

**నవతెలంగాణ-స్టేషన్‌ఘన్‌పూర్**

మండలంలోని తాటికొండ గ్రామానికి చెందిన పీఏసీఎస్ సీఈఓ మగ్దూం అలీ తల్లి అలాగే కీసర యాదవరెడ్డి మరణించగా, గ్రామ రెవెన్యూ పరిధిలో జిట్టేగూడెం గ్రామం గాలిగుట్టకు చెందిన రామోజీ భార్య అనారోగ్యంతో మరణించగా బాధిత కుటుంబాలను మంగళవారం మాజీ వైస్ ఎంపీపీ చల్లా సుధీర్ రెడ్డి పరామర్శించి, పేద కుటుంబాలైన వారికి ఆర్థిక సాయం అందించారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు భేతి జయపాల్ రెడ్డి, రాంచంద్రారెడ్డి, పాలకుర్తి నాగరాజు, దామెర శ్రీను, బలిజ రాజు, పులి రవి, బొల్లం నాగరాజు, మేకల అనిల్, కాసర్ల తిరుమలేష్, బూసరాకేష్‌లు పాల్గొన్నారు.



## గ్రూప్-2 పరీక్ష ఫలితాల్లో జంగుతండా వాసి శ్రీకాంత్ ప్రతిభ



నవతెలంగాణ-గూడూరు

గ్రూప్-2 ఫలితాలలో మండలంలోని జంగుతండా పంచాయతీ పరిధిలో నివసిస్తున్న మూడు శ్రీకాంత్ ప్రతిభ చాటారు. ఎస్టీ కేటగిరిలో ప్రథమ ర్యాంకు, జోనల్ వైస్ ఓపెన్ కేటగిరీలో థర్డ్ ర్యాంక్, స్టేట్ వైడ్ 38వ ర్యాంకులు సాధించారు. ఈసందర్భంగా జంగుతండా పంచాయతీ మాజీ సర్పంచ్ అరుణమంగీలాల్, మాజీ ఎంపీటీసీ గీతాఅమరేందర్‌రెడ్డి, మూడు నరేష్‌లు శాలువాతో సత్కరించి సన్మానించారు. శ్రీకాంత్ ప్రతిభను చూసి కుటుంబ సభ్యులు, గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేశారు.

## తాళ్లపాయి కట్టును పరిశీలించిన ఎమ్మెల్యే కోరం

నవతెలంగాణ-గూడూరు



మహబూబాబాద్, భద్రాద్రి, కొత్తగూడెం జిల్లాల సరిహద్దు మహబూబాబాద్ ఇల్లందు నియోజకవర్గాల సరిహద్దు ప్రాంతమైన మండలంలోని మట్టేవాడ గ్రామ అటవీ ప్రాంతంలో ఉండే తాళ్లపాయికట్టును ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య మంగళవారం పరిశీలించారు. గత కొన్ని సంవత్సరాల క్రితం అటవీ ప్రాంతంలో తాళ్లపాయ కట్టును నిర్మించారు. తద్వారా అడవిలో పడే నీరంతా కంబాలపల్లి చెరువు మీదుగా బయ్యారం మండలంలోని పలు గ్రామాలకు నీరు అందుతుంది. పూర్వం నిర్మించిన తాళ్లపాయి కట్టుకు మరమ్మత్తులు చేయకపోవడం ద్వారా నేరు వృధాగా పోతుండడంతో మరమ్మత్తులు చేయించేందుకు ముందస్తుగా పరిశీలించారు. కట్టు మరమ్మత్తుకు తమ వంతు కృషి చేస్తానని రైతులకు హామీ ఇచ్చారు మట్టేవాడ గ్రామానికి చెందిన పలువురు రైతులు తాళ్లపాయ కట్టు మరమ్మత్తు చేయాలని ఎమ్మెల్యేను కోరారు. ఈమట్టేవాడ గ్రామ నాయకులు ఈసం.భరత్ కుమార్, మేడ, రవి ప్రసాద్, కొక్కిరాల వేణులు బయ్యారం కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



## మహిళల అభివృద్ధి కోసం నిరంతర కృషి

- పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినీ రెడ్డి..
- వేట ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు

నవతెలంగాణ-తొర్రూర్‌రూరల్

మహిళల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని మహిళల కోసం రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉచిత బస్సు, అన్ని రకాల ప్రభుత్వ పథకాలను మహిళలకే అందిస్తుందని, పాలకుర్తి నియోజకవర్గంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించిన వేట ఆధ్వర్యంలో నాంచారి మడూరు శివారు రెడ్డి గార్డెన్ లో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు వేట ఫౌండర్ ఝాన్సీ రాజేందర్ రెడ్డి నేతృత్వంలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకకు ముఖ్య అతిథిగా పాలకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి పాల్గొని మాట్లాడారు. వివిధ రంగాల్లో గొప్ప ప్రగతి సాధించిన మహిళలను సన్మానించడం ద్వారా సమాజంలో మహిళా సాధికారత, వారి కృషికి గౌరవం తెలియజేశారు. ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి వేట ఫౌండర్ ఝాన్సీ రాజేందర్ రెడ్డి, మహిళా మణులను ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి మాట్లాడుతూ మహిళలు ఈసమాజానికి నిలువెత్తు ప్రేరణ పురుషుల కంటే తక్కువ కాకుండా, అన్ని రంగాల్లో మహిళలు తమ ప్రతిభను నిరూపించుకుంటున్నారన్నారు. ప్రతి మహిళ తన లక్ష్యాలను సాధించేందుకు ధైర్యంగా ముందుకెళ్లాలి, ఎలాంటి అడ్డంకులైనా ఎదుర్కొని, విజయాన్ని సాధించగలరని సూచించారు. ప్రభుత్వ పథకాలను ఉపయోగించుకోవాలని భవిష్యత్తులో మహిళలకు మరింత సాయం చేయడానికి వేట ఫౌండేషన్ సిద్ధంగా ఉందని, మహిళా సాధికారత కోసం మరిన్ని కార్యక్రమాలు చేపడుతామని ప్రకటించారు. సన్మానిత మహిళా మణులు మాట్లాడుతూ వైద్య, విద్య, క్రీడా, రాజకీయ, సేవా రంగాల్లో గుర్తింపు పొందిన మహిళలు తమ అనుభవాలను పంచుకున్నారు. సమాజంలో మహిళలకు మరింత ప్రోత్సాహం అవసరమని, పురుషులతో సమానంగా అవకాశాలు దొరకాలని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు మరింత మద్దతు ఇవ్వాలని, స్వయం ఉపాధి, స్టార్ట్-అప్‌లు, వృత్తిపరమైన శిక్షణలో సహాయం చేయాలని కోరారు. ఇప్పటికే విజయాలు సాధించిన మహిళలు యువతకు మార్గదర్శకంగా ఉండాలి తద్వారా మరెందరో స్త్రీలు ముందుకు రావచ్చని చెప్పారు. ఈకార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు, వేట సభ్యులు, మహిళా సంఘాల నాయకులు, విద్యార్థినులు, ఉద్యోగస్తులు, వ్యాపారవేత్తలు తదితరులు పాల్గొన్నారు..

# మతోన్మాద ఫాసిస్ట్ విధానాలపై పోరాడాలి









- ప్రజా వ్యతిరేకతను ఎదుర్కొంటున్న ప్రభుత్వాలు
- జిల్లా విస్తృతస్థాయి సమావేశంలో సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు జి.నాగయ్య

నవతెలంగాణ-మరిపెడ

కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న మతోన్మాదం ఫాసిస్టు విధానాలపై పోరాడాలని, మూఢ విశ్వాసాలను ప్రజలకు నూరిపోస్తూ మతం మత్తులో దించుతున్న బిజెపి ఫాసిస్టు విధానాలను కమ్యూనిస్టులు తిప్పికట్టాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజావ్యతిరేకతను ఎదుర్కొంటున్నా ఇంకా ప్రజలను మభ్యపెడుతూ మోసగిస్తున్నారని సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు జి.నాగయ్య అన్నారు. మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండల కేంద్రంలో ఎస్ఆర్ కన్వెన్షన్ హాల్‌లో సీపీఐ(ఎం) జిల్లాస్థాయి విస్తృత సమావేశం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అలువాల వీరయ్య అధ్యక్షతన మంగళవారం జరిగింది. ఈ సమావేశానికి జిల్లా కార్యదర్శి సాధుల శ్రీనివాస్‌తో కలిసి జి.నాగయ్య ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలో దేశాన్ని పాలిస్తున్న బిజెపి ఆర్థిక విధానాలతో దేశం ఆర్థిక సంక్షోభంలో నెట్టివేయబడుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. 11 ఏళ్ల పాలనలో కేంద్ర ప్రభుత్వం నిరుద్యోగులకు ఒక్క ఉద్యోగం ఇచ్చిన దాఖలాలు లేవని ఆయన ఘాటుగా విమర్శించారు. 2026 లో డీలిమిటేషన్ చేపట్టి మళ్లీ దొడ్డిదారిన అధికారంలోకి రావాలని ఆర్ఎస్ఎస్ కనుసైగల్లో బిజెపి కుట్ర చేస్తుందన్నారు. దీంతో ఉత్తర భారత దేశంలో రాష్ట్రాలలో పార్లమెంటు స్థానాలను పెంచుకోవడానికి అవకాశం ఉందన్నారు. ఈడీలిమిటేషన్ వల్ల దక్షిణ భారతదేశానికి నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని దీంతో దేశ ప్రజలకు ఒరిగేదేమీ లేదన్నారు. దేశంలో ఆకలి దరిద్రం పేదరికాన్ని పెంచి పోషిస్తూ అనేక పేద కుటుంబాలు ఆర్థిక దోపిడీతో బలైపోతున్నారని వాపోయారు. హైదరాబాద్ నగరంలో అనేక ముస్లిం కుటుంబాలు అర్ధాఆకలితో అలమటిస్తున్న బిజెపి పార్లమెంటు సభ్యులు పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. మతోన్మాదన్ని మూఢ విశ్వాసాలను ప్రజలలోకి బలంగా తీసుకెళ్లి ప్రజల ఆలోచనలను బిజెపి దారిమళ్లిస్తున్నా కాంగ్రెస్ పార్టీ ఎదుర్కోలేక దిగజారి పోతుందని ఎద్దేవా చేశారు. దేశం మొత్తంలో మతోన్మాద ఫాసిస్టు విధానాలపై నికరంగా పోరాడుతున్నది కమ్యూనిస్టులు మాత్రమేనని ఆయన స్పష్టం చేశారు. ఆర్థిక విధానాలు బిజెపి, కాంగ్రెస్ ఒకే విధంగా ఉన్నాయన్నారు. ఆరు గ్యారంటీలు, 420 వాగ్దానాలు సంగతి ఏమిటనిరాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీశారు. బీఆర్ఎస్ పార్టీ మాజీ ముఖ్యమంత్రి ఫామ్‌హౌస్‌కే పరిమితం కాగా, అధికారంలో ఉన్నట్టుగానే కలగంటూ కాలం గడుపుతున్నారని ఆరోపించారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం నికరంగా ప్రజల పక్షాన నిలబడి కొట్లాడేది కమ్యూనిస్టులు మాత్రమేనని దీనిని గుర్తించనంత కాలం ప్రజలు పదేపదే మోసపోతారని ఆయన గుర్తు చేశారు. ప్రజలు సమస్యలతో సతమతం కాకుండా ప్రభుత్వాల విధానాలపై తిరుగుబాటుకు సిద్ధం కావాలని మీకు అండగా సీపీఐ(ఎం) ఉంటుందని పిలుపునిస్తూ భరోసా కల్పించారు.

**● రైతుల గోడు పట్టించుకోని ప్రభుత్వం..**

**-సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సాధుల శ్రీనివాస్**

రైతులు పండించిన పంటకు సరైన గిట్టుబాటు ధర ఇవ్వకుండా ప్రభుత్వాలు మేనమీసాలు లెక్కబెడుతున్నాయని, రైతుల గోస పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేయడం సరైంది కాదని సీపీఐ(ఎం) మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి సాధుల శ్రీనివాస్ అన్నారు. మరిపెడ మండల కేంద్రంలో సీపీఐ(ఎం) మండల కమిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో పాల్గొని సాధుల శ్రీనివాస్ మాట్లాడుతూ రైతు పండించిన మిర్చి ధరకు సరైన మద్దతు ధర ప్రకటించకుండా ప్రభుత్వం రైతులను మోసం చేస్తుందని ఆయన విమర్శించారు. గత సంవత్సరం కింటాకు రూ.25000 పలుకగా అదే ఆశతో రైతులు మిర్చిని సాగు చేసుకుంటే ప్రభుత్వాలు మద్దతు ధర ప్రకటించకుండా ఉన్న మిర్చి ధరలను తగ్గించి రైతులను నట్టేటా ముంచుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటకు గిట్టుబాటు ధర రాక రైతులు అప్పుల పాలవుతున్నా ఈ ప్రభుత్వాలకు చీటకుట్టినట్టు లేదని ఆయన విమర్శించారు. మిర్చి కింటాకు రూ.25 వేలు మద్దతు ధర ప్రకటించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. అంతేగాక భూగర్భ జలాలు అడుగంటిపోయి ఆకేరు, మున్నేరు పాలేరు వాగులలో సుక్క నీరు లేక రైతులు హరిగోసపడుతున్నారని, గత వర్షాకాలంలో చెరువులు, కుంటలకు గండ్లు పడి నీరంతా వెళ్ళిపోగా ప్రభుత్వం దానిని మరమ్మత్తులు చేపట్టకుండా నిర్లక్ష్యం చేయడంతో ఇవాళ సాగునీటి సమస్యనుఎదుర్కొంటున్నామని ఆయన విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఎస్సారెస్పీ జలాలను చివరి ఆయికట్టవరకు నీరు అందించి చెరువులు, కుంటలు నింపాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈకార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు, శెట్టి వెంకన్న, సూర్నపు సోమయ్య, గునుగంటి రాజన్న, అలువాల వీరయ్య ఆకుల రాజు, కందునూరి శ్రీనివాస్, కుంట ఉపేందర్, గాడిపెల్లి ప్రమీల, కందనూరి కవిత, మరిపెడ మండల కార్యదర్శి గుండగాని మధుసూదన్, కందాల రమేష్, కొండ ఉప్పులయ్య, బోడపట్ల రాజశేఖర్‌తో పాటు జిల్లా నుండి తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**● సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో భారీ ర్యాలీ**

భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు మరిపెడ మండల కమిటీ ఆధ్వర్యంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ భారీ ర్యాలీ నిర్వహించారు. మరిపెడ మండల కేంద్రంలోని మంగళవారం స్థానిక ఎస్ఆర్ కన్వెన్షన్ ఫంక్షన్ హాల్ నుండి రాజీవ్ గాంధీ సెంటర్, బస్టాండు, ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్ నుండి ఈర్యాలీ సాగింది. బయ్యారం ఉక్కు కర్మాగారాన్ని నిర్మించాలని, మిర్చి బోర్డు ఏర్పాటు చేయాలని, మరిపెడ మండలంలో వ్యవసాయ మార్కెట్ ఏర్పాటు చేయాలని, నినాదాలు చేశారు. ప్రదర్శనకు సీపీఐ(ఎం) జిల్లా నాయకత్వం, వివిధ మండలాల కమిటీ సభ్యులు, ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సావిత్రిబాయిపూలేను ఆదర్శంగా తీసుకొని ఉద్యమాలు చేయాలి



- ఐద్వా జిల్లా కార్యదర్శి గాడిపెల్లి ప్రమీల

నవతెలంగాణ-మహబూబాబాద్

సావిత్రిబాయి పూలేను ఆదర్శంగా తీసుకొని ఉద్యమాలు చేయాలని 5వ జిల్లా కార్యదర్శి గాడి పేళ్లి ప్రమీల అన్నారు మంగళవారం మానుకోటలోని 30వ వార్డులోని హనుమంతరావు నగర్ కాలనీలో సావిత్రిబాయి 128వ వర్ధంతి సభ ఐద్వా పట్టణ కార్యదర్శి చాగంటి భాగ్యమ్మ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు, ఈ సందర్భంగా కాలనీలో సభ నిర్వహించారు ఈ సభకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన మహిళా సంఘం జిల్లా కార్యదర్శి గాడి పెల్లి ప్రమీల మాట్లాడుతూ భారత దేశంలో మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలుగా, సంఘసంస్కర్తగా, అంటరానితనానికి వ్యతిరేకంగా, బాల్యవివాహాలకు వ్యతిరేకంగా, ఆడవాళ్లకు చదువు ఉంటే సమాజంలో హక్కులు సాధించవచ్చని గ్రహించి ఆడవాళ్లకు పాఠశాలలో నెలకొల్పారన్నారు. రాబోయే రోజుల్లో మహిళల హక్కుల కోసం సావిత్రిబాయి పూలే ను ఆదర్శంగా తీసుకొని ఉద్యమాలు చేయాలని కోరారు. ఈసమావేశంలో మహిళా సంఘం పట్టణ కమిటీ సభ్యురాలు వాంకుడోతు రమాదేవి, శేషం కలమ్మ, తిప్పర్తి మిన్నమ్మ, మాదాసు రమణ, గుర్రాల గట్టమ్మ, వడ్లకొండ రజిత, అంబాల రేణుక, వంకాయల పార్వతి, బత్తుల సుమలత, రావుల రాజమ్మ, కావడం జ్యోతి, బొల్లంపల్లి లక్ష్మి, టేకులపల్లి లక్ష్మి, కందుల మౌనిక, దానబోయిన వెంకటమ్మ, ఎస్‌కే. జహీదా బానమిన అన్నపూర్ణ, కమలమ్మ, తేలకలపల్లి లక్ష్మి, కావటం సంధ్య తదితరులు పాల్గొన్నారు.

# ఏజెన్సీలో ఎమ్మెల్యే సుడిగాలి పర్యటన





- తులారం ప్రాజెక్టు సందర్శన
- పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన
- దట్టమైన అడవిలో పర్యటన

నవతెలంగాణ-బయ్యారం:

మండల శివారు అటవీ ప్రాంత గ్రామాల్లో మంగళవారం ఇల్లందు నియోజకవర్గ ఎమ్మెల్యే కోరం కనకయ్య విస్తృతంగా పర్యటించారు. పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. కారాడవిలో ట్రాక్టర్‌పై సుమారు 8 కిలోమీటర్ల దూరం పర్యటి ంచారు. రైతులను కలిసి వారి సమస్యలను అడిగితెలుసుకున్నారు. అడవిలో ట్రాక్టర్‌పై కూర్చుని ప్రయాణం చేసి వెళ్లి తులరాం ప్రాజెక్ట్ అయకట్టు ప్రాంతాలను సందర్శించి పరిశీలించారు. తులరాం ప్రాజెక్ట్ కట్ట పెంచితే సుమారు 12 వందల ఎకరాలకు సాగు, తాగు నీరు అందుతుందని, చుట్టుపక్కల రైతులు, బయ్యారం సొసైటీ చైర్మన్ మూల మధుకర్ రెడ్డి ఎమ్మెల్యే కోరం కనకయ్యకు వివరించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే స్పందిస్తూ మీ సమస్యను పరిష్కరించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్ళి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే కోరం కనకయ్య మాట్లా డుతూ తులారం ప్రాజెక్టు ఆయకట్టు పెంచేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. గతంలో పలు మార్లు అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి రైతుల సాగు నీరు సమస్య తీసుకెళితే స్పందిం చలేదన్నారు. ప్రస్తుతం రేవంత్ సర్కార్ నియోజ కవర్గ అభివృద్ధికి కట్టుబడి ఉన్నారని తెలిపారు. పాకాల వాగు నుండి నీటిని తులారం ప్రాజెక్టు తీసుకవచ్చి బయ్యారం, మహబూబాబాద్ నియోజకవర్గ ప్రజల నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చేయనున్నట్లు తెలిపారు. ఏజెన్సీలో ఎమ్మెల్యే పర్యటన నేపథ్యంలో జిల్లా ఎస్పీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్ ఆదేశాల మేరకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకూండ భారీ బందోబస్త్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ మూల మధుకర్ రెడ్డి, రైతులు, కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## నల్గొండ జిల్లా కోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం..

- కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి దుడ్డేల రామ్మూర్తి

నవతెలంగాణ-మరిపెడ

2018 సంవత్సరంలో కోటి రూపాయలు సుపారీ ఇచ్చి మారుతిరావు అత్యంత కిరాతకంగా ప్రణయ్‌ను హత్యగావించాడు. పెరుమాళ్ళ ప్రణయ్ హత్య కేసులో నల్గొండ జిల్లా కోర్టు ఒకరికి ఉరిశిక్ష, మరో ఆరుగురికి జీవిత ఖైదు శిక్ష విధిస్తూ ఇచ్చిన తీర్పును కులవక్ష వ్యతిరేక పోరాట సంఘం స్వాగతించిందని ఈ తీర్పుతో కుల దురహంకారులకు కనువిప్పు కలగాలని న్యాయం గెలిచిందని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి దొడ్డెల రామ్మూర్తి అన్నారు. మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండల కేంద్రంలో కేవీపీఎస్ జిల్లా కమిటీ సమావేశం చీపిరి యాకయ్య అధ్యక్షతన మంగళవారం జరిగింది, ముఖ్యఅతిథిగా పాల్గొన్న దుడ్డెల రామ్మూర్తి మాట్లాడుతూ ప్రణయ్ హత్య కేసులో ఇచ్చిన తీర్పు సందర్భంగా నల్గొండ లో జరిగిన సంఘటనపై ఆయన స్పందించారు. ఈ సందర్భంగా రామ్మూర్తి మాట్లాడుతూ 2018లో వైశ్య కులానికి సంబంధించిన అమృతను కులాంతర వివాహం చేసుకున్నాడనే పేరిట పెరుమాళ్ళ ప్రణయ్ అనే దళిత యువకుడిని అత్యంత కిరాతకంగా కోటి రూపాయలు ఇచ్చి హత్యగావింపజేసిన మారుతి రావు 2020లో ఆత్మహత్య చేసుకున్నాడని, మిగిలిన ఏడుగురు నిందితులలో ఏ2 శర్మకు ఉరిశిక్షతోపాటు మరో ఆరుగురికి జీవిత ఖైదు విధించి ఇచ్చిన తీర్పును కేవీపీఎస్ సంపూర్ణంగా స్వాగతిస్తుందన్నారు. ఈ తీర్పు తర్వాత ప్రణయ్ కుటుంబానికి, అమృత బాలస్వామికి పూర్తిస్థాయి రక్షణ కల్పించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. ఈ పోరాటంలో న్యాయం వైపు బాధితుల తరపున నిలబడ్డ న్యాయవాదులకు పోలీసులకు, మీడియాకు, కేవీపీఎస్‌తో పాటు పోరాటంలో నిలబడ్డ సామాజిక సంఘాలకు కేవీపీఎస్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తుందన్నారు. ఈసమావేశంలోకేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు జిన్నా లచ్చన్న, నాయకులు చీపిరి యాకయ్య, నిడుగొండ చంటి, సిరిగిరి శ్యామసుందర్, శేషం ప్రశాంత్, సోమవారపు ఎల్లయ్య, పులివెంకటేశ్వర్లు, మందుల మహేందర్, గట్టిగా వెంకటరాములు, బాణాల ఎల్లయ్య, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.



## నాటికలు వాస్తవ జీవనాన్ని ప్రతిబింబిస్తాయి

- నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ అనుమాండ్ల ఝాన్సీరెడ్డి

నవతెలంగాణ-తొర్రూర్

నాటికలు వాస్తవ జీవన విధానాన్ని ప్రతిబింబింపచేస్తాయని పాలకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్ అనుమాండ్ల ఝాన్సీ రెడ్డి అన్నారు. డివిజన్ కేంద్రంలో చైతన్య కళా సమాఖ్య ఆధ్వర్యంలో 13వ జాతీయ తెలుగు ఆహ్వానిత నాటిక పోటీలు సోమవారం రాత్రి కళావేదికపై ఉమేన్స్ ఎంపవర్ మెంట్ తెలుగు అసోసియేషన్ చైర్మన్ హనుమాన్ల ఝాన్సీరెడ్డి, తొర్రూర్ పీఏసీఎస్ చైర్మన్ కాకిరాల హరిప్రసాద్, మాజీ జడ్పీటీసీ మంగళంపల్లి శ్రీనివాస్, మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ జినుగ సురేందర్‌రెడ్డి లతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేశారు.అనంతరం ఆమె మాట్లాడుతూ నాటికలు జీవన ప్రతిబింబాలని, నాటక కళను పరిరక్షణ చేస్తున్న సమాఖ్య సేవలు ప్రశంసనీయమన్నారు. ప్రస్తుతం మహిళలు టీవీలకు, సీరియల్లకు, యువత సెల్ ఫోన్‌లకు అంకితం అయ్యారని, సమయాన్ని వృధా చేయకుండా మారుతున్న మాధ్యమాలను మంచి కోసం వినియోగించు కోవాలని కోరారు. సంస్థ అభివృద్ధికి తన వంతుగా సహకరిస్తామని చెప్పారు. అనంతరం అతిథులు మాట్లాడుతూ ప్రస్తుతం నాటకం గురించి తెలుసుకోవాలంటే గూగుల్ లో, మాధ్యమాలలో తెలుసుకొనే పరిస్థితి నెలకొందని, భావి తరాలు కళల గురించి తెలుసు కోవాలంటే సమాఖ్య కృషి చేయాలన్నారు. సమాఖ్య అధ్యక్షులు మన్సూర్ ఉమా మాట్లాడుతూ నాటక పోటీలకు తమ కార్యక్రమాలకు ఆర్థికంగా సహకరిస్తున్న వారికి ధన్యవాదాలు తెలిపారు. ఈకార్యక్రమంలో చాంబర్ అఫ్ కామర్స్ అధ్యక్షులు మచ్చ సురేష్, ప్రధాన కార్యదర్శి సుంకరనేని పినాకపాణి, కోశాధికారి గడల శ్రీనివాస్, పట్నం శెట్టి శ్రీశైలం, బుధారపు శ్రీనివాస్, జనార్ధన్ రాజు, ఇమ్మడి రాంబాబు, బాతుక బుచ్చిరామయ్య కపాల్, పెరుమాళ్ళ రవి, లేగల వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రవేశాలకు దరఖాస్తు గడువు పొడగింపు

నవతెలంగాణ-తొర్రూర్‌రూరల్

తెలంగాణ ఆదర్శ పాఠశాల గుర్తూరులో 2025-26 విద్యా సంవత్సరానికి ఆరవ తరగతిలో 100 సీట్లకు 7, 8, 9, 10 తరగతిలో మిగిలినటువంటి సీట్లకు ఎంట్రన్స్ టెస్ట్ అడ్మిషన్ నోటిఫికేషన్ పొడిగించడం జరిగిందని జనరల్ విద్యార్థులు రూ.200 ఫీజు, ఎస్సీ, ఎస్టీ ,బీసీ , ఈబీసీ, పీహెచ్‌సీ కేటగిరి విద్యార్థులు రూ.125 చెల్లించాలని ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు తెలియజేశారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోగలరని చివరి తేదీ మార్చి 20అని, తదుపరి ఏప్రిల్ 20న పరీక్ష నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

## ఎంబీబీఎస్ విద్యార్థి విజయ్‌కి ఎన్‌ఎఫ్‌హెచ్‌సీ ఫౌండేషన్ ఆర్థిక సాయం

- రూ.15 వేలు ఆన్‌లైన్ చెల్లింపు

నవతెలంగాణ-కేసముద్రంరూరల్:



నిరుపేద గిరిజన ఎంబీబీఎస్ విద్యార్థి విజయ్‌కు ఎన్‌ఎఫ్‌హెచ్‌సీ (నేషన్స్ ఫస్ట్ హ్యూమన్ చైన్) ఫౌండేషన్ ఆర్థిక సహాయం అందించింది. ఎన్‌ఎఫ్‌హెచ్‌సి ఫౌండేషన్ దాత, తన తండ్రి జ్ఞాపకార్థం - మిషన్ విద్య విజ్ఞాన్ సేవలో భాగంగా రూ.15 వేల ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసినట్లు ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సైంటిస్ట్ మోహన్ తెలిపారు. మద్రితండా జీపీ పరిధిలోని గొప్య తండాకు చెందిన విజయ్ చిన్న వయస్సులోనే తన తండ్రిని కోల్పోయాడు. ఆ తర్వాత అన్న అనారోగ్యంతో మృతి చెందడంతో కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంది. కాలేజీ ఫీజు, హాస్టల్ ఖర్చులు భరించలేక చదువు మధ్యలోనే ఆగిపోయింది. అయితే, దాతల సహాయంతో విజయ్ ప్రస్తుతం మెడిసిటీ ఇనిస్టిట్యూట్‌ఆఫ్ మెడికల్ సైన్సెస్, ఘన్‌పూర్ లో ఎంబిబిఎస్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. విజయ్ ప్రతిభ గల విద్యార్థి కావడంతో అతడి విద్య ఆగకూడదనే లక్ష్యంతో ఫౌండేషన్ చేయూత అందించింది. ఎన్ని ఆటంకాలు వచ్చినా విద్యను కొనసాగిస్తూ మంచి భవిష్యత్ కోసం ముందుకు సాగాలని విజయ్‌కు ఫౌండేషన్ సభ్యులు సూచించారు. ఫౌండేషన్ గ్లోబల్ నెట్‌వర్క్ విజయ్‌కు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చింది. ఎన్‌ఎఫ్‌హెచ్‌సి ఫౌండేషన్ "జై విజ్ఞాన్ - జై భారత్" అనే నినాదంతో, మిషన్ విద్య విజ్ఞాన్ ప్రాజెక్ట్‌లో భాగంగా 2010 నుండి నిరంతరం విద్యార్థులకు చేయూత అందిస్తోంది. నాణ్యమైన విద్యను అందించేందుకు కట్టుబడి, గ్రామీణ వెనుకబడిన ప్రాంతాల విద్యార్థులకు అవకాశాలను అందిస్తూ, వారి భవిష్యత్తును నిర్మించేందుకు అంకితభావంతో పని చేస్తోంది.



## భారీగా గంజాయి పట్టివేత

నవతెలంగాణ-బయ్యారం:

మండలంలో సుమారు రూ.10 లక్షల విలువ గల 20 కిలోల గంజాయిను స్థానిక ఎస్సై కె. తిరుపతి పట్టుకున్నట్లు ఆయన తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో మంగళవారం ఎస్సై తిరుపతి తమ సిబ్బందితో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ఇద్దరు వ్యక్తులు లగేజ్ బ్యాగ్ తో అనుమానస్పదంగా కనిపించారని, దాంతో వారిని తనిఖీ చేయగా బ్యాగులో గంజాయి లభించిందని, ఆ బ్యాగును తనిఖీ చేసి చూడగా బ్రౌన్ కలర్ బ్యాగ్‌లో లో 10 బ్యాగుల గంజాయిను కలిగి ఉండడంతో బయ్యారం మెయిన్ సెంటర్ నందు తూకం వేయగా సుమారు 20 కిలోల ఎండు గంజాయి లభించిందని, వీటి విలువ సుమారు రూ.10 లక్షల వరకు ఉంటుందని ఆయన తెలిపారు. ఈగంజాయిని ఒడిశా రాష్ట్రం పత్రాపూర్ గ్రామానికి చెందిన సంతోష్ నాయక్, సిరిసింగి గ్రామానికి చెందిన అర్జున్ దాస్ అను ఇద్దరు రవాణా చేస్తున్నారని, వారిని అదుపులో తీసుకొని గంజాయిని సీజ్ చేసి పోలీస్ స్టేషన్ కు తరలించి గార్ల, బయ్యారం సీఐ బి.రవి కుమార్ ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈకార్యక్రమంలో సిబ్బంది పాపారావు, యాకూబ్, సురేష్, పాషా తదితరులు పాల్గొన్నారు.

## ఆలయ కమిటీకి పట్టాభి సీతారామచంద్రస్వామి చిత్రపటంతో కూడిన టీ షర్ట్స్ అందజేత

**నవతెలంగాణ-గణపురం**



మండల కేంద్రంలోని శ్రీ పట్టాభి సీతారామచంద్రస్వామి దేవాలయంలో మంగళవారం మండల కేంద్రానికి చెందిన ఫ్రొబెల్ మోడల్ హై స్కూల్ యాజమాన్యం శ్రీ పట్టాభి సీతారామచంద్ర స్వామి చిత్రపటాన్ని ముద్రించిన టీ షర్ట్‌లను ఆలయ కమిటీ చైర్మన్ తాళ్లపల్లి గోవర్ధన్‌గౌడ్, ఆలయ అర్చకులు ముసునూరి నరేష్‌కు అందజేశారు. యాజమాన్య బృందానికి ఆలయ కమిటీ సభ్యులు బండారు శంకర్, మూల శ్రీనివాస్‌గౌడ్, బూర రాజగోపాల్, మాదాసు అర్జున్, మాదాసు మొగిలి, పాండవుల భద్రయ్య, బటిక స్వామి, దెయ్యాల భద్రయ్య వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## గోదావరికరకట్ట ఎత్తు పెంచడంలో ప్రభుత్వం విఫలం

**నవతెలంగాణ-ఏటూరునాగారం ఐటీడీఏ**

గోదావరి కరకట్ట ఎత్తు పెంచడంలో ప్రభుత్వం విఫలమైందని బిజెపి గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు గండేపల్లి సత్యం అన్నారు.బిజెపి మండల పార్టీ అధ్యక్షుడు చక్రవర్తి ఆధ్వర్యంలో కార్యకర్తలు నాయకులు కలిసి మంగళవారం ఏటూరునాగారం నుండి రామన్నగూడెం వరకు ఉన్న గోదావరి కరకట్ట విధానాన్ని పరిశీలించారు. అనంతరం సత్యం మాట్లాడుతూ 20 సంవత్సరాల క్రితం గోదావరి జంపన్న వాగు వరదలకు వరద నీరు గ్రామంలోకి చేరడంతో ప్రజలు అనేక అవస్థలు పడ్డారన్నారన్నారు. అప్పటి ప్రభుత్వం ఏటూరు నాగారం నుండి రామన్నగూడెం వరకు కరకట్ట నిర్మాణం చేపట్టగా భారీ వర్షాలకు, కరకట్ట పక్కనే ఇసుక క్వారీలు ఏర్పాటుతో కరకట్ట అధ్వానంగా మారిందన్నారు. అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ 2022లో కరకట్టను పరిశీలించి ఎత్తు పెంచుతామన్నా ఆచరణ సాధ్యం కాలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కరకట్ట ఎత్తు పెంచడానికి 70 లక్షల రూపాయలు కేటాయించి తాత్కాలిక పనులు చేసి చేతులు దులుపుకున్నారన్నారు. మంత్రులు సంబంధిత అధికారులు స్పందించి కరకట్ట ఎత్తుపెంచాలన్నారు. నాయకులు కర్నే సంపత్, రాకేష్, రాజు, అటిక నాగేశ్వరరావు, అజిత్, తదితరులు పాల్గొన్నారు.

# షార్ట్ సర్క్యూట్‌తో రెండు ఇండ్లు దగ్ధం

**దాదాపు రూ.10 లక్షల నష్టం**

**కట్టుబట్టలతో రోడ్డున పడ్డ బాధిత కుటుంబం**

**ప్రభుత్వం ఆదుకోవాలి : గ్రామస్తులు**

**నవతెలంగాణ-మల్హర్‌రావు**





ప్రమాదవశాత్తు షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదానికి గురై ఇందారపు శోభారాణి-కుమార్ అనే కూలి దంపతులకు చెందిన పెంకుటిల్లు పూర్తిగా బుగ్గిపాలైంది. అలాగే ఇందారపు పద్మ-రవి దంపతుల పెంకుటిల్లు పాక్షికంగా కాలిపోయిన సంఘటన మండల కేంద్రమైన తాడిచెర్లలోని ఎస్సికాలనీలో మంగళవారం చోటుచేసుకుంది. బాధితులు, గ్రామస్తుల కథనం ప్రకారం షార్ట్ సర్క్యూట్‌తో ప్రమాదవశాత్తు మొదట కుమార్ ఇంటిలో నుంచి భారీగా పొగ చుట్టిముట్టి మంటలు చెలరేగాయి. దీంతో చుట్టుపక్కల వారు కేకలేస్తూ ఇంటి యజమానులతోపాటు, అగ్నిమాపక అధికారులకు సమాచారం ఇచ్చారు. బొగ్గు తవ్వకాలు చేపట్టిన ఏఎమ్మార్ అగ్నిమాపక యంత్రాంగం వచ్చేసరికి జరగాల్సిన నష్టం జరిగింది. అగ్ని ప్రమాదంలో 2 తులాల బంగారం, 40 తులాల వెండి, రూ.20వేలు నగదు, కులర్, టివి రెండు బిరువాలు, నిత్యావసర సరుకులు, తదితర మొత్తం దాదాపు రూ.10 లక్షల నష్టం జరిగినట్లు బాధితులు తెలిపారు. కట్టుబట్టలతో రోడ్డున పడ్డామని వాపోయారు. ఆర్థికంగా ప్రభుత్వం బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

### తహసీల్దార్ పరిశీలన...

షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదానికి గురైన సంఘటన స్థలాన్ని మండల తహసీల్దార్ రవికుమార్ తన సిబ్బందితో కలిసి అగ్నికి బుగ్గైన ఇండ్లను పరిశీలించారు. బాధితల నుంచి పూర్తి వివరాలను సేకరించారు. ప్రభుత్వం, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోయి న్యాయంజరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు.

# హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

**జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి నారాయణ బాబు**

**పోలీసు అధికారులను అభినందించిన జిల్లా ఎస్పి**

**నవతెలంగాణ-భూపాలపల్లి టౌన్**

హత్య కేసులో నిందితుడికి జయశంకర్ భూపాలపల్లి జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి పి నారాయణబాబు మంగళవారం జీవిత ఖైదుతో పాటు 20 వేల జరిమానా విధించారు. వివరాలలోకి వెళితే.... కాటారం మండలం గంగారం గ్రామంలో మారుపాక అశోక్, మారుపాక నాగరాజు అన్నదమ్ములకు వారి స్వగ్రామంలో ఇంటిస్థలం ఉంది. నిందితుడు, అతని అన్న మారుపాక నాగరాజు, అతని తల్లి మారుపాక శంకరమ్మ సమానంగా పంచుకున్నారు. ఆ స్థలంలో తన వాటాకు వచ్చిన స్థలంలో మారుపాక నాగరాజు చిన్న ఇల్లు నిర్మించుకున్నాడు. మారుపాక అశోక్ తాగుడుకు అలవాటుపడి ఆయన వాటాకు వచ్చిన భూమిని అమ్ముకొని ఖర్చు చేసుకున్నాడు. అప్పటి నుండి తన అన్న కట్టుకున్న ఇంటిలో వాటా వస్తుందని ఇబ్బందులకు గురిచేస్తూ చంపుతానని నాగరాజును బెదిరించాడు. దీంతో నాగరాజు గ్రామం నుండి కుటుంబంతో సహా వెళ్ళిపోయి వేరే గ్రామంలో బతుకుతున్నాడు. 2019 మే 10న ఎంపీటీసీ ఎలక్షన్‌లో ఓటు వేయడానికి తన ఊరు గంగారం రాగా ఇంటి స్థలం విషయంలో అశోక్ మళ్లి గొడవపడ్డాడు. ఖాళీ బీరు బాటిల్ పగులగొట్టి నాగరాజలు గొంతులో పొడవగా మృతిచెందాడు. మృతుడి భార్య మారుపాక సరిత కాటారం పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసింది. అశోక్‌పై అప్పటి కాటారం ఎస్ హెచ్‌ఓ హెడ్ కానిస్టేబుల్ మహేందర్ హత్య కేసు నమోదు చేశారు. నాటి కాటారం సీఐ శివప్రసాద్ నిందితున్ని అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించారు. శివప్రసాద్ బదిలీపై వెళ్లగా అనంతరం సీఐగా వచ్చిన హతీరామ్ దర్యాప్తు పూర్తి చేసి సాక్ష్యాదారాలతో కోర్టులో చార్జ్ షీట్ ఫైల్ చేశారు. కోర్టులో పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎదులాపురం శ్రీనివాస్ వాదనలు వినిపించగా కోర్ట్ లైజన్ ఆఫీసర్ ఏ ఎస్ఐ గాండ్ల వెంకన్న ఆధ్వర్యంలో కోర్టు కానిస్టేబుల్లు రమేష్, వినోద్ సాక్షులను ప్రవేశపెట్టగా నిందితుడిపై నేరం రుజువైంది. దీంతో భూపాలపల్లి జిల్లా ప్రధాన న్యాయమూర్తి నారాయణబాబు నిందితునికి జీవిత ఖైదు తోపాటు, రూ.10వేల జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు. నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన కాటారం డీఎస్పీ రాంమోహన్‌రెడ్డి, సీఐ నాగార్జునరావు, ఎస్సై అభినవ్, నాటి దర్యాప్తు అధికారులను జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే అభినందించారు.



## మహదేవపూర్‌లో గంజాయి పట్టివేత

**నవతెలంగాణ-మహదేవపూర్**

మహదేవపూర్ ప్రభుత్వ డిగ్రీ కాలేజి గ్రౌండ్ సమీపంలో నిషేధిత గంజాయిని సరఫరా చేస్తూ, తాగుతున్నారని నమ్మదగిన సమాచారం మేరకు మంగళవారం మహదేవపూర్ ఎస్ఐ కే పవన్‌కుమార్ తన సిబ్బందితో యుక్తంగా పెట్రోలింగ్ చేపట్టారు. అనుమానాస్పదంగా ఓ వ్యక్తి నెంబర్ ప్లేట్ లేని బైక్‌పై డిగ్రీ కాలేజి గ్రౌండ్‌కి వస్తుండగా ఎస్సై తనిఖీ చేశారు. బైక్ ట్యాంక్ కవర్ లోని ఓ సంచిలో ఎండు గంజాయి దొరికింది. విచారించగా మహదేవపూర్ గ్రామానికి చెందిన షేక్ లుక్మన్ మహారాష్ట్రకు చెందిన అహేరి తాలుక, ఆళ్లపల్లి గ్రామంలోని మామాజి వ్యక్తి వద్ద గంజాయి కనుగోలు చేసినట్లు చెప్పాడు. అతను కొంచెం తాగుతూ, మిగిలింది తెలిసిన వాళ్ళకు అమ్మేవాడని తెలిసింది. అతని వద్ద ఉన్న 625 గ్రాముల పట్టుకున్న గంజాయిని, బైక్‌ను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. ఎస్ఐ పవన్‌కుమార్ మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలైన గంజాయికి అలవాటు పడొద్దని, ఒకవేళ తాగినా, సరఫరా చేసినా కఠిన చర్యలు తప్పవని అన్నారు. యువత బాగా చదువుకొని మంచి ఉద్యోగాలు సాధించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సివిల్ పోలీసులు పాల్గొన్నారు.

## విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

**ఎస్ఎఫ్ఐ భూపాలపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి కుమ్మరి రాజు**

**నవతెలంగాణ-భూపాలపల్లి టౌన్**

ఫీజు రీయింబర్స్మెంట్,పెండింగ్ స్కాలర్‌షిప్స్ విడుదల చేసి నియోజకవర్గ వ్యాప్తంగా విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జయశంకర్ భూపాలపల్లి జిల్లా కార్యదర్శి కుమ్మరి రాజకుమార్ తెలిపారు. మంగళవారం ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంజు నగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ... సంక్షేమ వసతి గృహాలు, గురుకులాలకు, కేజీబీవీలకు సొంత భవనాలు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. పెంచిన మెస్ చార్జీలు అమలు కావడం లేదన్నారు. కొన్నేండ్లుగా మెస్ బిల్లులు పెండింగ్ ఉన్నాయని తెలిపారు. హాస్టల్ విద్యార్థులకు కాస్మోటిక్ చార్జీలు చెల్లించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్లో విద్యారంగానికి 30శాతం నిధులు కేటాయించాలని కోరారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మధ్యాహ్న భోజన చార్జీలు పెంచాలన్నారు. దుప్పట్లు యూనిఫార్మ్ ట్రంక్ పెట్టెలు, ప్లేట్లు గ్లాసులు అందించాలని కోరారు. జిల్లా కేంద్రంలో ప్రభుత్వ వృత్తి విద్య కోర్సు కళాశాల, బీఈడీ కళాశాలను ఏర్పాటు చేయాలన్నారు. ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పథకం తక్షణమే అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు సకినాల వికాస్ పాల్గొన్నారు.

## ఇంటి చుట్టూ విద్యుత్తు ఉచ్చు కలకలం !

**నవతెలంగాణ-మల్హర్‌రావు(కాటారం)**

ఇంటి చుట్టూ గుర్తు తెలియని దుండగులు విద్యుత్తు తీగ (ఉచ్చు) అమర్చడం గ్రామంలో కలకలం రేపింది. ఆ ఘటన కాటారం మండలంలోని జాదరావుపేట గ్రామ పంచాయతీ పరిధిలో చోటు చేసుకుంది. గ్రామస్థుల కథనం ప్రకారం.. గ్రామంలో చర్చి దగ్గర రహదారి పక్కన ఉన్న 11కేవీ విద్యుత్తు లైన్ కు ఇనుపతీగ తగిలించిన దుండగులు ఆ ఇనుప తీగను సమీపంలోని సదాశివ్ అనే వ్యక్తి ఇంటి చుట్టూ ఉచ్చు మాదిరిగా చుట్టారు. సోమవారం తెల్లవారుజామున సదాశివ్ భార్య బయటకు వెళ్లేందుకు తలుపులు తీయగా ఇనుప తీగ తగలడంతో కేకలు వేసింది. గమనించిన గ్రామస్థులు తీగను తొలగించి సదాశివ్ కుటుంబ సభ్యులను అప్రమత్తం చేశారు. విద్యుత్తు సరఫరా లేక పోవడంతో పెను ప్రమాదం తప్పింది. పోలీసులకు సమాచారం అందించగా ఎస్సై2 శ్రీనివాస్ సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## 'కుట్టు మిషన్లు మంజూరు చేయాలి'

**నవతెలంగాణ-మహదేవపూర్**

మహదేవ్ పూర్ మండలంలో మహిళలకు కుట్టమిషన్లు అందని ద్రాక్ష లాగే అనిపిస్తుందని మహదేవ్ పూర్ మ మహదేవపూర్ మండల టీం హెచ్ పి ఎస్ అధ్యక్షులు ముజహిద్ ఖాన్ మంగళవారం మహదేవపూర్ మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన సమావేశంలో పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ ను కలిసినప్పుడు ఎన్నికల కోడ్ ఉన్నందున మంజూరు చేయలేమని చెప్పడం జరిగిందని ఎన్నికల కోడ్ ముగిసిందని వెంటనే జిల్లా కలెక్టర్ కుట్టు మిషన్ మంజూరు చేయాలని ఆయన కలెక్టర్ ను కోరారు ఇప్పటి కైన మహిళలకు ఇచ్చే కుట్టుమిషిన్లు అందించి వారి కి జీవనాధారం కల్పించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు యండి అమీన్ మండల అధ్యక్షులు ముజాహిద్ ఖాన్. మండల ఉపాధ్యక్షులు అహ్మద్ ఖాన్. మండల కార్యదర్శి కోషాదికారి ఖమర్ పాషా ఉన్నారు.

## గుండెపోటుతో యువకుడు మృతి

**నవతెలంగాణ-టేకుమట్ల**

జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం అంకుషాపూర్ గ్రామానికి చెందిన పండుగ అనిల్ అనే యువరైతు( 35) మంగళవారం గుండెపోటుతో మ తి చెందడం పట్ల కాంగ్రెస్ వీరాభిమాని కావడంతో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అక్కడకు చేరుకొని సంతాపం తెలిపి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. బాధి కుటుంబానికి కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పారు. అనంతరం కాంగ్రెస్ శ్రేణులు కార్యకర్తలు ఎమ్మెల్యేతో కలిసి పాడే మోశారు.

# కిషన్‌రావుపల్లి-భూపాలపల్లి రోడ్డుకు రూ.33 కోట్లు



రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

**నవతెలంగాణ-మల్హర్‌రావు**

పెద్దపల్లి జిల్లా ఖమ్మంపల్లి నుంచి తాడిచెర్ల మీదుగా కిషన్‌రావుపల్లి ఫారెస్ట్ నుంచి భూపాలపల్లి జిల్లా కేంద్రం వరకు డబుల్ రోడ్డుకు రూ.33 కోట్ల 70లక్షలు మంజూరైనట్లు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఖమ్మంపల్లి నుండి జయశంకర్ భూపాలపల్లి జిల్లా వరకు గతంలో రోడ్డుకు నిధులు మంజూరు కాగా ఫారెస్ట్ క్లియరెన్స్ కు డబ్బులు లేక ఆగిపోయిందన్నారు. ప్రభుత్వం నుండి ప్రత్యేకంగా భూపాలపల్లి వరకు రోడ్డు కోసం ఫారెస్ట్ క్లియరెన్స్ నిధుల కోసం జీవో 113 ద్వారా రూ.33కోట్ల70 లక్షలు మంజూరు చేయించ్చినట్లు తెలిపారు. ఖమ్మంపల్లి నుండి భూపాలపల్లి వరకు వయా తాడిచర్ల మీదుగా రోడ్డు (భూపాలపల్లి జిల్లాకు తాడిచెర్ల నుండి 42 కిలోమీటర్లు దూరాన్ని ఈ రోడ్డు ద్వారా దాదాపు 18 కిలోమీటర్లు లేదా 20 కిలోమీటర్ల లోపే చేరుకోవచ్చన్నారు. రోడ్డును మంజూరు చేసిన మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబుకు మండలంలోని తాడిచెర్లతో పాటు అన్ని గ్రామాల ప్రజలు నాయకులు కృతజ్ఞతలు తెలియజేశారు.

### మంత్రి శ్రీధర్‌బాబు చిత్రపటానికి పాలాభిషేకం



పెద్దపల్లి జిల్లా ఖమ్మంపల్లి నుంచి తాడిచెర్ల మీదుగా కిషన్ రావుపల్లి ఫారెస్ట్ నుంచి భూపాలపల్లి జిల్లా కేంద్రం వరకు డబుల్ రోడ్డుకు రూ.33కోట్ల70లక్షలు మంజూరైనందుకు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు పలువురు కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం పెద్దతూండ్ల గ్రామంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బడితేల రాజయ్య ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. పిఎసిఎస్ చైర్మన్ ఇప్ప మొండయ్య, కాంగ్రెస్ పార్టీ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు దండు రమేష్, మాజీ ఎంపీపీ చింతలపల్లి మలహల్‌రావు హాజరై మాట్లాడారు. 2016లో ఫారెస్ట్ క్లియరెన్స్ వచ్చినప్పటికీ గత బీఆర్ఎస్ ప్రభుత్వం కనీసం రూ.4.70 కోట్లు చెల్లింపు, అటవీశాఖ భూమి కేటాయింపులో పూర్తిగా విఫలమైందన్నారు. ఈ రోడ్డు చేస్తే వాణిజ్య పరంగా కాటారం దెబ్బతింటుందని దుద్దిళ్ల కుటుంబంపై విషం చిమ్మారన్నారు. రోడ్డుపై ఎన్నికల్లో ఇచ్చిన మాటకు కట్టుబడి దుద్దిళ్ల కుటుంబం జీవో 113 ఇప్పించడం ప్రతిపక్షాలకు చెంపపెట్టన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జక్కుల వెంకటస్వామి యాదవ్, అజ్మీరా రాజునాయక్, మండల రాహుల్, మంత్రి రాజా సమ్మయ్య, అడ్వాల మహేష్, కిషన్‌నాయక్,రాజు నాయక్, విష్ణువర్ధన్ రెడ్డి, గట్టయ్య, పోలం శ్రీనివాస్, పల్లెర్ల మధు, రపల్లి కుమార్ పాల్గొన్నారు.

### మంత్రికి కృతజ్ఞతలు : మాజీ ఎంపీపీ

పెద్దపల్లి జిల్లా ఖమ్మంపల్లి నుంచి తాడిచెర్ల మీదుగా కిషన్‌రావుపల్లి ఫారెస్ట్ నుంచి భూపాలపల్లి జిల్లా కేంద్రం వరకు డబుల్ రోడ్డుకు రూ.33 కోట్ల 70 లక్షలు మంజూరు చేసిన మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుకు మాజీ ఎంపీపీ చింతలపల్లి మలహల్ రావు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గడ్డం క్రాంతి, కాంగ్రెస్ నాయకులు మెరుగు రాజయ్య, బొబ్బిలి రాజుగౌడ్, వేంకటేశ్వర రావు, ఇందారపు ప్రభాకర్, మల్కా మధుసూదన్ రావు,మురళి రావు పాల్గొన్నారు.

# ముగ్గురు మావోయిస్టుల లొంగుబాటు

**ఏఎస్పీ శివం ఉపాధ్యాయ**

**నవతెలంగాణ-ఏటూరునాగారం ఐటీడీఏ**



సీపీఐ మావోయిస్టు పార్టీ నుండి నుంచి ముగ్గురు మావోయిస్టులు ఏటూరునాగారం ఏఎస్‌పి కార్యాలయంలో లొంగిపోయారు. లొంగిపోయిన మావోయిస్టులను మంగళవారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ వారి అరెస్టు చూపించి వివరాలు వెల్లడించారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం ఊసూరు ప్రాంతానికి చెందిన మావోయిస్టు పార్టీకి చెందిన చర్ల, శబరి ఎల్ఓఎస్ పార్టీ సభ్యుడు కడితి ఇడుమ అలియాస్ దేవ, ఆర్‌పీసీ కమాండర్ మిడియం దేవయ్య వెంకటాపురం మండలం చర్ల శబరి ఎల్ఓసీ సభ్యుడు, సీఎన్ఎం సభ్యుడు సోడి జోగ అలియాస్ పున్నం లొంగిపోయినట్లు ఏఎస్పీ తెలిపారు. మావోయిస్టు సిద్ధాంతాలతో విసిగిపోయి జనజీవన స్రవంతిలో కలిసినట్లు తెలిపారు. వారికి సరెండర్, రిహబిలిటేషన్ పాలసీలో భాగంగా వారికి అందాల్సిన ఫలాలను అందజేస్తామన్నారు. సోడి జోగ అనే వ్యక్తి 2018లో మావోయిస్టు పార్టీలో చేరాడన్నారు. ఆ తర్వాత పలు కారణాలతో బయటకు వచ్చి సీఎన్ఎం సభ్యుడిగా చేరి ప్రస్తుతం పార్టీలో కొనసాగుతున్నాడన్నారు. అలాగే కడితి ఇడుమ ఇతను దర్మారం సీఆర్‌పీఎఫ్ క్యాంప్‌పై అటాక్ చేసిన ఘటనలో ఉన్నాడన్నారు. మిడియం దేవయ్య పార్టీలో పనిచేస్తూ కర్రెగుట్ట ఏరియాలో చాలా చోట్ల ల్యాండ్ మైండ్లు అమర్చిన ఘటనల్లో ఉన్నాడన్నారు. పోలీసులు నిర్బంధం, మావోయిస్టుల సిద్ధాంతాలు నచ్చక పార్టీని వీడినట్లు ఏఎస్పీ తెలిపారు. లొంగిపోయేందుకు సహకరించిన వెంకటాపురం పోలీసులను ఏఎస్పీ అభినందించారు. ఈ కార్యక్రమంలో వెంకటాపురం సీఐ బండారు కమార్, సీఆర్‌పీఎఫ్ కమాండెంట్ ప్రశాంత్, ఎస్సై తిరుపతి పాల్గొన్నారు.

# అనేక కార్మిక సమస్యలపై స్ట్రక్చర్ మీటింగ్‌లో చర్చించాం

**అతి త్వరలో అవన్నీ పరిష్కారం అవుతాయి**

**ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్**

**కేటికే-6 ఇంక్లైన్‌లో గేట్ మీటింగ్**

**నవతెలంగాణ -కోల్ బెల్ట్ :**



సింగరేణి సీఎండితో జరిగిన స్ట్రక్చర్ మీటింగ్‌లో అనేక కార్మిక సమస్యలు చర్చించడం జరిగిందని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ అన్నారు. భూపాలపల్లి ఏరియాలోని కేటికె-6 గనిలో పిట్ కార్యదర్శి శ్రీనివాస్ అధ్యక్షతన మంగళవారం జరిగిన గేట్ మీటింగ్‌కు ముఖ్యఅతిథిగా ఆయన హాజరై ప్రసంగించారు. సింగరేణి లో నూతన గనులు, పెర్క్స్‌పై టాక్స్ మాఫీ, కార్మికుడి సొంతింటి కల, డిస్మిస్ కార్మికుల విధుల్లోకి తీసుకోవాలని, అనేక అంశాలపై చర్చ జరిగిందన్నారు. ఈ అంశాలన్నీ త్వరలోనే పరిష్కారం కాబోతున్నాయని వివరించారు. పెర్క్స్‌పై ఇన్కమ్ టాక్స్‌కు సంబంధించిన అంశంపై ఇంతకుముందే యాజమాన్యానికి వివరించామన్నారు. మారుపేర్లకు సంబంధించిన వన్ టైం సెటిల్మెంట్ విషయంపై సమగ్ర చర్చ జరిగిందన్నారు. సింగరేణిలో నూతన గనులు రాకుంటే భవిష్యత్ ప్రశ్నార్థకమేనని, కొత్త గనులకు సంబంధించిన విషయాలను సీఎండీ దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. సొంత ఇంటి పథకం త్వరలోనే నెరవేరుస్తామని యాజమాన్యం హామీ ఇచ్చిందన్నారు. కార్పొరేట్ హాస్పిటల్స్ సింగరేణి సంస్థ నిర్వహించాలని, డిస్మిస్ కార్మికులను మళ్లీ విధుల్లోకి తీసుకోవాలని కోరడం జరిగిందన్నారు. 14 డిమాండ్లను సిఎండి ముందుంచి పరిష్కరించాలని కోరగా యాజమాన్యం సానుకూలంగా స్పందించిందని అన్నారు. గత పది సంవత్సరాలలో టీబీజీకేఎస్ గత గుర్తింపు సంఘం పైరవీలకే పరిమితమైందని ఆరోపించారు. కార్మిక సమస్యలను పట్టించుకున్న పాపాన పోలేదని విమర్శించారు.ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ శ్రీనివాస్, బ్రాంచ్ కమిటీ సభ్యులు మనోజ్ కుమార్, సత్యనారాయణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ సప్ప క ష?మూర్తి, వర్క్ మెన్ ఇన్స్పెక్టర్ రాజన్న, అడిషనల్ సెక్రటరీ గోవర్ధన్, మైనింగ్ స్టాఫ్ ఇంచార్జ్ లక్ష్మణ మూర్తి, అసిస్టెంట్ ఫిట్ సెక్రటరీలు గణేష్, సత్యానారాయణ, బ్రహ్మాచారి తదితరులు పాల్గొన్నారు.

## సమాజానికి మార్గదర్శకంగా ఉండాలి

**నవతెలంగాణ-ఏటూరునాగారం ఐటీడీఏ**



విద్యార్థులు సమాజానికి ఆదర్శంగా నిలవాలని జడ్‌పిహెచ్ఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సాంబశివరావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని జడ్‌పిహెచ్ఎస్‌లో ఏక్ భారత్ శ్రేష్ భారత్‌లో భాగంగా హర్యాన ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు ఇంటి దగ్గర హర్యాన వంటలను తయారు చేసి ప్రదర్శించారు. ఉపాధ్యాయులు వాటిని రుచి చూసి విద్యార్థులకు కితాబు ఇచ్చారు. అనంతరం పాటలు, క్విజ్, నృత్యాలు తదితర కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం హెచ్ఎం మాట్లాడుతూ విద్యార్థుల్లో సప్తకలలు ఉండాలన్నారు. చదువు, క్రీడలు, నత్యం తదితర అంశాలపై విద్యార్థులు దష్టి సారించాలన్నారు. రాజకీయ, సామాజిక, కుటుంబ స్తితి గతులు, సమాజంలో జరుగుతున్న మార్పులను అవపోషణ చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సూర్య, సుమన్, శ్రావణ్, శ్రావణ్, రవళిక, మాధవి, లక్ష్మణ్ పాల్గొన్నారు.

## సమ్మక్క - సారలమ్మ గిరిజన యూనివర్సిటీ వీసీగా ప్రొఫెసర్ యెడవల్లి లక్ష్మీ శ్రీనివాస్

**నవతెలంగాణ - ములుగు**



ములుగు జిల్లా సమక్క- సారలమ్మ గిరిజన యూనివర్సిటీకి మొదటి వైస్ ఛాన్సలర్‌ను భారత ప్రభుత్వం, కేంద్ర విద్యా శాఖ మంగంవారం నియమించింది. హైదరాబాదులోని ఆరోరా హయ్యర్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ అకాడమీకి చెందిన ప్రొఫెసర్ యెడవల్లి లక్ష్మీ శ్రీనివాస్ ను కేంద్ర విద్యా శాఖ నియమిం చినట్లు ఉత్తర్వులు జారీ చేసింది. ఈమేరకు ఆయన బాధ్యతలు చేపట్టనున్నారు.

## ధళితబంధు నిధులు విడుదల చేయాలి

**మంత్రి శ్రీధర్ బాబుకు వినతి**

**నవతెలంగాణ-మల్హర్‌రావు**

కాటారం సబ్ డివిజన్ పరిధిలో ఉన్న మండలాల ధళితబంధు లబ్ధిదారుల నిధులు విడుదల గురించి ప్రత్యేక చొరవ చూపాలని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబుకు మంగళవారం దళిత బంధు సాధన సమితి సభ్యులు వినతిపత్రాన్ని అందజేశారు. ఇందుకు సానుకూలంగా స్పందించ్చినట్లుగా తెలిపారు. ఈ కార్యక్రమంలో ధళిత బందు లబ్ధిదారులు నౌళ్ళ సంపత్ మహరాజ్, వేమూనూరి జక్కయ్య, చకినారపు చందు, పాగే సంతోష్, పేట దేవేందర్, గడ్డం సమ్మయ్య పాల్గొన్నారు.

## చల్ల తిరుపతిరెడ్డి పరామర్శ

**నవతెలంగాణ-మహదేవపూర్**

మహదేవపూర్ మండల కేంద్రంలోని కలికోట సత్యనారాయణ ఇటీవల మరణించారు. మంగళవారం బాధిత కుటుంబాన్ని మహదేవపూర్ పిఏసిఎస్ మాజీ చైర్మన్ చల్ల తిరుపతి రెడ్డి పరామర్శించారు.సీనియర్ నాయకులు ఎనమంద్ర వామన్‌రావు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి

**ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు వావిలాల స్వామి**

**నవతెలంగాణ-ఏటూరునాగారం ఐటీడీఏ**

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించిన తర్వాతనే ఉద్యోగాలను భర్తీ చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు వావిలాల స్వామి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ అనుభంద సంఘాల ఆధ్వర్యంలో నిరసన దీక్ష కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమానికి స్వామి హాజరై మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణను నేడు ప్రారంభమయ్యే అసెంబ్లీ సమావేశాలలో చట్టబద్ధత చేయాలన్నారు. గ్రూప్ వన్ ఉద్యోగాలను ప్రభుత్వం వెంటనే నిలిపివేయాలన్నారు. ఎస్సీ వర్గీకరణ చేపట్టిన తర్వాతనే పోటీ పరీక్షలు, ఉద్యోగాలు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. గతంలో మాట ఇచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి మాటకు కట్టుబడి లేడన్నారు. క్యాబినెట్ తీర్మానం మేరకు మార్చి 12 వరకు అసెంబ్లీలో వర్గీకరణ చట్టం చేస్తామని ప్రకటించిన ప్రభుత్వం, దానిని పెడచెవిన పెట్టి గ్రూప్ 1, గ్రూప్ 2, గ్రూప్ 3, ఎక్స్టెన్షన్ ఆఫీసర్స్ తదితర పోటీ పరీక్షలకు సంబంధించిన ఫలితాలను విడుదల చేస్తామని ప్రకటన చేయడం తగదన్నారు. ఈ కార్యక్రమంలో వావిలాల సాంబశివరావు, ఎంపెల్లి శంకర్, దేపాక సతీష్, గుగ్గిళ్ల సురేష్, ఎంపెల్లి సునీల్, పరికి వేణు, పరికి నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రారంభమైన ఎమ్మార్పీఎస్ రిలే నిరాహార దీక్షలు

**నవతెలంగాణ-మహదేవపూర్**

మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు బెల్లంపల్లి సురేష్ మాదిగ ఆధ్వర్యంలో మంగళవారం రిలే నిరసన దీక్షలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా సురేష్ మాదిగ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మాదిగల పట్ల చూపుతున్న వివక్షను మార్చుకోవాలని అన్నారు. ఇచ్చిన మాట ప్రకారం వర్గీకరణ బిల్లును ఆమోదింప జేసిన తర్వాతేనే నియామకాలు చేపట్టాలని కోరారు. లేదంటే పోరు తప్పదని హెచ్చరించారు. ఎమ్మార్పీఎస్ నాయకులు కొలుగూరి రాజయ్య బెల్లంపల్లి మల్లేష్, చింతకుంట్ల సదానందం, లింగాల సుశాంత్, బెల్లంపల్లి జాషువా, లింగాల సాగర్, తదితరులు పాల్గొన్నారు.

## పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి

**నవతెలంగాణ-మహదేవపూర్**

ఉపాధ్యాయ ఉద్యోగులకు రావాల్సిన ఐదు డిఏలతో పాటు పిఆర్సి నివేదికను తెప్పించుకొని వెంటనే అమలు చేయాలని, సీపీఎస్‌ను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ తిరుపతి కోరారు. మంగళవారం మహదేవపూర్ మండల కేంద్రంలో డిడిఎఫ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యారంగ సమస్యల పరిష్కారానికి 20శాతం నిధులు కేటాయించాలన్నారు. మోడల్ స్కూల్స్ ఉపాధ్యాయులకు జీరో వన్ జీరో పద్దు కింద వారికి వేతనాలు విడుదల చేయాలని అన్నారు. అవర్ లీ బేస్డ్‌గా పనిచేస్తున్న ఉపాధ్యాయులకు వేతనాలు రాక మూడు నెలలు అవుతుందని, వేతనాలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శి, మహదేవపూర్, పలిమెల మండలాల జోన్ బాధితులు బి తిరుపతిరెడ్డి మాట్లాడుతూ డీఎస్సీ 2024 ద్వారా నియామకమైన ఉపాధ్యాయులకు నియామకపు తేదీని 16 కాకుండా పదవ తేదీనే అమలు చేయాలని డిమాండ్ చేశారు . రాష్ట్ర కౌన్సిలర్ బి లక్ష్మణ్ నాయక్ మాట్లాడుతూ రానున్న పదవ తరగతి సంవత్సరిక పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు సౌకర్యాలు కల్పించాలన్నారు. ఈఅనంతరం మహదేవపూర్ మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఎన్నికల పరిశీలకులు లక్ష్మణ్ నాయక్, ఎన్నికల అధికారి బి తిరుపతిరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నిక చేశారు.మండల అధ్యక్షులు మడక మధు అధ్యక్షత వహించగా ప్రధాన కార్యదర్శి కె సారంగపాణి కార్యదర్శి నివేదికను ప్రవేశపెట్టారు. మండల శాఖ కొత్త అధ్యక్షుడిగా మడక మధు, మండల ప్రధాన కార్యదర్శిగా కొత్తపల్లి సారంగపాణి, ఉపాధ్యక్షులుగా ఆర్ తిరుపతి,జె రజిత, శ్రీకాంత్, శ్రీధర్, కార్యదర్శులుగా జి సాయికుమార్, సంతోష్ కుమార్,శ్రావణ్ కుమార్, సాంబయ్య, ఎస్ సాయికృష్ణ, జిల్లా కౌన్సిలర్‌గా బి తిరుపతిరెడ్డి,ఏ దేవేంద్ర, వీరేశం, ప్రభాకర్ రెడ్డి, సిహెచ్ మొండయ్య, బిక్షపతి ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా ఎం ఎర్రయ్యతోపాటు సభ్యులను ఎన్నుకున్నారు. జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు బి ప్రభాకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
హనుమకొండ
బుధవారం | మార్చి 12, 2025 | www.navatelangana.com

## సిస్టర్ జెన్నీఫర్ థెరిస్సాకు ఇగ్నో బంగారు పతకం

**నవతెలంగాణ-వర్ధన్నపేట**



నల్గొండ కాకతీయ డిగ్రీ, పీజీ కళాశాల ఇగ్నో దూర విద్యాకేంద్రం విద్యార్థిని జెన్నిఫర్ థెరిస్సా ఎంఎస్ డబ్ల్యూ విభాగంలో ఉత్తమ విద్యార్థిగా ఎంపికై ఇగ్నో జాతీయ స్థాయిలో బంగారు పతకం సాధించారు. హైదరాబాద్లో ఇటీవల నిర్వహించిన ఇగ్నో 37వ స్నాతకోత్సవంలో ఇగ్నో వీసీ ప్రొఫెసర్ ఉమకంజిలాల్, రీజినల్ డైరెక్టర్ రమేశ్ చేతుల మీదుగా పతకం అందుకున్నారు. ఎంఎస్‌డబ్ల్యూ కోర్సులో ఉత్తమమార్కులు సాధించి అగ్రస్థానంలో నిలవడంతో జెన్నీఫర్‌కు జాతీయస్థాయి గోల్డ్ మెడలను ప్రదానం చేశారు. ఇగ్నో నుంచి బంగారుపతకం సాధించిన జెన్నిఫర్ థెరిస్సాను ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సిస్టర్ డేసీ, కరస్పాండెంట్ సిస్టర్ మేరి ఆంటోనిలు అభినందించారు.

## ఎస్సీ వర్గీకరణకు చట్ట భద్రత కల్పించి మాదిగలకు న్యాయం చేయాలి

- కేయూ ప్రొఫెసర్ గాదె సమ్మయ్య

**నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా**



ఎస్సీల వర్గీకరణకు చట్ట భద్రత కల్పించి మాదిగ విద్యార్థులకు న్యాయం చేయాలని మంగళవారం కాకతీయ యూనివర్సిటీ దూర విద్యకేంద్రం వద్ద రిలే నిరవధిక దీక్ష చేయడం జరిగింది..ఎస్సీల వర్గీకరణకు చట్టబద్ధత కల్పించకుండా గ్రూప్-1, 2, 3 హెచ్‌డబ్ల్యూఓ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ జాబ్స్‌ఫలితాల విడుదల చేస్తామని టిజిఎస్‌పిఎస్‌సి ప్రకటించడాన్ని నిరసిస్తూ ఎంఎస్ఎఫ్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొచ్చు తిరుపతి మాదిగ కేయూ అధ్యక్షులు కుమ్మరి శ్రీనాథ్ మాదిగ ఆధ్వర్యలో రిలే నిరవధిక దీక్షలు చేయడం జరిగింది.. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రొఫెసర్ గాదె సమ్మయ్య డాక్టర్ ఎల్పీ రాజకుమార్ డాక్టర్ పోడేటి శ్రీనివాస్ హాజరై ప్రారంభించి అనంతరం వారు మాట్లాడుతూ ఎస్సీల వర్గీకరణ పైన ప్రభుత్వం నియమించిన జస్టిస్ షమిమ్ అక్తర్ నివేదిక ఆధారంగా వర్గీకరణకు చట్టబద్ధత కల్పించకుండా ప్రభుత్వ ఉద్యోగ నియామకాలు చేస్తూ మాదిగలను రేవంత్ రెడ్డి ప్రభుత్వం మోసం చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆగస్టు 1 సుప్రీంకోర్టు ఎస్సీల వర్గీకరణకు అనుకూలంగా తీర్పు వచ్చిన రోజు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీ సాక్షిగా వర్గీకరణ చేస్తామని అవసరమైతే ఇది వరకు ఇచ్చిన నియామకాల ఫలితాల్లో వర్గీకరణ అమలు చేస్తామని ప్రత్యేకమైన ఆర్డినెన్సు తీసుకు వచ్చి మాదిగలకు న్యాయం చేస్తానని చెప్పి ఇప్పుడు వర్గీకరణ అమలు చేయకుండా గ్రూప్ 1, 2, 3 ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ జాబ్స్ ఫలితాల విడుదల చేయడం మాదిగ విద్యార్థులను మోసం చెయ్యటమేనని తెలిపారు. ఉద్యోగ నియమాకాలు వర్గీకరణ అమలు చేశాకే చేపట్టాలని ముఖ్యమంత్రి మాట నిలబెట్టుకోవాలని కోరారు. వర్గీకరణ చేయకుండా నియామకాలు ప్రభుత్వం చేపడుతుంటే దానిని వ్యతిరేకించి మాదిగలకు అండగా ఉంటామని ఎమ్మార్పీఎస్ చేసే ప్రతి పోరాటంలో మద్దతుగా నిలబడతామని తెలిపారు.అనంతరం

ఈ దీక్షను విరమింపజేసిన ప్రొఫెసర్ పెద్ద మల్ల శ్రీనివాస్ మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ సుదీర్ఘ 30 సంవత్సరాల నుండి అలుపెరుగని పోరాటం చేస్తున్నారు కాబట్టి ఎస్సీ ఎబిసిడి వర్గీకరణ న్యాయమైన పోరాటం కాబట్టి తక్షణమే అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఆకుతోట శ్రీనివాస్ లు బీసీ సెల్ డైరెక్టర్, రాష్ట్ర నాయకులు డాక్టర్ పాలమాకుల కొమరయ్య,డాక్టర్ ఆరూరి రంజిత్, బైరపాక ప్రశాంత్ జిల్లా ఇన్చార్జ్ అరగంటి గౌడ్ బీసీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు, కేయూ ఇన్చార్జి డాక్టర్ వడ్డేపల్లి మధుకర్ మాదిగ, దివ్యాంగుల కేయూ ఇంచార్జ్ బోస్కా నాగరాజు, కేయూ నాయకులు అడ్డూర్ గణేష్, రాణా ప్రతాప్, ప్రసన్నకుమార్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

### కొనసాగుతున్న ఎమ్మార్పీఎస్ రిలే దీక్షలు

పరకాల : పరకాల పట్టణ కేంద్రంలో ఎమ్మార్పీఎస్ రిలే దీక్షలు 2 రోజు కొనసాగుతున్నాయి.ఎస్సీ వర్గీకరణ ప్రకారంగా మాదిగలకు 11 శాతం కేటాయించి చట్టబద్ధుడు కల్పించాలనే డిమాండ్ తో సాగుతున్న ఈ రిలే దీక్షలను ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి ఏకు శంకర్ మాదిగ ప్రారంభించారు.ఈ దీక్ష శిబిరంలో ఎమ్మార్పీఎస్ మండల ప్రధాన కార్యదర్శి కొయ్యడ కుమార్ మాదిగ, మండల కార్యదర్శి పెండలసురేష్ మాదిగ, మండల నాయకులు పసుల మధుకర్ మాదిగ, బొచ్చు శరత్ బాబుమాదిగ, చిలువేరు రమేష్ మాదిగ, బట్టు సదయ్యమాదిగ, కొమురయ్యమాదిగ, రాజు మాదిగ, రాజయ్య మాదిగలు పాల్గొన్నారు.

**ఐనవోలు :** మండల ఎంఆర్పిఎస్, ఎంఎస్పి అనుబంధ సంగాల అధ్యక్షులు చింత అశోకు మాదిగ ఎమ్మార్పీఎస్ ఇసురం బాబు ఎంఎస్పి అధ్యక్షతన మండల కార్యవర్గం సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎంఎస్పి జిల్లా ప్రధాన కార్యదర్శి బొక్కల నారాయణ మాదిగ పాల్గొని మందకష్ణ మాదిగ ఆదేశాల అనుసారంగా వర్గీకరణలో కమిషనర్ ఇచ్చిన రిపోర్ట్ సరిదిద్దుకొని ఏబిసిడిలుగా విభజించి జనాభా నిష్పత్తి ప్రకారం మాదిగలకు రావాల్సి వాట, ఉపకులాలకురావలసిన వాటా జనాభా నిష్పత్తి ప్రకారం పంపిణీ చేసి అధికారికంగా వర్గీకరణ ప్రకటించాలన్నారు. గ్రూప్ వన్, గ్రూప్ టూ, గ్రూప్ త్రీ మిగిలిన అన్ని ప్రభుత్వ రంగ సంస్థల్లో ఉన్న ఉద్యోగాలను నియమించకూడదని వర్గీకరణ అయిన తర్వాతనే నియమించాలని సీఎంని కోరారు. మండల ఇన్చార్జి బరిగల ఏలియాను ఏకగ్రీవంగా నియమించడం జరిగింది. రేపటి నుండి జరిగే కార్యక్రమాలను, నిర్మాణాలను విజయవంతం చేయుటకు పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమానికి జిల్లా, మండల సీనియర్ నాయకులు బర్ల బాబు, కట్కూరి రమేష్, సింగారపు చంద్రమౌళి, మరిపట్ల దేవదాస్, బరిగేల ఆరోగ్యం, ఆరూరి కుమారస్వామి, బొక్కల అనిల్ మాదిగ, మాదాసి కరుణాకర్, ఆకులపల్లి సాగర్, జలగం ఎల్ల కుమార్, ఆకులపల్లి రాజు, కట్కూరి అరుణ్ మాదిగలు పాల్గొన్నారు.

## అన్నదాత భగీరథ యత్నం



**నవతెలంగాణ-ఎల్కతుర్తి**

రైతన్న వేసిన పంటలను కాపాడుకోవడానికి, అపర భగీరథు డే అవుతున్నాడు. మండలంలో ఏడు గ్రామాలు ఎస్ఆర్ఎల్ స్పీచ్ కెనాల్ ఆయకట్టు కింద ఉన్నాయి. రెండుపంటలు సమృద్ధిగా పండుతాయి. మిగతా 12 గ్రామాలు. 5 అనుబంధ గ్రామాలు, మెట్ట ప్రాంతాలుగా బోర్లు, బావులపై ఆధారపడి వ్యవసాయ పంటలు వేస్తారు. వేసంగిలో 9200 ఎకరాల్లో వరి పంట, 225 ఎకరాల్లో మొక్కజొన్న, 400 ఎకరాల్లో మిరప, 175 ఎకరాల్లో మామిడి తోటలు ఉన్నాయి. ఈ సంవత్సరం సరిగా కాలం కాక చెరువుల్లో నీరు ఇంకిపోయింది. వర్షాకాలంలో వేసిన పత్తి పంట అంతంత మాత్రమే వచ్చింది. ఎప్పుడైనా సరే వేసంగిలో భారీగా పంటలు వస్తాయి. ఆశతో పంటలు వేసుకున్నారు. వరి పొట్ట దశకు వచ్చింది. మొక్కజొన్న పాల గింజ కంకి దశకు వచ్చింది. మామిడి తోట ఇప్పుడిప్పుడే పూతవస్తుంది. ఇప్పుడే బావుల్లో నీరు ఇంకిపోయి రోజుకు రెండు గంటలకు కూడా కరెంటు మోటర్ పోయడం లేదు. 24 గంటలు నడిచేబోర్లు సైతం అంతంత మాత్రం పోస్తున్నాయి. దీంతో రైతన్న వేసిన పంటను దక్కించుకునేందుకు గాను, నల్లగొండ జిల్లా పాలమూరు నుండి సుమారు 250 మంది కుటుంబాలు వ్యవసాయ బావుల్లో పూడికతీత పనులు చేపట్టారు. 6 ఫీట్ల పూడికను తొలగించేందుకు రూ.1 లక్ష వరకు తీసుకుంటున్నారు. అవసరాన్ని బట్టి సుమారుగా 2 లేదా 3 కోలలు తవ్విస్తే రూ.3 లక్షలు అవుతాయి. అదేవిధంగా వారికి ఏమన్నా ప్రమాదం అయితే, రైతన్న భరించాల్సి వస్తుంది. గత నెల రోజుల క్రితం భీమదేవరపల్లి మండలంలోని గట్ల నర్సిపురం గ్రామంలో క్రేన్ తో పూడిక తీస్తుండగా, క్రేన్ గ్రీన్ కుప్పకూలి బావిలో పడింది. కూలీలు ఇద్దరు చనిపోయారు. అక్కడి రైతన్న నష్టపరిహారంగా సుమారు రూ.5లక్షలు వారికి చెల్లించాడు. పోయిన ప్రాణం రానప్పటికీ రైతన్నపై భారం పడింది. దీనికి ముఖ్యంగా ప్రతీ సంవత్సరం ధర్మసాగర్ మండలం దేవాదుల రిజర్వాయర్ నుండి నీరు విడుదల చేసి చెరువులు నింపేవారు. ధర్మసాగర్ మండలం దేవునూర్, సోమదేవరపల్లి, ఎల్కతుర్తి మండలం, దామెర, చింతలపల్లి, ఇంది రానగర్, గోపాల్‌పూర్, జిలుగుల, కోతుల నడుమ, పెంచికలపేట, హుజరా బాద్ మండలం గమ్మక్కపేట వరకు నీళ్ల వెళ్లాయి. అలాగే భీమదేవరపల్లి మండలం కొత్తపల్లి, కొప్పూర్, మాణిక్యపూర్ వరకు నీళ్ల వెళ్లాయి, కానీ ఈ సంవత్సరం నీళ్ల వదలక, ఉపకాల్వలలో చెత్తాచెదారం కూరుకుపోయి, కాలువలు సరిగా లేక అంతంత మాత్రమే నీళ్ల వచ్చాయి. దీంతో రైతన్న గంగను దించడానికి శివుడు అపరధీరథ ప్రయత్నం చేసిన విధంగా, రైతన్న కూడా చేస్తున్నాడు.

ఎలాం టి ఆశ లేకపోయినా, వ్యవసాయాన్ని నమ్ముకున్న రైతన్న వ్యవసాయ మీదనే ఆధారపడి అన్నిప్రయత్నాలు చేస్తున్నాడు. ఇప్పటికి కూడా ప్రభుత్వ అధికా రులు, పాలన యంత్రాంగం స్పందించి ఒక్క 15 రోజుల నీళు దేవాదుల నుం డి విడిస్తే రైతన్నకు ఊపిరిపోసినట్టు అవుతుందని విజ్ఞప్తి చేస్తున్నారు.

## కుల దురంహకార హత్యలపై కేవీపీఎస్ రాజీలేని పోరాటం

- ప్రణయ్ హత్య కేసు నిందితుల శిక్షలపై హర్షం
- కోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం
- కేవీపీఎస్ జిల్లా అధ్యక్షులు ఓరుగంటి సాంబయ్య

**నవతెలంగాణ-ఎన్జీవోస్ కాలనీ**



కాజీపేట మండల కేంద్రంలో మంగళవారం కేవీపీఎస్ సమా వేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సాంబయ్య మాట్లాడుతూ 2018 సెప్టెంబర్ 14న సూర్యపేటలో పెరుమాండ్ల ప్రణయ్ మిట్ట మధ్యాహ్నాం అ త్యంత పాశవికంగా హత్యగావించబడ్డారు. ఈ హత్యకు ప్రధాన కారణం ఒక దళిత యువకుడైన ప్రణయ్ వైశ్య సామాజిక వర్గానికి చెందిన అమతను ప్రేమ వివాహం చేసుకోవడం, మేజర్ లు అయినా ప్రణయ్, అమతలు ఒకరి నొకరు ఇష్టపడి ప్రేమించి పెళ్ళి చేసుకున్నారు. ఈ ప్రేమ వివాహం ఇష్టం లేని అమత తండ్రి మారుతీ రావు బిడ్డను వదిలేస్తున్నట్లు అందర్నీ నమ్మించే విధంగా ప్రకటనలు చేస్తూ, లోపల మాత్రం పగతో రగిలిపోతూ ఒక సుపారి గ్యాంగ్ కు కోటి రూపాయలు లంచం ఇచ్చి ప్రణయ్ ని హత్య చేసే విధంగా ఒప్పందం కుదుర్చుకున్నాడు, ఆ ఒప్పందంలో భాగంగానే సుభాష్ శర్మ అనే నిందితుడు ఎనిమిది మంది తో ఒక ముఠాగా ఏర్పడి పలుమార్లు రెక్కి నిర్వహించి,ప్రణయ్ గర్భవతి అయిన తన భార్య అమతను హాస్పిటల్ తీసుకుని రాగా కాపు కాచి కత్తితో అతి దారుణంగా వెనుక నుండి నరికి కింద పడిన తర్వాత కూడా విచక్షణ రహితంగా అతి కిరాతకంగా ప్రణయ్ నీహత్య చేశారు. ఈ హత్యను రాష్ట్రంలోని వివిధ ప్రజా సంఘాలు, సామాజిక సంఘాలు, రాజకీయ పార్టీలు అనేక విధాలుగా ఖండించాయి. కెవిపిఎస్ కొన్ని సామాజిక సంఘాలను కలుపుకొని ప్రణయ్ హత్య ముమ్మాటికి కుల దురంకార హత్య అని, ఇది ఒక ప్లాన్ ప్రకారం చేసిన హత్య అని, ఈ హత్యలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి శిక్ష పడి తీరాలని అనేక విధాలుగా పోరాటాలు నిర్వహించింది. సెమినార్లు, రౌండ్ టేబుల్ సమావేశాలు, సదస్సులు, నిర్వహించి వివిధ వర్గాల మద్దతును పెద్ద ఎత్తున కూడగట్టింది. స్థానిక ఎంపీ, మిగతా ప్రజా ప్రతినిధులను ఆ కుటుంబానికి అండగా ఉండాలని కోరింది.ఆ విధంగా కేవీపీఎస్ నిందితులను అరెస్టు చేసే వరకు ఒక రాజీ లేని పోరాటం నిర్వహించిన ఫలితంగా వారి మీద ఎస్సీ ఎస్టీ హత్య కేసు నమోదు చేసి ప్రత్యేక కోర్టు ద్వారా విచారణ జరిపి నరికి చంపినటువంటి ఎటు సుభాష్ శర్మకు కోర్టు ఉరిశిక్ష విధించగా, మిగతా ఆరుగురికి జీవిత ఖైదు విధించింది.ఏ -1 మారుతీ రావు 2020లో ఒక లాడ్జిలో ఆత్మహత్యకు పాల్పడ్డారు.కుల దురంకారహత్యకు విధించిన ఈ శిక్షలను కెవిపిఎస్ సంపూర్ణంగా స్వాగతిస్తుంది.ఈ తీర్పు ద్వారా న్యాయం జరుగుతుందని సామాన్య ప్రజానీకానికి అర్థమయ్యే విధంగా, భయపడే వారికి ఒక భరోసానిచ్చే లా కోర్టు తీర్పు ఉందని ఇలాంటి కుల దురంకార హత్యలు జరగకుండా ప్రభుత్వం అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, కులాంతర వివాహాలను ప్రోత్సహించి వారిని ఆర్థికంగా ఆదుకొని, ప్రభుత్వ ఉద్యోగం కల్పించి, ఆ కుటుంబానికి రక్షణ కల్పించాలని అన్నారు.కానీ ప్రభుత్వం ఆ విధంగా చేయకపోవడం వలనే ఈరోజు ఈ కుల దురంకార హత్యలు జరుగుతున్నాయని, ఇవి ప్రభుత్వ హత్యలేనని వీటికి కచ్చితంగా ప్రభుత్వమే బాధ్యత వహించాలని అన్నారు.ఈ కోర్టు తీర్పు ద్వారా హంతకులు మళ్లీ ఏమైనా చేస్తారేమోనని ప్రణయ్ కుటుంబం భయపడుతుందని వారికి ప్రభుత్వం రక్షణ కల్పించాలన్నారు.కుల దురంకార హత్యలు జరగకుండా కెవిపిఎస్ ఆధ్వర్యంలో సామాజిక కార్యక్రమాలతో పాటు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించి,

ఈ దుర్మార్గాలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఆందోళన పోరాటాలు నిర్వహిస్తామని అన్నారు. ఈ సమావేశంలో కెవిపిఎస్ నాయకులు సిలువేరు ప్రభాకర్, కొలుగురి సమ్మయ్య, జీడి జీవన్ కుమార్, ఉంద్రాతి సాంబయ్య, పర్లపెల్లి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



## అధికారిక కార్యక్రమంలో అనధికారికంగా నాయకులు

- ఎమ్మెల్యే సాక్షిగా ప్రోటోకాల్ ఉల్లంఘన
- నిమిత్తమాత్రులుగా ప్రభుత్వ అధికారులు

**నవతెలంగాణ-సంగెం**

మండల కేంద్రంలో మంగళవారం ప్రభుత్వ అధికారిక కార్యక్రమం కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు చెక్కులను అందించారు. మండల అధికారులు తహసిల్దార్ రాజుకుమార్, ఎంపీడీవో రవీందర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమంలో వేదిక మీద అనధికారికంగా అధికార పార్టీకి చెందిన నాయకులు ఆసీనులు కావడం అక్కడికి వచ్చిన వారికి విస్మయానికి గురిచేసింది. ప్రోటోకాల్ ప్రకారం ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు కూర్చోవాల్సిన చోట ఎమ్మెల్యే సాక్షిగా నియమని బంధనల ఉల్లంఘన జరిగిందని అక్కడికి వచ్చిన ప్రజలు చర్చించుకున్నారు. ప్రభుత్వ అధికారులు ఉన్నప్పటికీ తగు సూచనలు చేయకుండా నిమిత్తమాత్రులుగా ప్రేక్షక పాత్ర వహిస్తూ సమావేశంలో ఆసీనులయ్యారు. వంతుల వారిగా ఓనాయకుడి తర్వాత ఓనాయకుడు వేదిక మీద కూర్చోవడం కొస మెరుపు. ప్రభుత్వ కార్యక్రమమా..? పార్టీ సమావేశమా..? తెలియని పరిస్థితి..? ప్రభుత్వ అధికారులే సమాధానం చెప్పాలి.

## చెరువు ఆక్రమణపై చర్యలు తీసుకొని పరిరక్షించాలి

**బీఆర్ఎస్ ఆధ్వర్యంలో తహసిల్దార్‌కు వినతి**

**నవతెలంగాణ-వర్ధన్నపేట**



వర్ధన్నపేట కోనారెడ్డి చెరువు ఆక్రమణపై చర్యలు తీసుకుని పరిరక్షించాలని వర్ధన్నపేట తహసిల్దార్ కు బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. వర్ధన్నపేట తహసిల్దార్‌కు పార్టీ నాయకులు, కార్యకర్తలు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు గోధుమల మధుసూదన్, వర్ధన్నపేట మండల పార్టీ అధ్యక్షులు తూళ్ల కుమారస్వామి, పట్టణ ప్రధాన కార్యదర్శి ఎండీ.ఆజీమ్,పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ తోటకూర శ్రీధర్, మాజీ ఎంపీటీసీ నునావత్ వసంత్, మాజీ కౌన్సిలర్ బానోతు.అనిత శ్రీను, ఉపాధ్యక్షులు భూక్యా రామన్న, కోశాధికారి ఎండీ.సోయల్, డివిజన్ అధ్యక్షులు అనిల్, కొండేటి సుధాకర్, యూత్ అధ్యక్షులు తిరుపతి సురేష్, ఎస్సీ సెల్ అధ్యక్షులు అయిత ఎల్లయ్య, గుడికందులనరసయ్య, కొండేటి భాస్కర్, శ్రీనాధ్‌రావు, పలువురు పాల్గొన్నారు.

## టెస్కాబ్ చైర్మన్‌ను కలిసిన నాయకులు

**నవతెలంగాణ-వర్ధన్నపేట**



ఇటీవల కాంగ్రెస్ పార్టీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులుగా నియామకమైన వర్ధన్నపేట మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన తూళ్ళ రవి పలువురు కలిసి టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా వారిని శాలువాతో సత్కరించారు. ఈకార్యక్ర మంలో వర్ధన్నపేట మార్కెట్ కమిటీ చైర్మన్ నరుకుడు వెంకటయ్య, ఐనవోలు దేవస్థానం చైర్మన్ కమ్మగోని ప్రభాకర్ గౌడ్, ల్యాబర్తి మాజీ ఎంపీటీసీ సూరారపు నిరంజన్, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి

**నవతెలంగాణ-సంగెం**



విద్యార్థి దశ నుంచే ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకొని కష్టపడి చదవి, భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ కార్యదర్శి డాక్టర్ పల్లెపాడు దామోదర్ అన్నారు. మంగళవారం సర్వోదయ యూత్ ఆర్గనైజషన్ ఆధ్వర్యంలో సంగెం మండలంలోని గవిచర్ల, గీసుగొండ మండలంలోని కొమ్మాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మాదకద్రవ్యాల దుష్పరిణామాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఉన్నత స్థాయికి ఎదగడానికి ఎలాంటి బలహీనతలు ఉండరాదని, ముఖ్యంగా విద్యార్థులు మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల వ్యసనాలకు దూరంగా ఉండాలని, బలహీనతలు జయించిన వారే బలవంతులు అవుతారన్నారు. విద్యార్థులు చదువులతోపాటు ఆటలు, వ్యక్తిత్వ వికాసం పై దృష్టి పెట్టాలన్నారు. అనంతరం సర్వోదయ నిర్వహించిన పోటీలో గెలుపొందిన 18 మంది విద్యార్థులకు బ్యాగ్స్, పుస్తకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీసీపీఓ రాజు, ప్రధానోపాధ్యాయులు డి.రమ, ఉపాధ్యాయులు, సర్వోదయ క్లస్టర్ కో-ఆర్డినేటర్ వనిత, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో ఎదగాలి

- మాజీ కార్పొరేటర్ బోడ డిన్నా

**నవతెలంగాణ-పర్వతగిరి**



విద్యార్థులు కష్టపడి చదివి ఆత్మవిశ్వాసంతో ఉన్నత శిఖరాలను చేరుకోవాలని బల్దియా మాజీ కార్పొరేటర్, ఎడ్యుకేట్ ఏ జనరేషన్ ఆర్గనైజేషన్ ఇన్‌ఛార్జ్ బోడ డిన్నా అన్నారు. పర్వతగిరి మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలిక విద్యాలయంలో స్వేరోస్ నాయకులు గారే జయరాజ్ ఆధ్వర్యంలో మంగళవారం పదవతరగతి విద్యార్థినులకు పరీక్ష సామాగ్రి పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో భాగంగా ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతిభకు పేదరికం ఎప్పుడూ అడ్డుకాదని, అమ్మాయిలు ఆత్మవిశ్వాసంతో జీవితంలో ముందుకెళ్లాలన్నారు. అనంతరం పర్వతగిరి మండల విద్యాశాఖాధికారి గాయపు లింగారెడ్డి, పర్వతగిరి కాంప్లెక్స్ హెడ్మాస్టర్ పాక రమేష్ బాబులు మాట్లాడుతూ పదవ తరగతి పరీక్ష సమయం సమీపిస్తునందున ఆందోళనకు, ఒత్తిడికి గురి కావద్దని, ప్రణాళిక ప్రకారం చదువుతూ సమయాన్ని సద్వినియోగం చేసుకుంటే మంచి మార్కులు సాధించవచ్చన్నారు. కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ నాజియా సల్మా మాట్లాడుతూ మంచి ఉత్తీర్ణత సాధించి తల్లిదండ్రులకు పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని పదవతరగతి విద్యార్థులను కోరారు. ఈకార్యక్రమంలో స్వేరోస్ వరంగల్ జిల్లా కార్యదర్శి కందికట్ల ప్రవీణ్, వరంగల్ జిల్లా నాయకులు తేజస్వినీ, జోనల్ నాయకులు యాకయ్య, బానోతు రమేష్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలకు ఎర్రబెల్లి పరామర్శ..

**నవతెలంగాణ-రాయపర్తి**

టిఆర్ఎస్ పార్టీలో ఉన్న ప్రతి ఒక్క కార్యకర్త తమ కుటుంబ సభ్యుడే అని సంభోదించి రాష్ట్ర మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు మాట్లాడారు. మంగళవారం మండల కేంద్రానికి చెందిన కుంట రాజు రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా రాజు కుటుంబ సభ్యులను పరామర్శించారు. తదుపరి మండల కేంద్రానికి చెందిన కసరబోయిన కొమురయ్య, కొత్తూరు, ఉకల్ గ్రామాల్లో ఇటీవల కాలంలో మృతి చెందిన బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కార్యకర్తల కుటుంబాల్లో విషాదఛాయలు ఆములుకోవడం బాధాకరమన్నారు. ప్రతి కుటుంబానికి అండగా ఉంటా అని హామీ ఇచ్చారు. ఆయనతోపాటు మాజీ ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, మాజీ జడ్పీటీసీ రంగు కుమార్, మాజీ సర్పంచ్ గారె నర్సయ్య, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పూస మధు, మాజీ ఎంపీటీసీ ఐత రాంచందర్, నాయకులు బందెల బాలరాజు, ముద్రబోయిన సుధాకర్, ఎండి అక్బర్, చందు రాము, ఉబ్బని సింహాద్రి, ఐత రవి తదితరులు ఉన్నారు.

## బీఆర్ఎస్ పాలనలోనే యాదవులకు గుర్తింపు

- స్టేట్ చీఫ్ గోట్ ఫెడరేషన్ మాజీ చైర్మన్ దూదిమెట్ల బాలరాజుయాదవ్

**నవతెలంగాణ-పర్వతగిరి:**



బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలోనే యాదవులకు ప్రత్యేక గుర్తింపు లభించిందని తెలంగాణ స్టేట్ చీఫ్ గోట్ ఫెడరేషన్ ఎక్స్ చైర్మన్ దూదిమెట్ల బాలరాజు యాదవ్ అన్నారు. మండలంలోని బూరుగుమల్లలో మంగళవారం యాదవ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన మల్లన్న, ఎల్లమ్మ పట్నాలకు ఆయన హాజరయ్యారు. ఈక్రమంలో బాలరాజును యాదవ సంఘం సభ్యులు ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడారు. యాదవ సంఘం పటిష్టతకు ప్రతి ఒక్కరు బాధ్యులు కావాలన్నారు. టిఆర్ఎస్ పాలనలోనే యాదవులకు ప్రత్యేకమైన గుర్తింపుని ఇచ్చారని గుర్తు చేశారు. రాబోయే రోజుల్లో మళ్లీ కేసీఆర్ ఆధ్వర్యంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు అవుతుందని ఆయన ధీమా వ్యక్తంచేశారు. బూర్గుమల్ల గ్రామానికి చెందిన యాదవ సంఘం సభ్యులు దూదిమెట్ల కుమార్‌యాదవ్, వేల్పుల శ్రీను, పెద్దబోయిన వెంకన్న, మాడెం కుమార్, శ్రీనివాస్, యాకయ్య, వెంకన్న, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల క్రమబద్ధీకరణలో ఆర్‌పీల సేవలు కీలకం

- నగర మేయర్ గుండు సుధారాణి
- రిసోర్స్ పర్సన్స్‌తో సమావేశం

**నవతెలంగాణ-వరంగల్**



ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల క్రమబద్ధీకరణలో ఆర్‌పీల సేవలు కీలకమని నగర మేయర్ గుండు సుధారాణి అభిప్రాయ పడ్డారు. మంగళ వారం బల్దియా ప్రధాన కార్యాలయంలో టౌన్ ప్లానింగ్ అధికారులు, రిసోర్స్ పర్సన్స్‌లతో ఏర్పాటు చేసిన సమావేశంలో మేయర్ పాల్గొని సమర్థవంతంగా నిర్వహించుటకు తగు సూచనలు చేశారు. ఈసందర్భంగా మేయర్ మాట్లాడుతూ 26 ఆగస్టు 2020కు ముందు రిజిస్ట్రేషన్ అయిన తర్వాత కచ్చా లేఔట్ చేసిన వారు, వాటిలో ప్లాట్ లు తీసుకున్న ఎల్ఆర్ఎస్‌కు వచ్చిన దరఖాస్తుదారులు క్రమబద్ధీకరించుకునేలా ఫోన్ ద్వారా అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. రెగ్యులరైజ్ చేసుకోవడానికి 25 శాతం రాయితీతో ఈనెలాఖరు మార్చి 31 వరకే ప్రభుత్వం గడువు కల్పించిందని, గడువు పొడగింపు ఉండదని, కల్పిస్తున్న రాయితీ ప్రోత్సాహకాన్ని సద్వినియోగం చేసుకునేలా ప్రతి ఆర్‌పీ 100 మంది దరఖాస్తుదారులకు ఫోన్ ద్వారా సమాచారం అందజేయాలని క్రమబద్ధీకరణ విధానాన్ని తెలియజేసి మార్చి 31 కంటే ముందుగా పేమెంట్ చేసేలా చూడాలని, ప్రజలకు అవగాహన కల్పించడానికి బల్దియా ప్రధాన కార్యాలయంతో పాటు సర్కిల్ కార్యాలయాల్లో హెల్ప్ డెస్క్ లు ఏర్పాటు చేసిన దరిమిలా వాటి సేవలు వినియోగించుకోవాలని జిడబ్ల్యుఎంసీకి సంబంధించిన మీ-సేవా కేంద్రాల్లో కూడా చెల్లింపులు చేయవచ్చునని ప్లాట్ల క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకున్న వారి మొబైల్ ఫోన్ లకు పేమెంట్ లింక్ కూడా వస్తుందని దాని ద్వారా కూడా చెల్లింపులు జరుపవచ్చునని, 25 శాతం రిబెట్ అనేది చక్కని అవకాశమని రిబేట్ పొడిగింపు ఉండదని దరఖాస్తు చేసుకున్న వారికి స్పష్టంగా తెలియజేయాలని ఆర్‌పీలకు మేయర్ సూచించారు. ఈకార్యక్రమంలో ఇన్‌ఛార్జ్ సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, డిప్యూటీ కమిషనర్ రాజేశ్వర్‌రావు, ఏసీపీలు ఏర్షాద్, రజిత, టీఎంసీ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# తల్లిదండ్రులు చూపిన మార్గంలో పయనిస్తా



- సొసైటీ ద్వారా సేవా కార్యక్రమాలు
- ప్రతి ఒక్కరూ లేబర్ కార్డు కలిగి ఉండాలి
- 50 చర్చిలకు ఉచితంగా నేమ్ బోర్డ్స్ పంపిణీ
- డబ్ల్యూసీఎస్ చైర్మన్ దీన్ దయాల్

**నవతెలంగాణ-కాశిబుగ్గ**

తన తల్లిదండ్రులు చూపిన మార్గంలో పయనిస్తూ తన వంతు సమాజానికి సేవ చేస్తానని వరంగల్ క్రిస్టియన్ సొసైటీ చైర్మన్ సరిగొమ్ముల దీన్ దయాల్ అన్నారు. మంగళవారం నగరంలోని చింతల్ సీఎస్ఐ చర్చిలో వరంగల్ క్రిస్టియన్స్ సొసైటీ ఆధ్వర్యంలో చైర్మన్ సరిగొమ్ముల దీన్ దయాల్ తన తల్లిదండ్రులు సరిగోమ్ముల సుగుణమ్మ - ప్రకాశంల జ్ఞాపకార్థం ఎంపికైన 50 క్రైస్తవ మందిరాలకు ఉచితంగా నేమ్ బోర్డులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వరంగల్ క్రిస్టియన్ సొసైటీ చైర్మన్‌గా ప్రజల అవసరాలను బట్టి విద్య, వైద్యం ఇతర సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. మానవసేవయే మాధవసేవగా భావించి యువత మంచి మార్గంలో నడవడానికి తన వంతు ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు. వరంగల్ క్రిస్టియన్ సొసైటీ లోని పాస్టర్లు సభ్యులందరూ తప్పనిసరిగా లేబర్ కార్డు తీసుకోవాలని, తద్వారా ఎన్నో ప్రయోజనాలు పొందవచ్చునని వివరించారు. ప్రభుత్వం నుండి వచ్చే బెనిఫిట్స్ అర్హులైన క్రిస్టియన్లకు అందే విధంగా తన వంతు ప్రయత్నం చేస్తానన్నారు. వరంగల్ పరిధిలోని చర్చిల భూమి రిజిస్ట్రేషన్ కాని ఎడల తమ దృష్టికి తీసుకువస్తే మంత్రి తోటి మాట్లాడి సమస్య పరిష్కారం అయ్యేలా చూస్తామన్నారు. అనంతరం వరంగల్ క్రిస్టియన్ సొసైటీ గౌరవ అధ్యక్షుడు పుల్ల జగ్జీవన్ బాబ్జి మాట్లాడుతూ క్రిస్టియన్ అంటే మతం కాదని, మనిషిని సన్మార్గంలో నడిపించేదన్నారు. అనంతరం చింతల్ సీఎస్ఐ చర్చ్ సంఘ కాపరి, సొసైటీ ముఖ్య సలహాదారు ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ వరంగల్ క్రిస్టియన్ సొసైటీ ద్వారా దీన్‌దయాల్ క్రైస్తవులందరినీ ఏకం చేసి, వారికి అండగా ఉండడం అభినందనీయమన్నారు. ఈకార్యక్రమంలో వరంగల్ క్రిస్టియన్స్ సొసైటీ అధ్యక్షుడు గంధం అరుణ్ జేమ్స్ వైస్ చైర్మన్ ఎంఎస్ రాజు సలహాదారులు శ్రీనివాస్‌నాయక్, సామ్యూల్, సుభాష్, వినయ్ కుమార్, కరుణ్ శ్రావణ్, సామ్యూల్, మహేందర్ పాల్, సూర్య జడ్సన్, శ్రీనివాస్ పాల్, మోసెస్, రాజు, గుండేటి శ్యామ్, సురేష్, విజయ్‌కుమార్, టింబర్ లేక్, పాస్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

# కాన్పు కోసం వచ్చి.. కానరాని లోకానికి ..!

- వైద్యం వికటించి బాలింత మృతి
- మృతురాలి కుటుంబసభ్యుల ఆందోళన
- ఆసుపత్రి ఎదుట పెద్దఎత్తున మోహరించిన పోలీసులు

**నవతెలంగాణ-వరంగల్**



కానుపు కోసం వచ్చి కానరా లోకానికి వెళ్లివా బిడ్డ అంటూ తల్లిదండ్రులు, బంధువులు విలపిస్తూ ఏడవడంతో చూసిన జనం కన్నీళ్లు పెడుతున్న శోకసముద్రంలో మునిగిపోయారు. వరంగల్ ఎంజీఎం సమీపంలోని క్యూర్‌వెల్ ప్రసూతి ఆసుపత్రిలో దారుణం చోటుచేసుకుంది. కాన్పు కోసం క్యూర్‌వెల్ ఆసుపత్రికి వచ్చిన మహిళ ప్రాణాలు కోల్పోయిన ఘటన క్యూర్ వెల్ ఆస్పత్రిలో జరిగిన సంఘటనను చూస్తే ప్రైవేట్ ఆసుపత్రుల్లో అర్హత లేని వైద్యులచే వైద్యం చేస్తున్నట్లు వచ్చిన ప్రజలు చర్చించుకుంటున్నారు. బంధువులు తెలిపిన వివరాల ప్రకారం హనుమకొండ జిల్లా వేలేరు మండలం పీసర గ్రామానికి చెందిన జినుకల ప్రవళిక (25) నిండు గర్భంతో కాన్పు కోసం ఆదివారం రాత్రి 8 గంటలకు క్యూర్‌వెల్ ఆసుపత్రిలో అడ్మిట్ అయింది. గర్భిణీకి అన్ని రకాల పరీక్షలు చేసి సోమవారం ఉదయం 9 గంటలకి డెలివరీ కోసం ఆపరేషన్ థియేటర్‌కి తీసుకెళ్లారు. 10 గంటలకు ఆపరేషన్ సక్సెస్ అయింది. ఆడపిల్ల పుట్టింది తల్లి, బిడ్డ క్షేమంగానే ఉన్నారని కుటుంబ సభ్యులకు వైద్యులు తెలిపారు. అర్ధగంట గడవకముందే ప్రవళికకు తీవ్ర రక్త స్రావం కావడం ప్రారంభమైంది. వెంటనే వైద్యులు మరల ఆపరేషన్ థియేటర్‌కు తీసుకెళ్లి సుమారు 15 యూనిట్ల రక్తం ఎక్కించారని తెలిపారు. రక్తస్రావం అదుపులోకి రాకపోవడంతో వైద్యులు ప్రవళికకు గర్భసంచి తొలగిస్తేనే ఎలాంటి ప్రాణాపాయం ఉండదని కుటుంబ సభ్యుల చేత బలవంతంగా సంతకాలు చేయించుకున్నారు. రాత్రి 8 గంటల ప్రాంతంలో కుటుంబ సభ్యులకు చెప్పకుండా అంబులెన్స్‌ను రప్పించి ప్రవళికను హనుమకొండలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించడానికి ఏర్పాట్లు చేశారు. దీంతో భయాం దోళనకు గురైన ప్రవళిక సోదరుడు ప్రవీణ్ అక్కను చెప్పకుండా ఎక్కడకు తీసుకువెళ్తున్నారని హుటా హుటిగా అంబులెన్స్ వద్దకు పరిగెత్తే క్రమంలో మెట్ల పైనుంచి జారిపడి కాలు విరిగిందని చెప్పారు. అయినా ఆస్పత్రి యాజమాన్యం పట్టించుకోకుండా ప్రవళికను హనుమకొండలోని ఓ ప్రైవేట్ హాస్పటల్‌కు తరలించారు. తీరా అక్కడికెళ్లక ప్రవళిక మరణించిందని వైద్యులు తెలిపారు. దీంతో ఆందోళనకు గురైన ప్రవళిక భర్త రాజు, తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు క్యూర్ వెల్ ఆస్పత్రి వైద్యులను అడుగగా మాకు ఏమీ సంబంధం లేదు అన్నట్లు నిర్లక్ష్యంగా వ్యవహరించారని తెలిపారు. ఖచ్చితంగా ఇది వైద్యుల నిర్లక్ష్యం వల్లనే జరిగిందని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు మాకు సరైన న్యాయం చేయాలని ఆస్పత్రి నందు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. వరంగల్ ఏసీపీ నందిరాం నాయక్ ఆసుపత్రి వద్దకు వచ్చి ఎలాంటి సంఘటనలు జరగకుండా బందో బస్తు చేపట్టారు.

## విద్యార్థులు ఉన్నత లక్ష్యం దిశగా ముందుకు సాగాలి

- విద్యార్థులకు దుప్పట్లు, న్యాప్‌కిన్స్ పంపిణీ

**నవతెలంగాణ-నెక్కొండ**



పదవ తరగతి విద్యార్థులు ఎంచుకున్న లక్ష్యం దిశగా ముందుకు సాగి ఆశించిన ఫలితాలు సాధించి ఉన్నత స్థాయిలో నిలవాలని ఎంఈవో రత్నమాల అన్నారు. మండ లంలోని పెద్దకొర్పోలు కస్తూరిబా గాంధీ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు దుప్పట్లు, శానిటరీ న్యాప్‌కిన్స్‌లను పాఠశాల ప్రత్యేకాధికారి బి.రజిత, ఉపాధ్యాయులతో కలిసి విద్యార్థులకు ఎంఈఓ పంపిణీ చేసి మాట్లాడారు. రాబోయే పదవ తరగతి పరీక్షలకు విద్యార్థులకు పూర్తిస్థాయి సన్నద్ధం కావాలని, 10 పాయింట్లకు 10 సాధించేలా ప్రణాళికతో చదివి ప్రతిభచూపాలన్నారు. పది, ఇంటర్‌లో కష్టపడి చదివితేనే ఉన్నతస్థాయికి చేరుకుంటారన్నారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయినిలు విజయశ్రీ, లక్ష్మీ, అనిత, రజిత, భార్గవి, గౌతమి పాల్గొన్నారు.

## విద్యుత్ అధికారుల పొలంబాట

**నవతెలంగాణ-నెక్కొండ**

రైతులు, విద్యుత్ వినియోగదారులు విద్యుత్ ప్రమాదాలపట్ల జాగ్రత్తలు పాటించాలని, విద్యుత్ ప్రమాదాలబారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకుని ప్రమాదాల నివారణకు తోడ్పడాలని ఏడీఈ శ్రీధర్ అన్నారు. మండలంలోని సూరిపల్లి గ్రామంలో విద్యుత్‌శాఖ పోలం బాట కార్యక్రమంలో భాగంగా విద్యుత్ శాఖ ఏఈ చిరంజీవి, అధికారులు వ్యవసాయ చేళ్ల వద్ద రైతులతో కార్యక్రమాన్ని నిర్వహించారు. వేసవి కాలంలో సంభవించే విద్యుత్ ప్రమాదాల పట్ల జాగ్రత్తలు వహించాలని, పంట చేళ్ల వద్ద, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద విద్యుత్ అధికారుల సలహాలమేరకు పనులు చేయించుకోవాలని, రైతులు నేరుగా ట్రాన్స్‌ఫార్మర్ల రిపేర్లు చేపట్టరాదన్నారు. వేలాడే వైర్లను సరిచేస్తున్నామని, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద రక్షణ ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. ఈకార్యక్రమంలో ఏఎల్ఎం చీకటి నవీన్ , రైతులు పాల్గొన్నారు.

## వర్గీకరణను అమలు చేశాకే ఫలితాలు విడుదల చేయాలి

**నవతెలంగాణ-వర్ధన్నపేట:**

ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణను అమలు చేశాకే ఉద్యోగ ఫలితాలు విడుదల చేయాలని, మాదిగలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో వర్ధన్నపేట పట్టణ కేంద్రంలో రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు. అంబేద్కర్ సెంటర్ వద్ద మహాజననేత పద్మశ్రీ మందకృష్ణ మాదిగ పిలుపుమేరకు ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు చేపట్టడం జరిగిందనీ ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌ఛార్జ్ బిర్రు మహేందర్ మాదిగ తెలిపారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు ఎర్ర సంతోష్ మాదిగ అధ్యక్షత వహించగా ఈ కార్యక్రమానికి ముఖ్య మాదిగ మాస్ రాష్ట్ర అధ్యక్షులు జన్ను రాములు, మాదిగ బిర్రు మహేందర్ లు హాజరై దీక్షలు ప్రారంభించి వారు మాట్లాడారు. రాష్ట్రంలో రేపటి నుండి జరుగు అసెంబ్లీ సమావేశాల్లో వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి జస్టిస్ షమీమ్ అక్తర్ ఇచ్చిన నివేదికలో ప్రకారం 15 లక్షలు ఉన్న మాలలకు ఐదు శాతం రిజర్వేషన్ కల్పించినప్పుడు 32 లక్షల పైగా ఉన్న మాదిగలకు 11 శాతం రిజర్వేషన్ కేటాయించాలని వారు డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో ఎమ్మెల్సీ వరంగల్ జిల్లా అధికార ప్రతినిధి మాసాని గోపాల్ మాదిగ, ఎమ్మార్పీఎస్ వరంగల్ జిల్లా సీనియర్ నాయకులు గోలి సుధాకర్ మాదిగ, ఎంఎస్‌పీ వర్ధన్నపేట మండల అధ్యక్షులు ముత్యాల మల్లేష్ మాదిగ, ఎంఎస్‌పీ మండల అధికార ప్రతినిధి బిర్రు భిక్షపతి, ఎమ్మార్పీఎస్ యువసేన మండల అధ్యక్షులు మైదం రంజిత్ మాదిగ, జంగిల్ భాస్కర్ మాదిగ, మాసాని సుధాకర్ మాదిగ, మాసాని రవీందర్ మాదిగ, జనగామ చంద్రమౌళి మాదిగ, ముత్యాల నరేందర్ మాదిగ, డెక్క దేవేందర్ మాదిగ, గోలి రాజు, మాదిగ తదితరులు పాల్గొన్నారు.



## మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ

**నవతెలంగాణ-పర్వతగిరి**



మండలం పరిధిలోని కొంకపాక గ్రామానికి చెందిన కొంకపాక మాజీ ఎంపీటీసీ కరిమళ్ళ మోహన్ రావు అల్లుడు దుగ్యాల నవీన్ కుమార్ అనారోగ్యంతో మరణించగా మంగళవారం హనుమకొండ స్నేహ నగర్ లోని వారి నివాసానికి వర్ధన్నపేట ఎమ్మెల్యే కే ఆర్ నాగరాజు వెళ్లి భౌతిక దేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అలాగే మండలంలోని రోళ్లకల్‌లో బానోతు సువాలి మరణించగా వారి కుటుంబ సభ్యులను, మండలంలోని కల్లెడకు చెందిన వసంతరావు రోడ్డు ప్రమాదంలో మరణించగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట టీపీసీసీ లీగల్ చైర్మన్ నిమ్మాని శేఖర్‌రావు, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు అనిల్‌రావు, కాంగ్రెస్ పార్టీ పర్వతగిరి మండల అధ్యక్షులు జాటోతు శ్రీనివాస్‌నాయక్, కల్లెడ గ్రామ పార్టీ అధ్యక్షులు ముదురుకోల రమేష్, స్థానిక నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కంప్యూటర్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

**నవతెలంగాణ-పర్వతగిరి**

మండలంలోని కల్లెడ ఆర్‌డీఎఫ్ వనిత అచ్యుతపాయ్ విద్యాలయ జూనియర్ కళాశాలలో మహిళలకు, విద్యార్థులకు వేసవి సెలవులలో బాగంగా కంప్యూటర్ పై అవగాహన, టాలీలో శిక్షణ ఇవ్వబడునట్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఆడేపు జనార్ధన్ కోరారు. కోర్సు వ్యవధి 45 రోజులు, ఈ నెల 20 నుండి ప్రారంభమవుతుందని ప్రతిరోజు రెండు గంటల సమయం వ్యవధి అని, 24 గంటల ఇంటర్‌నెట్ సదుపాయం, ఒక గంట క్లాస్, ఒక గంట ప్రాక్టీస్ వుంటుందని తెలిపారు. ఆసక్తిగల మహిళలు, గృహిణిలు, విద్యార్థులు కళాశాలకు విచ్చేసి పేర్లను నమోదు చేసుకోవాలని మరిన్ని వివరాలకు 9490379775, 9494921759 మొబైల్ నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

## మార్చి 13న ధర్నాను జయప్రదం చేయండి

- ఏఐకేఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎండీ.ఇస్మాయిల్

**నవతెలంగాణ-పర్వతగిరి**

కేంద్ర ప్రభుత్వం రైతాంగ సమస్యలను ఉద్దేశపూర్వకంగా నిరీక్షణ చేస్తూ కార్పొరేట్ శక్తులకు పెద్దపీట వేస్తుందని ఇందుకు నిరసనగా ఈనెల 13న ఇందిరా పార్కు వద్ద జరిగే ధర్నాను విజయవంతం చేయాలని అఖిల భారత కిసాన్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు ఎండీ.ఇస్మాయిల్ మంగళవారం పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం రైతాంగానికి సంబంధించిన నల్ల చట్టాలను పూర్తిగా అమలు చేయబోతూ, మార్కెట్ నూతన విధానాన్ని అమలు చేస్తూ రైతులకు చేస్తున్న ఉద్యమాన్ని అరెస్టులతో ఆపలేరని, కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా ఈనల్ల చట్టాలను వెనక్కి తీసుకొని రైతు సంఘం నాయకులు పెట్టిన కేసులు వెంటనే వెనక్కి తీసుకోవాలని, రైతులకు ఇచ్చిన మాట ప్రకారం నల్ల చట్టాలను వెనుకకు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఈనెల మార్చి 13నహైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద జరిగే మహాధర్నాను రైతులు, మేధావులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## దేవాలయ పునర్నిర్మాణానికి విరాళాలు

**నవతెలంగాణ-పర్వతగిరి**



మండలంలోని గోపనపల్లిలోని శ్రీ దూడల మల్లికార్జున స్వామి ఆలయ అభివృద్ధి పునర్నిర్మాణంలో భాగంగా శ్రీదూడల మల్లికార్జున స్వామి ఆలయ అభివృద్ధి కమిటీకి గోపనపల్లికి చెందిన శామల శ్రీనివాస్-విజయ, రవీందర్-రాధికలు ఆలయ పునర్నిర్మాణానికి రూ.10,116లు పది వేల నుట పదహారు విరాళంగా అందజేశారు. అలాగే అదే గ్రామానికి చెందిన బెల్లం రాజబాబు-కవితలు రూ.10,116, దామెర శ్రీనివాస్-మంజుల రూ.5,116, మదూరి రాజ్ కుమార్-రమాదేవి, అజయ్-ఉమారాణి దంపతులు రూ.5,116, కేసముద్రం మండల కేంద్రానికి చెందిన బోల్ల దురేష్-రమాదేవి దంపతులు కేతమ్మ, మెడలమ్మ లకు ముక్కు పుడకలు, స్వామి వారికి వెండి మీసాలను తయారు చేసి వితరణ చేసినట్లు మంగళవారం ఆలయ కమిటీ చైర్మన్ బెల్లం రాధిక రాజు తెలిపారు.

## ఆలయ నిర్మాణానికి విరాళం

**నవతెలంగాణ-పర్వతగిరి**



మండలం లోని వడ్లకొండ గ్రామంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన శ్రీకంఠ మహేశ్వర స్వామి శ్రీసురమాంబదేవి ఆలయం నూతనంగా నిర్మిస్తున్న స్వామి ఆలయ నిర్మాణం కొరకు వడ్లకొండకు చెందిన మాజీ ఎంపీటీసీ అత్తి రేవతి కుమారస్వామి తమ వంతు విరాళంగా రూ.5,116లు నగదు రూపకంగా ఆలయ కమిటీకి మంగళవారం అందజేశారు.

## మృతుడి కుటుంబానికి ఎర్రబెల్లి పరామర్శ..

**నవతెలంగాణ-పర్వతగిరి**



మండలంలోని కొంకపాక మాజీ ఎంపీటీసీ కరిమిళ్ళ మోహన్ రావు అల్లుడు దుగ్యాల నవీన్ కుమార్ అనారోగ్యంతో మరణించగా మంగళవారం మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఆయన వెంట స్థానిక నాయకులు, కుటుంబ సభ్యులు ఉన్నారు.

## మాదిగలకు ఇచ్చిన మాటను సీఎం నిలబెట్టుకోవాలి

- ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కట్ల రాజశేఖర్

**నవతెలంగాణ-కాశిబుగ్గ**



అసెంబ్లీ సాక్షిగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాదిగలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని ఎమ్మార్పీఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు కట్ల రాజశేఖర్ మాదిగ అన్నారు. మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు వరంగల్ తూర్పులో ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌ఛార్జ్ ఈసంపల్లి రాజు ఆధ్వర్యంలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలను మంగళవారం రాజశేఖర్‌తో పాటు ఫార్వర్డ్ బ్లాక్ రాష్ట్ర నాయకులు ఈసంపల్లి వేణు, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చేతల రమేష్, తదితరులు సందర్శించారు. ఈకార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు పాల్గొన్నారు.